

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 11-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 117 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి పూర్తి; నక్షత్రం: స్వాతి పూర్తి; వర్జ్యం: మ. 12.03-1.50; దుర్ముహూర్తం: సా. 4.58-5.48; అమృతఘడియలు: రా. 10.44-12.31; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బంగ్లా సీజే రాజీనామా

ప్రధాన న్యాయమూర్తి ఒబైదుల్ హసన్ లక్ష్యంగా ఢాకాలో విద్యార్థుల ఆందోళన

సుప్రీంకోర్టును చుట్టుముట్టి నిరసన

గంట వ్యవధిలో రాజీనామాకు పట్టు 2

షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర

తాత్కాలిక సీజేగా అష్ఫుఖుల్ నియామకం

ఆ విష ప్రచారానికి విరుగుడేదీ?



బంగ్లాదేశ్ వంటి పరిణామాలు మన దేశంలో జరగకపోవచ్చును గానీ, నిజాయతీపరులు, ప్రజాస్వామ్య ప్రియులు, కష్టపడి సంపాదించి పన్నులు కడుతున్న వారిలో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అది ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా పెల్లుబకవచ్చు.

న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు ఈ దేశంలో ఎంత మంది వెళ్లగలరు? వెళ్లినా న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ఉంటుందా? అదీ లేదు. మన దేశంలో అన్ని వ్యవస్థలూ కుప్పకూలి పోయాయన్నది మెజారిటీ ప్రజల భావన. ఇతర వ్యవస్థల్లో న్యాయం దక్కనప్పుడు ఎవరైనా న్యాయ వ్యవస్థ తలుపు తడతారు. అక్కడ కూడా వెంటనే న్యాయం దక్కుతుందన్న భరోసాగానీ, అసలు న్యాయం లభిస్తుందన్న గ్యారంటీగానీ లేకుండా పోయింది.

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత ఉండిందో అంత భద్రత కావాలని కోరుతున్నారంటే జగన్ ప్రజారంజక పాలన కాకుండా ప్రజాకంటక పాలన అందించారని భావించడం తప్పు కాదనుకుంటా!

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలే అయింది. ఇంతలోనే జగన్ రెడ్డిలో అసహనం పెరిగిపోతోంది. తన పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలైందన్న విమర్శలు వచ్చినందున ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆయన విమర్శిస్తున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయని, పెట్టుబడులకు భద్రత ఉండదని, తెలంగాణ వైపు చూడండని తన మద్దతుదారులతో సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని కోరే దాకా వెళ్లారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

గడచిన కొద్ది రోజులుగా జగన్ రోత మీడియాలో వస్తున్న వార్తలను గతంలో ఇతర పత్రికలు ప్రచురించి ఉంటే కేసులు పెట్టి ఉండేవారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని ప్రచారం చేస్తున్న వారిపై కూడా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.

2014-19 మధ్య కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పితాలు ప్రచారం చేసి జగన్ అండ్ కో లబ్ధి పొందింది. ఇప్పుడు కూడా అవే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అసత్య ప్రచారాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే వారిపైన, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు కూడా తీసుకోని పక్షంలో అది అసమర్థత అవుతుంది. గతంలో చంద్రబాబు ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకుంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

ప్రజల వద్దకే పాలన

భూ సమస్యలపై 15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు



45 రోజుల పాటు నిర్వహణ.. మరో 45 రోజుల్లో పరిష్కారం

వైసీపీ భూ కబ్జాలు, రీ సర్వేతో వచ్చిన కష్టాలూ చెప్పుకోవచ్చు

ప్రజల నుంచి 5 కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరణ

ఆర్టీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగంతో పర్యవేక్షణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టిన భూ వివాదాల చిచ్చును పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం నడుం బిగించింది. 'ప్రజల వద్దకే పాలన' తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఎక్కడికక్కడ అధికారులు భూ సమస్యలను తెలుసుకుంటారు. ఆగస్టు 15వ తేదీ నుంచి 45 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మరో 45 రోజుల్లో సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తారు. గత ఐదేళ్లలో భారీగా భూ అక్రమాలు జరిగాయి. పేదలు, బడుగువర్గాలు, అణగారిన వర్గాల భూములను వైసీపీ నేతలు దౌర్జన్యంగా

మిగతా 11వ పేజీలో...

ఎవరెవరు పాల్గొంటారు

గ్రామ సదస్సుల్లో...
1.తహసీల్దార్, 2.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, 3.గ్రామ రెవెన్యూ అధికారి, 4. మండల సర్వేయర్, 5. దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, 6. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, 7.అటవీ శాఖ అధికారి పాల్గొంటారు. సున్నితమైన భూసమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తారు.

'ఫ్రీహోల్డ్' బంద్

అక్రమాలపై విచారణకు ఆదేశం

గత సర్కారులో 9 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్‌లోకి

ప్రభుత్వ భూముల రికార్డులూ మార్చేశారు..

మొత్తం పరిశీలనకు కొత్త ప్రభుత్వ ఆదేశం

ఫ్రీహోల్డ్ చేసిన భూములన్నీ పరిశీలించి నివేదిక

వాటి రిజిస్ట్రేషన్లు మూడు నెలలు నిలిపివేత

ఇప్పటికే చేతులు మారిన భూములపై విచారణ

కలెక్టర్ నేతృత్వంలోని బృందం పరిశీలన

3 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అడ్డగోలుగా సాగిన 'ఫ్రీహోల్డ్'పై కూటమి సర్కారు దృష్టి సారించింది. నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగి, చేతులు మారిన భూములపై విచారణ జరపాలని నిర్ణయించింది. 'ఫ్రీహోల్డ్' చేసిన భూములకు సంబంధించి ప్రతి సర్వే నంబరును పరిశీలించాలని ఆదేశించింది. అంతా సక్రమంగానే జరిగిందా లేక అక్రమాలు చోటు చేసుకున్నాయా అనే సంగతి నిగ్గు తేల్చనుంది. భూముల బదలాయింపులో జరిగిన

మిగతా 11వ పేజీలో...

రైల్వే జోన్‌పై చంద్రబాబుతో చర్చిస్తున్నాం



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తరచూ మాట్లాడుతున్నారు

విజయనగరం వరకు 3వ లైన్ నిర్మాణానికి ఆమోదం

కొత్త రైల్వే ప్రాజెక్టుతో తెలుగు రాష్ట్రాలకు మేలు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 11

చదువు.. చట్టుబండలు



జగన్ పాలనలో బడులకు గ్రహణం

వైసీపీ సర్కారు తీరుతో విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. గత ఐదేళ్లలో అమలుచేసిన విధానాలు పిల్లలను చదువులకు దూరం చేసే దుస్థితిని సృష్టించాయి. ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 4.24లక్షల మంది విద్యార్థులు పాఠశాల విద్య, ఇంటర్మీడియట్‌లో తగ్గిపోయారు. వారంతా ఏమయ్యారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒక్క ఇంటర్మీడియట్‌లోనే విద్యార్థుల సంఖ్య ఏకంగా 2లక్షలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రాథమిక స్థాయిలోనూ 1.55లక్షల అడ్మిషన్లు తగ్గిపోయాయి. ఇప్పటివరకూ ప్రభుత్వ పాఠశాలలు వదిలేసినా ప్రైవేటు బడుల్లో చేరి ఉంటారనే అంచనా ఉండగా, ఇప్పుడు అక్కడ కూడా లేరని తాజా గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఇంత తేడా ఎందుకు వచ్చిందనే దానిపై విద్యాశాఖ దృష్టిపెట్టింది. కలెక్టర్ల సదస్సు సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఈ గణాంకాలను వెల్లడించింది.

4992 పాఠశాలల్లో పది మంది పిల్లలూ లేరు

20 మందీ లేని బడులు 12 వేలకు పైనే

ఇంటర్‌లో భారీగా తగ్గిన విద్యార్థులు

ఏకంగా 2లక్షల మంది దూరం

తీవ్రంగా దెబ్బతిన్న విద్యా వ్యవస్థ

గత ప్రభుత్వం తీరుతో ప్రతికూలత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా ప్రభుత్వ బడుల పరిస్థితి దారుణంగా తయారైంది. పట్టుమని పది మంది కూడా లేని పాఠశాలలు ఏకంగా 4992 ఉన్నట్లు తేలింది. అలాగే, కనీసం 20 మంది కూడా విద్యార్థుల్లేని బడులు 12252 ఉన్నట్లు కలెక్టర్ల సదస్సు సందర్భంగా పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ప్రీప్రైమరీ, ఒకటో తరగతిలో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి. 2023-24లో 12,32,342 మంది విద్యార్థులు ఉంటే, ఈ ఏడాది ఆ సంఖ్య 10,76,690కి

మిగతా 11వ పేజీలో...

ఇంటర్ విద్యలో సంస్కరణలు

పాఠ్య ప్రణాళిక సమీక్షకు విద్యా మండలి నిర్ణయం 11

2025-26 నుంచి కొత్త పుస్తకాలు అందుబాటులోకి

ఉన్నతవిద్యకు అనుసంధానం!

గ్రేడ్‌ల విధానంపై అధ్యయనానికి మంత్రి లోకేశ్ ఆదేశం



శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో కార్యకర్త ఇచ్చిన చిత్రంతో ముఖ్యమంత్రి చంద్రబాబు 2

మళ్లీ రేవంత్‌తో భేటీ!

తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

ఏపీలో ఐదేళ్లు విధ్వంసం జరిగిందని చంద్రబాబు ఆవేదన

రోహింగ్యాలపై డ్రోన్ దాడి

200 మంది మృతి

మయన్మార్ నుంచి పారిపోతుండగా వేట

మృతుల్లో పిల్లలు, మహిళలు 2

కారణం మీరంటే మీరేనంటూ సైన్యం, తిరుగుబాటుదారుల పరస్పర ఆరోపణలు

ఇదేం ఖర్మ వెంకటరెడ్డి?

ఇంత బతుకూ బతికి ఇదేందిదీ!



అజ్ఞాతంలోకి గనుల మాజీ ఎండీ

జగన్‌ను నమ్మి హీన.. దీన స్థితికి

ఏసీబీకి చిక్కని సీనియర్ అధికారి

ఆయనకున్న అన్ని ఇళ్లకూ సస్పెన్షన్ ఆర్డర్లు

ఎంత నేరం చేసి దాక్కున్నారు?

సస్పెన్షన్‌లో ఉండగా అమరావతి వదిలి ఎలా వెళ్లారు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వెంకటరెడ్డి... ఇండియన్ కోస్ట్‌గార్డ్స్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్. రక్షణశాఖ విభాగంలో శిక్షణా విభాగం అధికారిగా పనిచేసిన ఆయన ఏరికోరి జగన్ సర్కారులో గనులశాఖకు వచ్చారు. జగన్ అండతో గనులశాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా జంటపదవులను అనుభవించారు. ఆ పదవుల్లో ఉండగానే తప్పులు చేశారని టీడీపీ కూటమి ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అది తప్పనుకుంటే ఆయన కోర్టుకెళ్లవచ్చు. కానీ ఆ పనిచేయకుండా అజ్ఞాతంలోకి వెళ్లారు. గత కొద్దిరోజులుగా ఇటు ప్రభుత్వం, అటు అవినీతి నిరోధకశాఖ

మిగతా 11వ పేజీలో...

తూర్పు కనుమలకూ ముప్పు

దేవభూమి కేరళలో 'వయనాడ్' విలయం అంతులేని విషాదం విగిల్చింది. కొండచరియలు విరిగిపడటంతో పశ్చిమ కనుమల్లోని పచ్చటి గ్రామాలు మరుభూమిగా మారాయి. అభివృద్ధి పేరిట అక్కడ సాగించిన ప్రకృతి విధ్వంసమే ఈ మహా విషాదానికి కారణమని భూగర్భ జల నిపుణులు చెబుతున్నారు. కేరళలో చేసినట్టుగానే ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల్లోనూ అభివృద్ధి పేరిట కొండల స్వరూపాన్ని మార్చేస్తున్నారు. అరకులో సహజ సిద్ధంగా ఉండే వాగులు, పాయలను మూసివేస్తున్నారు. పరిరక్షణ చర్యలు తీసుకోకపోతే వయనాడ్ తరహాలో ఏపీలోనూ ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అభివృద్ధి పేరిట ప్రకృతి విధ్వంసం

గనుల తవ్వకాలతో కొండలు ధ్వంసం

ఇష్టానుసారంగా పర్యాటక రిసార్టులు

హైడల్ ప్రాజెక్టులు, ఇళ్ల నిర్మాణాలు

ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో తరచూ విరిగిపడుతున్న కొండ చరియలు

రైల్వే రవాణాకూ అంతరాయం

రిజర్వాయర్ల మనుగడకు ప్రమాదం

పరిరక్షణ చర్యలు తీసుకోకపోతే వయనాడ్ తరహాలో ముప్పు

భూగర్భ జల నిపుణుల హెచ్చరిక



2006లో అరకు లోయ మండలం కోడిపుంజువలస గ్రామంపైకి వచ్చిన బురద (ఫైల్)

అరకులోయ ప్రాంతంలో 1990, 2006, 2014లో కొండ చరియలు విరిగిపడి అనేకమంది మృత్యువాత పడ్డారు. వయనాడ్‌లో మాదిరిగానే 2006 ఆగస్టు 3వ తేదీ రాత్రి కొండచరియలు, బురదతో కూడిన వరద అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామాన్ని ముంచెత్తింది. ఈ ఘటనలో 19 మంది సజీవ సమాధి కాగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ కనుమల్లో భాగమైన కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి విలయ తాండవం మానవాళికి ఒక హెచ్చరిక అని భూగర్భ జల నిపుణులు చెబుతున్నారు. అక్కడ అభివృద్ధి పేరిట ప్రాజెక్టులు, రిసార్టులు విచ్చలవిడిగా నిర్మించారని, ఈ క్రమంలో సహజ సిద్ధమైన సెలయేళ్లు, వాగులను పూడ్చివేయడంతో కొండలు సహజ సిద్ధమైన స్థిరత్వాన్ని కోల్పోయాయని వివరించారు. అందుకే వయనాడ్‌ను వరద ముంచెత్తిందని, భవిష్యత్‌లో పశ్చిమ కనుమల్లో మరిన్ని విలయాలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. పశ్చిమ కనుమల తరహాలోనే తూర్పు కనుమలు కూడా ముప్పు ముంగిట ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ ఇప్పటికే ఛత్తీస్‌గఢ్‌లో బైలదిల్లాలోని ఇనుప ఖనిజం కిరండూల్ నుంచి విశాఖపట్నం తీసుకువస్తోంది. ఇందుకు



తూర్పు కనుమలు

మిగతా 12వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

తూర్పు కనుమల జీవ వైవిధ్యానికి విఘాతం

కొండ చరియలు జారిపడే ప్రమాదం

'మానవ చర్యల'తో పర్వత శ్రేణులకు భంగం

పట్టణీకరణ, విచక్షణారహిత అభివృద్ధితో ఆపద తప్పదు 12

ఈస్టర్న్ ఘాట్స్‌ను ప్రపంచ సహజ వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలి: పర్యావరణ వేత్తలు

కేరళకు అండగా ఉంటాం

పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం: మోదీ

వయనాడ్ విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన 2

బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ రాజీనామా

» షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర

ఢాకా/వాషింగ్టన్, ఆగస్టు 10: బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, 65 ఏళ్ల జస్టిస్ ఒబైదుల్ హసన్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం సాయంత్రం దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్‌తో భేటీ అయిన ఆయన పలు అంశాలపై చర్చించిన తర్వాత తన రాజీనామా పత్రాన్ని ఆయనకు సమర్పించారు. ఆయన స్థానంలో బంగ్లా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా అప్పిలేట్ డివిజన్ న్యాయమూర్తి జస్టిస్ మొహమ్మద్ అష్ఫఖుల్ ఇస్లాం నియమితులయ్యారు. దీనికి ముందు శనివారం ఉదయం జస్టిస్ హసన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ విషయం తెలిసిన విద్యార్థులు.. ఈ భేటీకి తాత్కాలిక ప్రభుత్వ అనుమతి లేదని, న్యాయవ్యవస్థ కుట్ర చేస్తోందని భావించి.. ఆందోళనకు పిలుపునిచ్చారు. జస్టిస్ హసన్ సహా ఇతర న్యాయమూర్తులు కేవలం గంట వ్యవధిలో రాజీనామా చేయాలని అల్టిమేటమ్ జారీ చేయడంతోపాటు విద్యార్థి సంఘాల నాయకులు అనూహ్యంగా ఆందోళనకు దిగారు. క్షణాల వ్యవధిలో వందలాదిగా పోగైన విద్యార్థులు సుప్రీంకోర్టును చుట్టుముట్టి హసన్ రాజీనామా చేసి వెళ్లిపోవాలని నినాదాలతో హోరెత్తించారు. దీంతో జస్టిస్ హసన్ తన సమావేశాన్ని వాయిదా వేశారు.


జస్టిస్ ఒబైదుల్ హసన్

అయినప్పటికీ విద్యార్థులు శాంతించకపోవడంతో రాజీనామాకు అంగీకరించారు. కాగా, గత ఏడాది ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ హసన్ షేక్ హసీనాకు విధేయుడిగా ముద్ర పడ్డారు. బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రవూఫ్ తలుక్దెర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ఈ పదవికి ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి రాజీనామాను అంగీకరించలేదని ఆర్థిక శాఖ సలహాదారు సలేహుద్దీన్ అహ్మద్ తెలిపారు. కాగా, బంగ్లా పోలీసు సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశంలో పరిస్థితి సర్దుమణిగే వరకు విధుల్లో చేరేది లేదని తేల్చి చెప్పాయి. మరోవైపు దేశవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయని హిందూ సంఘాలు ఆరోపించాయి. ఈ నెల 5 నుంచి ఇప్పటి వరకు 52 జిల్లాల్లో 205 దాడులు జరిగినట్టు తెలిపాయి. తమకు రక్షణ కల్పించాలని మైనారిటీలు కోరుతున్నట్టు సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ దాడులకు నిరసనగా వేలాది మంది బంగ్లాదేశ్ హిందువులు ఢాకాతో పాటు పలు నగరాల్లో భారీ ప్రదర్శనలు జరిపారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్ కల్పించాలని కోరారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అమెరికా జోక్యం చేసుకోవాలని భారతీయ అమెరికన్ చట్ట సభ సభ్యులు రాజా కృష్ణమూర్తి, శ్రీ తానేదార్‌లు విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌కు లేఖ రాశారు.

లోకం తీరు



దేశంలో మొట్టమొదటి రైస్ ఏటీఎం

» ప్రారంభించిన ఒడిసా ప్రభుత్వం



భువనేశ్వర్, ఆగస్టు 10: దేశంలోనే మొట్టమొదటి రైస్ ఏటీఎం'ను ఒడిసా ప్రభుత్వం ప్రారంభించింది. భువనేశ్వర్‌లోని మంచేశ్వర్‌లో ఓ గోదాములో ఏర్పాటు చేసిన ఈ ఏటీఎంను ఆ రాష్ట్ర మంత్రి కృష్ణాచంద్ర పాత్ర ప్రారంభించారు. రేషన్‌కార్డు ఉన్న వ్యక్తులు ఈ ఏటీఎం ద్వారా బియ్యాన్ని పొందవచ్చు. మెషిన్ టచ్ స్క్రీన్ డిస్‌ప్లేపై కార్డు నెంబర్‌ను ఎంటర్ చేసి, వినియోగదారుడి వేలిముద్రను వేయాలి. అనంతరం మెషిన్‌లోంచి బియ్యం విత్‌డ్రా అవుతాయి. ఒక్కసారి 25కిలోలు విత్‌డ్రా అయ్యేలా రూపకల్పన చేశారు. ఈ విధానం ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతానికి భువనేశ్వర్‌లో ప్రారంభించిన ఈ ఏటీఎంను తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాలకు విస్తరించనున్నారు. అనంతరం 'ఒకే కార్డు- ఒకే రేషన్‌కార్డు' కింద వివిధ రాష్ట్రాల్లో అమలు చేయనున్నారు.

రష్యా సైనికులపైకి బ్యాడ్ రోబో డాగ్స్

కీవ్, ఆగస్టు 10: రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ పాశ్చాత్య దేశాల ఆయుధాలతో పోరాడుతూనే.. మరోవైపు ప్రాణనష్టం తగ్గించేందుకు 'బ్యాడ్ రోబో డాగ్స్'ను బరిలో దింపనుంది. ఉక్రెయిన్ త్వరలోనే తమ సైనికులకు ముందు వరసలో వీటిని మోహరించనుంది. రష్యా సైనికుల కదలికలను పసిగట్టడంతో పాటు మందుపాతరలను ఇవి గుర్తించనున్నట్టు కీవ్ వర్గాలు తెలిపాయి. ఈ రోబో డాగ్‌ల వల్ల సైనికులకు ముప్పు తగ్గడంతో పాటు ఆపరేషన్ సామర్థ్యాలు మెరుగవుతాయని ఓ ఆపరేటర్ తెలిపారు.

హిందూమహాసముద్రంలో 3 చైనా నిఘా నౌకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: చైనా మళ్లీ హిందూమహాసముద్ర ప్రాంతం(ఐఓఆర్)లోకి నిఘా నౌకలను పంపింది. భవిష్యత్తులో చైనా జలాంతర్గాములు ఐఓఆర్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన కీలక సమాచారాన్ని ఈ నౌకలు సేకరిస్తున్నట్టు తెలిసింది. జియాంగ్ యాంగ్ హాంగ్-03, ఝొంగ్ షాన్ డా క్స్యూ, యింగ్ వాంగ్-7 నౌకలు ఐఓఆర్‌లో కార్యకలాపాలను నిర్వహిస్తున్న దృశ్యాలను డామియన్ సిమోన్స్ అనే వ్యక్తి 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత నావికాదళం ఆ నౌకలపై ఓ కన్నేసి ఉంచింది.

ఢిల్లీలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ఐఎస్ఐఎస్ ఉగ్రవాది దేశ రాజధానిలో పట్టుబడటం కలకలం రేపింది. ఈ నెల 8న రాత్రి 11 గంటల సమయంలో ఢిల్లీలోని గంగాబక్ష్ మార్గ్ సమీపంలో సంచరిస్తున్న వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ అలీని ఢిల్లీ స్పెషల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్దనుంచి పిస్తోలు, మందుగుండు సామగ్రి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఐఎస్ఐఎస్ పుణె మాడ్యూల్‌లో సభ్యుడైన రిజ్వాన్ కొంతకాలంగా పరారీలో ఉన్నాడు. స్వాతంత్ర్య దినోత్సవం వేళ దేశ రాజధానిలో అతని కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

50 గ్రాములు.. రూ.850 కోట్లు!

» బిహార్‌లో 'కాలిఫోర్నియం' రాయి స్వాధీనం

పట్నా, ఆగస్టు 10: రేడియోధార్మిక పదార్థమైన కాలిఫోర్నియం రాయిని స్మగ్లింగ్ చేస్తుండగా బిహార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 గ్రాముల రాయి విలువ రూ.850 కోట్లు పలుకుతుందని అంచనా. గుజరాత్ నుంచి మోటారు సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు దీనిని తీసుకొస్తున్నారనే కచ్చితమైన సమాచారంతో గోపాల్‌గంజ్ జిల్లా పోలీసులు.. బల్త్‌హరి చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి నాలుగు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాలిఫోర్నియం ఒక్కో గ్రాము ధర రూ.17 కోట్లు పలుకుతుందని, ఇందుకు సంబంధించి వారి వద్ద ఉన్న టెస్ట్ రిపోర్టులను కూడా స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో ఉపయోగిస్తారు. దీని సాయంతో బంగారం, వెండి ఇతర విలువైన లోహాలను, చమురు బావుల్లో నీరును, పొరలను, విమానాల్లో లోహాల అరుగుదలను గుర్తించవచ్చు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ వద్దు

» దీనిపై పార్లమెంటులో చట్టం చేయండి: ఖర్గే

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : ఎస్సీ రిజర్వేషన్ అమలులో క్రీమీలేయర్‌ను పాటించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోవాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. క్రీమీలేయర్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను నిరాకరించే భావనను ఖండించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పులో క్రీమీలేయర్ ప్రస్తావన ఉన్న భాగాలను తొలగిస్తూ పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణను పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవచ్చునని ఈ నెల మొదట్లో సుప్రీంకోర్టులోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలోని ఆరుగురు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

అంతరిక్షంలో చైనా వ్యర్థాలు

న్యూయార్క్, ఆగస్టు 10: చైనా రాకెట్ నుంచి వెలువడిన వ్యర్థాలు అంతరిక్షంలో భారీ మేఘంలా భూమిచుట్టూ తిరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. చైనా పంపిన లాంగ్ మార్చ్ 6ఏ రాకెట్ ఈనెల 6వ తేదీన 18 ఉపగ్రహాలను భూ దిగువ కక్ష(ఎల్ఈవో)లో సుమారు 800 కిలోమీటర్ల ఎత్తున ప్రవేశపెట్టింది. ఆ తర్వాత కొద్దిసేపటికే రాకెట్ పైభాగంలో పేలుడు సంభవించి వెలువడిన శిథిలాలు భారీ మేఘంలా భూమిచుట్టూ తిరుగుతున్నాయని అమెరికాకు చెందిన స్పేస్ కమాండ్(యూఎస్‌స్పేస్‌కాం) తెలిపింది. అందులో సుమారు 300 వరకు ట్రాకెబుల్(కనీసం 4 అంగుళాల వ్యాసం ఉన్నవి) శిథిలాలు ఉన్నట్టు సంస్థ వెల్లడించింది.

గాజాపై మరో భీకర దాడి!

పాఠశాలలోని శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ క్షిపణులు!.. దాదాపు వందమంది మృతి.. పలువురికి తీవ్ర గాయాలు

» అది బడి కాదు.. హమాస్ కమాండ్ సెంటర్: ఇజ్రాయెల్


శరణార్థి శిబిరంపై దాడిలో చనిపోయినవారి మృతదేహాలు, పాఠశాలలో భీతావహ దృశ్యాలను చూసి భయంతో ఏడుస్తున్న ఓ చిన్నారి

గాజా, ఆగస్టు 10: మరో యుద్ధం అంచున ఉన్న పశ్చిమాసియాలో మరో భీకర దాడి..! సెంట్రల్ గాజాలోని తబీన్ పాఠశాలపై శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ వరుసగా మూడు క్షిపణులను ప్రయోగించింది. హమా‌స్‌పై పది నెలలుగా టెల్ అవీవ్ సాగిస్తున్న యుద్ధంలో ఇదొక అతి పెద్ద ఘటనగా అభివర్ణిస్తున్నారు. ఇందులో వందమంది వరకు మృతిచెందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హెజ్బొల్లా, ఇరాన్ నుంచి తీవ్రస్థాయి హెచ్చరికలు ఎదుర్కొంటున్న సమయంలో ఇజ్రాయెల్ భారీ దాడికి పాల్పడడం ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా భావిస్తున్నారు. తబీన్ పాఠశాల 6 వేలమంది తలదాచుకుంటున్న శరణార్థి శిబిరమని హమాస్ పేర్కొంటుండగా, అది సీనియర్ కమాండర్లు సహా 20 మంది ఉగ్రవాదులు నక్కిన హమాస్ కమాండ్ సెంటర్ అని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ పాఠశాల మసీదు పక్కనే ఉందని తెలిపింది. మసీదు, తరగతి గదులు ఒకే భవనంలో ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ కెమెరామెన్ వెల్లడించారు. ఇజ్రాయెల్ క్షిపణి తరగతి గదుల మీదుగా మసీదులోకి చొచ్చుకెళ్లి పేలిపోయిందని పేర్కొన్నారు. కాగా, దాడి జరిగిన ప్రాంతమంతా రక్తసిక్తమై పరిస్థితి భీతావహంగా ఉంది. భారీ భవనం గోడలు నేలమట్టమై శరీరాలు ఛిద్రమయ్యాయి. వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. తమ వద్దకు 70 మృతదేహాలు, మరో పదిమంది శరీర భాగాలు వచ్చాయని అల్ అహిల్ ఆస్పత్రి డైరెక్టర్ ఫదెల్ నయీం తెలిపారు. 47 మందికి తీవ్రగాయాలైనట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. కాగా, తెల్లవారక ముందే.. స్కూల్‌లోని మసీదులో ప్రార్థనలు చేస్తుండగా ఎలాంటి హెచ్చరికలు లేకుండానే ఇజ్రాయెల్ దాడికి దిగిందని అబు అనాస్ అనే స్థానికుడు తెలిపాడు. కొందరు నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారని వాపోయాడు. మృతుల్లో అధికులు మహిళలు, పిల్లలు ఉన్నారని కథనాలు వస్తున్నాయి. సోమవారం ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. నెల రోజుల్లో 17 పాఠశాలలపైన ఇజ్రాయెల్ దాడులు చేసింది. గత 15 రోజుల్లోనే ఏడు దాడులకు పాల్పడింది. వీటిలో అధిక శాతం శరణార్థి శిబిరాలేనని.. మొత్తం 163 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ఇది ఏమాత్రం సమర్థనీయం కాదని ఈయూ విదేశీ వ్యవహారాల అధిపతి జోసెప్ బొరెల్ ఖండించారు.

డ్రోన్ దాడిలో 200 మందికి పైగా రోహింగ్యాల మృతి

మయన్మార్ నుంచి పారిపోతుండగా ఘటన

బ్యాంకాక్, ఆగస్టు 10 : మయన్మార్‌ను వీడి పారిపోతోన్న రోహింగ్యాలపై జరిగిన డ్రోన్ దాడిలో 200 మందికిపైగా మృతి చెందారు. మృతి చెందిన వారిలో పిల్లలతో సహా వెళుతోన్న కుటుంబాలు ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. మయన్మార్‌లోని రఖినే రాష్ట్రం నుంచి పక్కనున్న బంగ్లాదేశ్‌లోకి వెళ్లేందుకు వీరు సరిహద్దులో వేచివుండగా సోమవారం ఈ దాడి జరిగింది. చనిపోయినవారిలో ఒక నిండు గర్భిణి, ఆమె రెండేళ్ల కుమార్తె కూడా ఉన్నారు. ఆ మహిళ భర్త మాట్లాడుతూ.. నది తీరంలో తామంతా నిలబడి ఉండగా డ్రోన్ల దాడి ప్రారంభమయ్యిందని చెప్పాడు. మయన్మార్ సైనిక జుంటాకు తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతోన్న పోరాటంలో ఇటీవల సాధారణ పౌరులపై జరిగిన అతి పెద్ద దాడి ఇది. అయితే దాడికి మీరు కారణమంటే.. మీరే కారణమని సైన్యం, తిరుగుబాటుదారులు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

ఏప్రిల్ నుంచి భారతీయులను మిలటరీలో చేర్చుకోవట్లేదు

» ఇప్పటికే చేర్చుకున్నవారిని త్వరలోనే విడుదల చేస్తాం: రష్యా ఎంబసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ఉక్రెయిన్‌తో యుద్ధం కోసం రష్యా తన సైన్యంలో భారతీయులను నియమించుకోవడాన్ని భారత ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీలోని రష్యా ఎంబసీ స్పందించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి భారతీయులను అలాగే ఇతర దేశాలకు చెందిన వ్యక్తులను తమ మిలటరీలో నియమించుకోవట్లేదని శనివారం ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు తమ మిలటరీ శాఖల్లో స్వచ్ఛందంగా చేరిన ఇతర దేశస్థులను త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ప్రాణాలను కోల్పోయిన, గాయపడిన భారత సైనికులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఒప్పందం ప్రకారం వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని వారి కుటుంబాలకు చెల్లిస్తామని తెలిపింది. కాగా, శుక్రవారం లోక్‌సభలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌తో యుద్ధం కోసం రష్యా తన సైన్యంలో భారతీయులను నియమించుకోవడాన్ని భారత ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఇతర ఉద్యోగాలంటూ వారికి మాయమాటలు చెప్పి రష్యా మిలటరీలో నియమించారని ఆరోపించారు. భారతీయులను రష్యా సైన్యం నుంచి విడుదల చేయాలని ఎన్నో సార్లు ఆ దేశ విదేశాంగశాఖను కోరామని, ప్రధానమంత్రి మోదీ రష్యా పర్యటించిన సందర్భంలో ఇదే విషయాన్ని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ దృష్టికి కూడా తీసుకెళ్లారని తెలిపారు. రష్యా మొత్తం 91 మంది భారతీయులను తన సైన్యంలో నియమించుకుందని, వారిలో 8 మంది యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారని, 14 మందిని విడుదల చేసిందని, విడుదల కోసం ఇంకా 69 మంది ఎదురు చూస్తున్నారని జైశంకర్ వెల్లడించారు.


ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం?

» నోటీసు ఇచ్చే యోచనలో ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ, ఆగస్టు 10: రాజ్యసభ ఛైర్మన్‌గా జగదీప్ ధన్‌ఖడ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విపక్షాలు ఆయన్ను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తొలగించడం కోసం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు రాజ్యసభలో నోటీసు ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రాజ్యసభ పక్ష నేత జేపీ నడ్డాకు సమాచారం ఇచ్చినట్లు ఇండియా కూటమి ఎంపీ ఒకరు తెలిపారు. అయితే ఈ నోటీసును ఎప్పుడు సమర్పించాలనే దానిపై ఇంకా ఏకాభిప్రాయం రాలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా నోటీసు ఇచ్చే ప్రతిపాదనపై 87 మంది ఎంపీలు సంతకాలు చేసినట్లు తెలిసింది.

కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా టీవీ సోమనాథన్



న్యూఢిల్లీ, ఆగస్టు 10: కేంద్ర క్యాబినెట్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ శనివారం నియమితులయ్యారు. రాజీవ్ గౌబా స్థానంలో ఈయన నియామకం జరిగింది. సోమనాథన్ 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఈయన కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి రెండేళ్ల కాలానికి క్యాబినెట్ సెక్రటరీ పదవిలో టీవీ సోమనాథన్ కొనసాగనున్నారు. ఈమేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ఐదేళ్ల క్రితం 2019 ఆగస్టు 30న గౌబా క్యాబినెట్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. కాగా సోమనాథన్ ఇంతకు ముందు ప్రధానమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శి, జాయింట్ కార్యదర్శిగా పని చేశారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. ప్రపంచబ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు.

కేరళకు అండగా ఉంటాం

పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం.. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని హామీ

» విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

» పునరావాస ప్రణాళికపై సమీక్ష

వయనాడ్, ఆగస్టు 10: కొండచరియలు విరిగిపడి వరదలు పోటెత్తటంతో అతలాకుతలమైన కేరళకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తులో కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి అండగా ఉంటామన్నారు. కేరళలో ప్రధాని మోదీ శనివారం ఏరియల్ సర్వే జరిపారు. చూరల్‌మల, ముండక్కై, పంచరిమట్టం తదితర ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని వీక్షించారు. అనంతరం వయనాడ్‌లోని కాల్పెట్టాలో దిగి రోడ్డు మార్గంలో చూరల్‌మలకు వెళ్లారు. అక్కడ సహాయకచర్యల్లో భాగంగా ఆర్మీ నిర్మించిన 190 అడుగుల బెయిలీ బ్రిడ్జిపై నడిచి పరిసరాల్లో సంభవించిన నష్టాన్ని పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటైన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కోల్పోయిన కుటుంబ సభ్యులను, జరిగిన నష్టాన్ని తల్చుకొని కన్నీరుమున్నీరైన పలువురిని ప్రధాని మోదీ ఓదార్చారు. గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కూడా మోదీ పలకరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాధితులకు పునరావాసం కల్పించే ప్రణాళికపై మాట్లాడారు. కేరళలో విపత్తు సంభవించిన నాటి నుంచి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నానని, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ ఖాన్, సీఎం విజయన్, కేంద్రమంత్రి సురేష్‌గోపి తదితరులు ప్రధాని పర్యటనలో పాల్గొన్నారు.

మణిపూర్‌ను కూడా మోదీ సందర్శించాలి

ప్రధాని కేరళ పర్యటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'కేరళలో దారుణమైన విషాదం సంభవించింది. నాన్-బయలాజికల్ ప్రధాని వయనాడ్‌కు వెళ్లటం మంచిదే. దీని తర్వాత ఆయన యుద్ధాన్ని మరోసారి నిలిపివేయటానికి ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు. అయితే, గత 15 నెలలుగా తీవ్రమైన బాధ, దుఃఖంలో ఉన్న మణిపూర్ వెళ్లటానికి కూడా ఆయనకు సమయం దొరుకుతుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. జాతీయ విపత్తుగా ప్రకటించటానికి సంబంధించి ప్రత్యేకంగా ఎటువంటి నిబంధనలు లేవని పేర్కొన్నాయి. ఈ మేరకు 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్రమంత్రి ఎం.రామచంద్రన్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానాన్ని గుర్తు చేశాయి. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయ పునరావాసాల బాధ్యత ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంటుందని, అవసరాల మేరకు కేంద్రం సాయమందిస్తుందని నాడు మంత్రి చెప్పారు.


వయనాడ్‌లో ఓ చిన్నారిని పరామర్శిస్తున్న మోదీ

మళ్లీ రేవంత్‌తో భేటీ!

» తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: సీఎం చంద్రబాబు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైతే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి భేటీ అవుతానని ప్రకటించారు. తెలంగాణలో త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని చెప్పారు. శనివారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు, కింది స్థాయి నుంచి నాయకత్వాన్ని తయారు చేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2023లో ప్రత్యేక రాజకీయ పరిస్థితుల వల్ల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే పద్ధతిని లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించామన్నారు. ఇక్కడి మెజారిటీ ప్రజలు, పార్టీ అభిమానులు ఏపీకి వచ్చి ఎన్నికల్లో పనిచేయడంతోనే భారీ మెజారిటీతో గెలిచామని వివరించారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కూటమితో కలిసి 20 సీట్లు గెలిచామని, నాడు పార్టీకి 22 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. 2019 ఎన్నికల తర్వాత ఏపీలో ఐదేళ్ల పాటు టీడీపీ ఎన్నడూ లేనంతగా ఇబ్బందులు ఎదుర్కొందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా క్షేత్రస్థాయిలో పోరాడడం వల్లే తాజా ఎన్నికల్లో అఖండ విజయం సొంతమైందని చెప్పారు. తెలంగాణలో 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్నవారు ఉన్నారన్నారు. ఇక్కడ పార్టీని మళ్లీ శక్తిమంతం చేసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుపై శ్రద్ధ పెట్టాలన్నారు. దానివల్ల సుస్థిరమైన నాయకత్వం వస్తుందని చెప్పారు. తెలంగాణలో పార్టీకి పునర్వైభవం రావాలన్నారు. కార్యకర్తల నుంచి నాయకత్వాన్ని తయారు చేసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన విధానాలను రాజశేఖర్‌రెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి వరకు కొనసాగిస్తుండగా ఏపీలో మాత్రం గడిచిన ఐదేళ్లు విధ్వంసం జరిగిందని చంద్రబాబు చెప్పారు.


హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో వినతిపత్రం స్వీకరిస్తున్న చంద్రబాబు

భూ కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

» టీడీపీ కార్యాలయానికి వైసీపీ బాధితుల క్యూ

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల వల్ల అన్యాయానికి గురైన భూ బాధితులు శనివారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయానికి క్యూ వినతులతో కట్టారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై సమస్యలపై విన్నవించారు. వైసీపీ రౌడీ మూకలు తన భూమిని ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కట్టారని, వారి అరాచకాలతో తాను సొంత ఊరు వదిలి పాయకరావుపేటలో తలదాచుకోవాల్సి వచ్చిందని మన్యం ప్రాంతానికి చెందిన రాము నాయుడు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన రీసర్వేలో భూ రికార్డులు తారుమారు చేసి తనకు అన్యాయం చేశారని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామానికి చెందిన లింగాబత్తిన ఉమా లక్ష్మి ఫిర్యాదు చేశారు. కడప జిల్లా బి.కొండూరు మండలం తుమ్మలపల్లి చేనేత సహకార సంఘంలో జరిగిన అవినీతి, అక్రమ లావాదేవీలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రామసముద్రం గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమికి పట్టా పుస్తకాలు, టైటిల్ డీడ్ రాకుండా అడ్డుకొంటున్నారని, తమకు పట్టా పుస్తకాలు ఇప్పించాలని కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామానికి చెందిన ఎస్. నాగరాజు కోరారు. తన పొలం సరిహద్దు రాళ్లను ధ్వంసం చేసి వైసీపీ నేతలు భూమిని కబ్జా చేశారని అనంతపురం జిల్లాకు చెందిన కళసా బసవరాజు ఫిర్యాదు చేశారు. తమ భూమిని చదును చేసుకొంటుంటే ధర్మవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి అండతో తమపై అక్రమ కేసులు పెట్టి వేధించారని సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలానికి చెందిన బాలు నాయక్ కోరారు.

సమాజంలో పత్రికలదే విశ్వసనీయత

» కొవిడ్ అనంతరం మీడియాలో సంక్లిష్ట పరిస్థితి

» బుక్‌బ్రహ్మ చర్చాగోష్ఠిలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్



బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో పత్రికలదే విశ్వసనీయత అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో భాగంగా రెండోరోజు శనివారం ఐదు వేదికల ద్వారా బెంగళూరు కోరమంగళలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియంలో సాహితీవేత్తలు, రచయితలు, భాషాభిమానులతో సందడి నెలకొంది. 'మీడియాలో సాహిత్య ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిని 'ది హిందూ' ఎడిటర్ భాగ్యశ్రీ సుబ్బణ్ణ పర్యవేక్షించారు. కె.శ్రీనివాస్, డెక్కన్ హెరాల్డ్ ఎడిటర్ రామకృష్ణ, ప్రిజమ్ బుక్స్ నుంచి సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మేగజైన్లు ఎక్కువ సాహిత్యంతోనే సాగేవని, కొవిడ్ తర్వాత అవి బాగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. పత్రికల్లోనూ 50 శాతం స్థలాభావం ఏర్పడిందన్నారు. తెలుగులో 19వ శతాబ్దంలోనే మ్యాగజైన్ల ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆధ్యాత్మికం, సామాజిక అంశాలపై కథనాలు ఉండేవని తెలిపారు. 'ఆంధ్రపత్రిక' సాహిత్యంతోనే సుదీర్ఘకాలం కొనసాగిందని పేర్కొన్నారు. 1920లో భారతి, గోల్కొండ లాంటి మేగజైన్లు ప్రాచుర్యంలో ఉండేవని గుర్తుచేశారు. 1960లో ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలో 'ఆంధ్రజ్యోతి' ప్రారంభమైందని, ఆయన సాహిత్యానికి నిరంతరం ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం 'వివిధ' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో సాహిత్యానికి ప్రాధాన్యం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. అన్ని తెలుగు పత్రికలు సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని వెల్లడించారు. కొవిడ్ తర్వాత మీడియా సంక్లిష్ట పరిస్థితికి వచ్చిందన్న శ్రీనివాస్.. మేగజైన్లలో మంచి కథనాలు వచ్చేవని తెలిపారు. సంక్షిప్త కథనాలతో డిజిటల్ రూపంలో ప్రాచుర్యంలోకి వచ్చినా అవి పబ్లిష్ కావన్నారు. దినపత్రికలకు విశ్వసనీయత ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా లేదా డిజిటల్ మీడియాలో అప్పటికప్పుడు సమాచారం చేరినా పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు ఎడిటింగ్ ఉంటుందని, తద్వారా ప్రామాణికత, విశ్వసనీయత సాధ్యమవుతాయని వివరించారు. అందుకే ప్రజలు పత్రికలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మాతృభాషలో ఎప్పటికీ మార్పు ఉండదని, మరో 20-30 ఏళ్లపాటు పత్రికలకు ప్రాధాన్యం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో దళిత కిచెన్ వంటి అంశంపై కథనాలు పబ్లిష్ చేసే విషయమై పరిశీలిస్తామన్నారు. సుధీర్ మాట్లాడుతూ కేరళలో ఏటా 700-800 పుస్తకాలు ఇప్పటికీ పబ్లిష్ అవుతున్నాయన్నారు. సాహిత్య పర్యవేక్షణలో నాణ్యత ముఖ్యమని అన్నారు. ఏఐ టెక్నాలజీ సాహిత్యంలోనూ ప్రవేశిస్తోందని తెలిపారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శ్యామ్‌సుందర్


తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్యామ్‌సుందర్

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆయన రాత్రి జరిగిన గరుడ వాహనసేవలో పాల్గొన్నారు. శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

రాకెట్ సైన్స్ రోజుల్లోనూ బాలలపై దాడులా!

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- గుంటూరులో జరిగిన సదస్సులో కీలకోపన్యాసం

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాకెట్ సైన్స్ నేర్చుకునే ఈ రోజుల్లో బాలలపై దాడులు ఎక్కువ జరుగుతుండటంపై రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ విచారం వ్యక్తం చేశారు. ఎన్సీఆర్బీ 2023 రికార్డు ప్రకారం దేశవ్యాప్తంగా 1,62,000 మంది బాలలపై నేరాలు జరిగాయని, 83,350 మంది బాలల అదృశ్యం కేసులు నమోదు అయ్యాయన్నారు. బాలలపై కిడ్నాపింగ్, బలవంతపు నేరాలు 45 శాతం ఉన్నాయన్నారు. దేశంలో లైంగిక వేధింపులకు గురైన బాలల సంఖ్య 2021 సంవత్సరం కంటే 2022 సంవత్సరంలో పెరగడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం (మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్)తో కలిసి విభిన్నప్రతిభావంతుల బాలల హక్కుల పరిరక్షణపై వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సుకు జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టంతో విభేదించిన బాలల సంఖ్య చాలా తక్కువగా ఉందని, అయితే సంరక్షణ అవసరం అయిన బాలల సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. పోక్సో చట్టంలో కఠినమైన శిక్షలు వేస్తున్న నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎన్సీఆర్బీ రికార్డు ప్రకారం 1004 లైంగిక దాడుల కేసుల్లో 900 కేసులు తెలిసిన వారి వల్ల జరిగినవే అని పేర్కొంటూ చీఫ్ జస్టిస్ భావోద్వేగానికి లోనయ్యారు. పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలు, లీగల్ ప్రొవిజన్స్ ప్రకారం అమలు చేసే కఠిన చట్టాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలతో పాటు వార్తపత్రికలు, ఇతర ప్రచార సాధనాలు ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం మార్కెటింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ప్రచారం చేస్తున్నారో...అదే విధంగా సమాజంలో ఎక్కువ శాతం లైంగిక దాడులకు గురయ్యే వర్గాల ప్రజలే లక్ష్యంగా అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. విభిన్న ప్రతిభావంతులైన బాలల కోసం జువైనల్ చట్టంతో ఇతర చట్టాలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ఎటువంటి అసమానతలు చూపకుండా సమగ్ర విద్యను అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు కూడా ఇలాంటి బాలలకు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఈ సెమినార్‌లో విభిన్న ప్రతిభావంతులైన బాలల తల్లిదండ్రులను కూడ భాగస్వామ్యులను చేయటం చాలా సంతోషంగా ఉందని, వారి అభిప్రాయాలు ముఖ్యమని తెలిపారు. మానసిక వైకల్యంతో బాధ పడుతున్న బాలలకు కూడా రక్షణ సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. బాలల రక్షణ చట్టం అమలులో భాగస్వాములైన వారందరూ బాలలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతిజ్ఞ తీసుకోవాలని తెలిజేశారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేక అవసరాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి బహుమతులు అందించారు. ఈ సమావేశంలో జువైనల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విఆర్ కె కృపాసాగర్, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ వెంకట జోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.సుజాతతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

బూతులు మాట్లాడే వారికి బూత్‌ల్లోనే బుద్ధి చెప్పారు!

- రాజకీయాల్లో సానుకూల దృక్పథం ముఖ్యం: వెంకయ్యనాయుడు



కారంచేడు(పర్చూరు), ఆగస్టు 10: 'బూతులు మాట్లాడిన వారికి ప్రజలు పోలింగ్ బూత్‌ల్లో ఓటుతో బుద్ధి చెప్పారు. ఇష్టానుసారంగా ప్రవర్తించిన మంత్రులు, ఎమ్మెల్యేలను గడిచిన ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కి ఇంటికి పంపారు. రాజకీయ నాయకులు సానుకూల దృక్పథంతో మెలగాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. బాపట్ల జిల్లా కారంచేడులో శనివారం నిర్వహించిన విద్యాదాత జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. అన్నదానం కన్నా విద్యాదానం గొప్పదని చాటిన వ్యక్తి కుప్పుస్వామి అన్నారు. ప్రభుత్వాలు సైతం పల్లెల వైపు చూడని సమయంలో గ్రామాల అభివృద్ధికి కుప్పుస్వామి చౌదరి కృషిచేశారన్నారు. చదువుతోపాటు సంస్కృతి సంప్రదాయాలను ఉపాధ్యాయులు పిల్లలకు నేర్పాలని వెంకయ్య సూచించారు.

టీటీడీ ఇంజనీరింగ్ ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా, అవసరానికి మించి నిధులు కేటాయించారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన, చేస్తున్న దాదాపు 58 మంది అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ బోర్డు తీర్మానాలను ఎందుకు వ్యతిరేకించలేదంటూ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది.

15 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. 14వ తేదీన అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో 14న సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అలాగే 15న తిరుప్పావడ, 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. 18వ తేదీ కూడా కల్యాణోత్సవాన్ని రద్దు చేశారు.

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడపై కేసు నమోదు

- భార్య, కుమార్తెపై ప్రతి ఫిర్యాదు చేసిన శ్రీను
- వాణి వైఖరితోనే దూరంగా ఉంటున్నానన్న దువ్వాడ
- ఈ వ్యవహారంలో టీడీపీ నేతలున్నారని ఆరోపణలు
- ఇబ్బందుల కారణంగానే పవన్ కల్యాణ్ మరో పెళ్లి చేసుకున్నారంటూ వ్యాఖ్యలు


దువ్వాడ శ్రీను ఇంటి ముందు బైఠాయించిన ఆయన భార్య వాణి, కుమార్తె హైందవి

శ్రీకాకుళం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. గత మూడు రోజుల నుంచి దువ్వాడ శ్రీను.. ఆయన భార్య టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి మధ్య వివాదం కొనసాగుతోంది. టెక్కలిలోని అక్కవరం ప్రాంతంలో మరో మహిళతో శ్రీను నివసిస్తున్నారని, ఇది సరికాదని తన భవిష్యత్, పిల్లల భవిష్యత్ సంగతి తేల్చాలంటూ వాణి నేరుగా శ్రీను ఇంటికే వెళ్లి నిలదీశారు. శుక్రవారం అర్ధరాత్రి శ్రీను ఇంట్లో ఉండగా.. ఇంటి బయట వాణి తన కుమార్తెలతో కలసి నిరసనకు దిగారు. ఈ సందర్భంలో శ్రీను వారిపై దాడికి యత్నించారు. ఈ ఘటనపై వాణి ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు దువ్వాడ శ్రీను, ఆయన సోదరుడు శ్రీధర్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు.. శ్రీను తన భార్య, కుమార్తెలతోపాటు.. వారికి సహాయంగా వచ్చినవారిపైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వాణి, హైందవితో పాటు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఇదిలా ఉండగా.. శనివారం టెక్కలిలో దువ్వాడ శ్రీను విలేకరులతో మాట్లాడుతూ.. వాణి తనపై పెత్తనం చేస్తుండేదని.. రాజకీయంగా ఆమె పైచేయి సాధించాలని చాలా విషయాల్లో తనను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. అందుకే వేరుగా ఉంటున్నానని.. ఈ ఘటన వెనుక తెలుగుదేశం నాయకులున్నారని ఆరోపించారు. తన భార్యకు విడాకులు ఇస్తున్నానని.. ఆనాడు పవన్ కల్యాణ్ వంటివారు ఇబ్బందులు గురవ్వడంతోనే మరో పెళ్లి చేసుకున్నారంటూ వ్యాఖ్యానిస్తూ తన తప్పు కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నం చేశారు. వాణి, హైందవి శనివారం కూడా శ్రీను ఇంటిముందు బైఠాయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ విష ప్రచారానికి విరుగుడేదీ?

■ ఆర్కే RK



కొత్తపలుకు

'ఢిల్లీ మద్యం కేసులో విచారణ పూర్తి చేయకుండా నిందితులను ఇంకెంత కాలం జైలులో ఉంచుతారు?' ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిలు మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి. 'ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై దాఖలైన అవినీతి కేసుల విచారణలో ఇంత జాప్యం ఎందుకు? విచారణకు, డిశ్చార్జ్ పిటిషన్లకు సంబంధంలేదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చినా అదే సాకు చెప్పటం ఏమిటి?' తాజాగా సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అసహనం ఇది. ఈ రెండు సందర్భాలలోనూ దర్యాప్తు సంస్థలనే సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఢిల్లీ మద్యం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్నది దర్యాప్తు సంస్థల ఆరోపణ. జగన్‌రెడ్డి కేసులలో 35 వేల కోట్ల ప్రజాధనం లూటీ జరిగిందని ఇవే దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. మద్యం కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉండగా, 35 వేల కోట్ల రూపాయల అవినీతి కేసులో

> **జగన్‌రెడ్డికి హైదరాబాద్, బెంగళూరు, ఇడుపులపాయలో ప్యాలెస్‌లు ఉన్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్యాలెస్‌లకు వెళ్లినా వెళ్లకపోయినా భద్రత కల్పించేవారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఆయన తనకు అదే స్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నారు. చంద్రబాబుకు నక్సలైట్ల నుంచి ముప్పు ఉంది. జగన్‌రెడ్డికి ఆ ముప్పు లేదే! అయినా వెయ్యి మందితో భద్రత కావాలని ఆయన ఎందుకు కోరుతున్నారు? ఆయనకు అంత మంది శత్రువులు ఉన్నారా? ఉంటేగింటే ఎందుకున్నారు? ఐదేళ్ల పాటు ప్రజారంజక పాలన అందించానని చెప్పుకొంటున్న ఆయనకు శత్రువులు ఉండకూడదు కదా? ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత ఉండిందో అంత భద్రత కావాలని కోరుతున్నారంటే ఆయన ప్రజారంజక పాలన కాకుండా ప్రజాకంటక పాలన అందించారని భావించడం తప్పు కాదనుకుంటా!**

జగన్‌రెడ్డి 16 నెలలు మాత్రమే జైల్లో ఉండి బెయిల్ పొందారు. పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్న జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కూడా కొనసాగారు. మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంకా జైల్లోనే ఉన్నారు. ఈ వైరుధ్యాలకు కారణం ఎవరు? సిసోడియా, జగన్‌రెడ్డి కేసులలో సుప్రీంకోర్టుకు కనిపించిన అభ్యంతరం కింది కోర్టులకు ఎందుకు కనిపించలేదు? న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు ఈ దేశంలో ఎంత మంది వెళ్లగలరు? వెళ్లినా న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ఉంటుందా? అదీ లేదు. మన దేశంలో అన్ని వ్యవస్థలూ కుప్పకూలి పోయాయన్నది మెజారిటీ ప్రజల భావన. ఇతర వ్యవస్థల్లో న్యాయం దక్కనప్పుడు ఎవరైనా న్యాయ వ్యవస్థ తలుపు తడతారు. అక్కడ కూడా వెంటనే న్యాయం దక్కుతుందన్న భరోసాగానీ, అసలు న్యాయం లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేకుండా పోయింది. మిగతా వ్యవస్థలతో పోల్చితే న్యాయ వ్యవస్థ కొంచం మెరుగ్గా ఉన్నప్పటికీ... ఆ వ్యవస్థపై కూడా ప్రజలకు నమ్మకం పోతోంది. వివిధ సందర్భాలలో సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్యలకూ, అది ఇచ్చే ఆదేశాలకూ పొంతన ఉండటం లేదు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టును తప్పుపట్టిన సుప్రీంకోర్టు... హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను మాత్రం రద్దు చేయలేదు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తే పాలక పక్షాలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఎన్నికల్లో గెలిచామని చెప్పి విర్రవీగుతూ ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటూ ఉండటం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. బంగ్లాదేశ్ పరిణామాలనే తీసుకుందాం. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా ఏడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి ఆమె తండ్రి ముజిబుర్ రెహమాన్ కారణం. బంగ్లా ప్రజలు ఆయనను జాతిపితగా గౌరవించి నెత్తిన పెట్టుకున్నారు. అదే ప్రజలు ఇప్పుడు ఆయన విగ్రహాలను పగలగొడుతున్నారు. ఆయన కూతురు హసీనా దేశం విడిచి పారిపోవలసి వచ్చింది. రిజర్వేషన్ల విషయంలో హసీనా నిర్ణయాన్ని పాక్షికంగా సమర్థించిన బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాస భవనంపై కూడా ప్రజలు దాడి చేశారు. పాలకులు మాత్రమే కాదు— న్యాయ వ్యవస్థ కూడా ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే తీర్పులు ఇవ్వాలని బంగ్లా పరిణామాలు చెబుతున్నాయా? అలా అని గుంపుస్వామ్యానికి తల ఒగ్గితే రాజ్యాంగంలోని నిబంధనల విషయమేమిటి అన్న ప్రశ్న వస్తుంది. ఇలాంటి సంక్లిష్ట సమస్య ఎదురవకూడదంటే ప్రభుత్వాలు మాత్రమే కాదు— వ్యవస్థలు కూడా ప్రజల్లో తమపై నమ్మకం పోకుండా వ్యవహరించాలి. లేనిపక్షంలో ఏదో ఒకరోజు ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుంది.

దారి తప్పిన దర్యాప్తులు...

మన దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారు. పాలక పక్షాల చేతిలో అవి కీలుబొమ్మలుగా మారిపోయాయి. తాజాగా న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ప్రజా ప్రతినిధులపై దాఖలయ్యే అవినీతి కేసులలో విచారణ ఏడాదిలోగా పూర్తి కావాలని సుప్రీంకోర్టు పలు సందర్భాలలో అభిప్రాయపడింది. మరి జరుగుతున్నదేమిటి? ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉన్నారు. అయినా దర్యాప్తు సంస్థల విచారణ పూర్తి కాలేదు. దర్యాప్తు పూర్తయిన తర్వాత కోర్టు విచారణలో సిసోడియా నిర్దోషి అని తేలితే ఆయన 17 నెలల పాటు జైల్లో ఉన్నందుకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎప్పుడు బయటకు వస్తారో తెలియదు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై కోర్టు విచారణలో జాప్యం జరుగుతున్న తీరు కేస్ స్టడీ అవుతుంది. ఈ కేసులలో నిందితులందరూ హైకోర్టులో డిశ్చార్జి పిటిషన్లు వేస్తున్నందువల్ల కోర్టు ట్రయల్‌లో జాప్యం జరుగుతోందని సీబీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వాదనను తోసిపుచ్చింది. డిశ్చార్జి పిటిషన్‌కు, కోర్టు ట్రయల్‌కు సంబంధం లేదని గతంలోనే తీర్పు ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. సీబీఐ వంటి సంస్థల తరఫున సుప్రీంకోర్టులో వాదించే సొలిసిటర్ జనరల్ లేదా ఆ సంస్థ న్యాయవాదులకు ఈ విషయం తెలియదా? అయినా జాప్యం జరుగుతూనే ఉంది. అవరోధాలు తొలగి విచారణ ప్రారంభం అవుతుందని అనుకుంటున్న సందర్భాలలో సంబంధిత న్యాయమూర్తి బదిలీ అవుతున్నారని కూడా సీబీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. నిజమే, జగన్ కేసులు విచారణకు రాకుండానే న్యాయమూర్తులు బదిలీ అవుతున్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఏమీ చేయలేదా? వివిధ సందర్భాలలో ఎవరికి వారు తమ తప్పు లేదని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. ఈ కారణంగానే వ్యవస్థలపై ప్రజల్లో అపనమ్మకం ప్రబలుతోంది. పొలిటికల్ బాసుల కనుసన్నల్లో పనిచేయడానికి వ్యవస్థలు అలవాటుపడ్డాయి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఇదే పరిస్థితి. ఇలా అయితే ప్రజల్లో తిరుగుబాటు రాదా? పాలకులుగా అవతరించే ప్రజా ప్రతినిధుల విషయంలో అయినా తప్పు చేశారా? లేదా? అన్నది వెనువెంటనే తేల్చకపోతే జరిగే అనర్థాలకు బాధ్యులు ఎవరు? జగన్‌రెడ్డి వ్యవహారాన్నే తీసుకుందాం! ఆయన పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్నారు. భవిష్యత్తులో న్యాయస్థానం ఆయనను దోషిగా ప్రకటిస్తే... అతను ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఒక రాష్ట్రాన్ని పాలించే అవకాశం కల్పించిన పాపం ఎవరిది అవుతుంది? గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో చెడినందునే జగన్‌పై కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్నవారితో సత్సంబంధాలు ఉన్నందునే తనపై దాఖలైన కేసులలో విచారణ కూడా జరగకుండా జగన్ తప్పించుకోగలుగుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిన మాట నిజం కాదా? మధ్యలో దర్యాప్తు సంస్థలకు, న్యాయస్థానాలకు పాత్ర లేదా? ఈ రెండు వ్యవస్థల ప్రత్యక్ష, పరోక్ష సహకారం లేని పక్షంలో ఇది సాధ్యమా? డిశ్చార్జి పిటిషన్లను సాకుగా చూపడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఆ విషయం కింది కోర్టులకు తెలియదా? సుప్రీంకోర్టు మాదిరిగా కింది కోర్టులు కూడా ఆలోచించి ఉంటే జగన్ కేసులలో ఈ పాటికి విచారణ కూడా పూర్తయ్యేది కదా? ఈ చిక్కు ముడులు ఎవరు విప్పాలి? తమపై ప్రజల్లో నమ్మకం చచ్చిపోకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు స్థాయిలో అప్పుడప్పుడు ప్రజలకు ఉపశమనం లభించే విధంగా తీర్పులు వస్తున్నాయి కానీ నిందితులైన రాజకీయ నాయకులు మాత్రం అందలం ఎక్కుతూనే ఉన్నారు. దర్యాప్తు సంస్థలపై కనీస నమ్మకం లేనందున కేసులు ఉన్న వారికి కూడా ప్రజలు అధికారం కట్టబెడుతున్నారు. చివరకు, ఎవరు మాత్రం అవినీతిపరులు కాదు— అని సరిపెట్టుకొనే పరిస్థితులు ఈ దేశంలో నెలకొన్నాయి.

భారత్‌లోనూ జరుగుతుందా?

బంగ్లాదేశ్ వంటి పరిణామాలు మన దేశంలో జరగకపోవచ్చును గానీ, నిజాయితీపరులు, ప్రజాస్వామ్య ప్రియులు, కష్టపడి సంపాదించి పన్నులు కడుతున్న వారిలో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అది ఎప్పుడైనా, ఏ రూపంలోనైనా పెల్లుబకవచ్చు. అంతులేని ప్రజాభిమానంతో అధికారంలోకి వచ్చిన నాయకులపై కూడా అనతి కాలంలోనే ప్రజాగ్రహం పెల్లుబకడాన్ని చూస్తున్నాం. 2019 ఎన్నికల్లో 51 శాతం ఓట్లతో 151 సీట్లు గెలుచుకున్న జగన్మోహన్‌రెడ్డికి తాజా ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కారకుడైన కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి ఎందుకొచ్చింది? ఆయన కూడా తనను 'తెలంగాణ పిత'గా పిలిపించుకున్నారు. తొమ్మిదిన్నరేళ్లు తిరిగే సరికి అదే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను తిరస్కరించారు. దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు నిజాయితీతో సక్రమంగా పని చేసినా చేయకపోయినా ఎన్నికల్లో ప్రజలు మాత్రం ఓటు అనే ఆయుధంతో నిరంకుశంగా వ్యవహరించే వారిని శిక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ ఔన్నత్యాన్ని కాపాడుకోవడమా? లేదా? అన్నది దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ తేల్చుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థ అయినా ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి. పాలకులకు కాదు. ఈ సూత్రాన్ని పాటిస్తే ప్రజల్లో అసహనానికి, అసంతృప్తికి తావుండదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేసులలో ఇప్పటికైనా విచారణ ప్రారంభమవుతుందని ఆశిద్దాం! డజనుకు పైగా అవినీతి కేసుల భారాన్ని మోస్తూ అతను నీతీ నిజాయితీల గురించి మాట్లాడుతుంటే వినడానికి ఎబ్బెట్టుగా ఉంటోంది. విచారణకు సహకరించి నిర్దోషిగా రుజువు చేసుకుంటే ఆయనకే మంచిది కదా! ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించి కేంద్ర ప్రభుత్వం కూడా తగు విధంగా వ్యవహరించడం మంచిది. మూడో పర్యాయం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ తమకు ఈసారి సొంతంగా మెజారిటీ ఎందుకు లభించలేదో ఆత్మపరిశీలన చేసుకోవాలి. దేశంలోని అన్ని వ్యవస్థలూ లొంగిపోయినప్పటికీ ప్రజలు మాత్రం లొంగిపోలేదు. అందుకే ఆ పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. ప్రజలు ఎప్పుడూ అలసిపోరు.

> **డజనుకు పైగా అవినీతి కేసుల భారాన్ని మోస్తూ నీతీ నిజాయితీల గురించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతుంటే వినడానికి ఎబ్బెట్టుగా ఉంటోంది. విచారణకు సహకరించి నిర్దోషిగా రుజువు చేసుకుంటే ఆయనకే మంచిది కదా!**

జగన్ (అ)భద్రత!

ఆ విషయం అలా ఉంచితే, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్పించిన భద్రతను కొనసాగించాలంటూ హైకోర్టును కోరడం వింతగా ఉంది. ఇంకా నయం, ముఖ్యమంత్రి హోదాను కూడా కొనసాగించాలని ఆయన కోర్టును కోరలేదు. ఇప్పటికే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏ రాజకీయ పార్టీని ఎక్కడ ఉంచాలో కోర్టులు కాదు— ప్రజలు నిర్ణయిస్తారు. తెలుగునాట ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉండేవి. ఇప్పుడు కారణాలు ఏవైనా ఆ పార్టీలు గత చరిత్రకు వర్తమానంలో ఆనవాళ్లుగా మిగిలాయి. తెలంగాణలో సీపీఐకి శాసనసభలో కనీసం ప్రాతినిధ్యం ఉంది. సీపీఎంకు ఉభయ రాష్ట్రాలలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. తమకు గత వైభవం కల్పించాలని ఆ పార్టీ న్యాయస్థానం గడప తొక్కడం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, ప్రతిపక్ష హోదా ఇప్పించాలని జగన్మోహన్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరడం కూడా అంతే హాస్యాస్పదంగా ఉంది. ఇది చాలదన్నట్టు ఆయన ఇప్పుడు దాదాపు వెయ్యి మందితో తనకు భద్రత కల్పించాలని కోర్టు మెట్లు ఎక్కారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంతమందితో భద్రత ఏర్పాటు చేసుకున్నారా? ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు కూడా అంత మంది భద్రతగా ఉన్నారా? ఉంటే మాత్రం అభ్యంతరకరమే! ఈ దేశంలో ఎన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇంత మందితో భద్రత ఏర్పాటు చేశారు? అంత అవసరం ఏమిటి? ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు చిన్న రాష్ట్రమే. పొరుగున ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఇంత భద్రత లేదే? వివాహాది శుభకార్యాలు, లేదా మరేదైనా ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లినా ఆయనకు ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్లు రక్షణగా ఉంటారు. స్టాలిన్ కూడా సాదాసీదాగా ఇతరులతో పాటు కలసి కూర్చుంటారు. తెలుగునాట ఈ ఆర్భాటం ఏమిటి? జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 980 మందితో రక్షణ కల్పించుకున్నారని తెలిసి పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు నాయకులకు హైదరాబాద్‌లో ఇళ్లువాకిళ్లు ఉన్నాయి. ఈ కారణంగా హైదరాబాద్‌లో ఉన్న ఇళ్లలో కూడా ముఖ్యమంత్రులుగా ఉన్నవాళ్లు రక్షణ కల్పించుకుంటున్నారు. జగన్‌రెడ్డికి హైదరాబాద్, బెంగళూరు, ఇడుపులపాయలో ప్యాలెస్‌లు ఉన్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్యాలెస్‌లకు వెళ్లినా వెళ్లకపోయినా భద్రత కల్పించేవారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఆయన తనకు అదే స్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నారు. చంద్రబాబుకు నక్సలైట్ల నుంచి ముప్పు ఉంది. జగన్‌రెడ్డికి ఆ ముప్పు లేదే! అయినా వెయ్యి మందితో భద్రత కావాలని ఆయన ఎందుకు కోరుతున్నారు? ఆయనకు అంత మంది శత్రువులు ఉన్నారా? ఉంటేగింటే ఎందుకున్నారు? ఐదేళ్లపాటు ప్రజారంజక పాలన అందించానని చెప్పుకొంటున్న ఆయనకు శత్రువులు ఉండకూడదు కదా? ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత ఉండిందో అంత భద్రత కావాలని కోరుతున్నారంటే ఆయన ప్రజారంజక పాలన కాకుండా ప్రజాకంటక పాలన అందించారని భావించడం తప్పు కాదనుకుంటా! ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో కలసిపోయిన జగన్... ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు దూరమయ్యారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అడుగు బయట పెడితే పరదాలు కట్టించుకున్నారు. పోలీసు రక్షణ వలయంలో బతికారు. చివరకు అధికారానికి దూరమయ్యారు. రక్షణ కోసం కాకుండా, కేవలం అధికార దర్పానికి చిహ్నంగా అప్పట్లో ఆయన అంత మందితో రక్షణ వలయం ఏర్పాటు చేసుకున్నట్టున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనల సందర్భంగా కూడా కనిపించనంత హడావిడి జగన్‌రెడ్డి పర్యటనల్లో కనిపించేది. తాడేపల్లి ప్యాలెస్‌లో ఏం జరుగుతుందో నరమానవులకు కనిపించనంత ఎత్తుల్లో కంచె ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రస్తుత ప్రజాభవన్ వద్ద ఇదే స్థాయిలో ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నారు. వివిధ దేశాలలో నియంతలుగా పేరొందినవారు మాత్రమే ఇలాంటి రక్షణ ఏర్పాట్లు చేసుకోవడం చూశాం. ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో ఒక చిన్న రాష్ట్రం. ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తికి వెయ్యి మందితో భద్రత కల్పించడం విడ్డూరమే. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కూడా కాదు. మాజీ ముఖ్యమంత్రి మాత్రమే. ఒక మాజీ ముఖ్యమంత్రికి నిబంధనల ప్రకారం ఎంత రక్షణ కల్పించాలో అంతే కల్పిస్తారు. అంతకు మించి కావాలనుకుంటే అందుకు అయ్యే ఖర్చును అతడే భరించడం న్యాయం. అయినా ఆయన ఇప్పటికే వందల మంది ప్రైవేట్ భద్రతా సిబ్బందిని నియమించుకున్నారు. తెలుగునాట భద్రత అన్నది ఒక హోదాగా మారింది. ఇతర రాష్ట్రాలలో శాసనసభ్యులు అందరికీ అంగరక్షకులు కూడా ఉండరు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అంతకు ముందు కూడా ముఖ్యమంత్రులుగా పని చేసిన వారికి ఒక పైలట్, ఒక ఎస్కార్ట్ కారు మాత్రమే ఉండేవి. డజన్ల కొద్దీ వాహనాలతో భారీ కాన్వాయ్ ఉండేది కాదు. ఏది ఏమైనా ఇప్పుడు జగన్ చేసిన విజ్ఞప్తి న్యాయస్థానం పరిశీలనలో ఉంది. కోర్టు ఏమి చెబుతుందో చూద్దాం!


akbar

> **విజయవాడ సంఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే... ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచేందుకు జగన్ అండ్ కో ఎంతకైనా తెగిస్తారని అర్థమవుతోంది. 2014–19 మధ్య కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పితాలు ప్రచారం చేసి జగన్ అండ్ కో లబ్ధి పొందింది. ఇప్పుడు కూడా అవే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్‌రెడ్డి పేరు తొలగించడానికి కారకులైన వారి వెనుక చంద్రబాబు, లోకేశ్ ఉన్నారా? లేరా? అన్నది తేల్చాలి. వారి ప్రమేయం లేని పక్షంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. కక్ష సాధింపులు వాంఛనీయం కాదుగానీ... అసత్య ప్రచారాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే వారిపైన, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు కూడా తీసుకోని పక్షంలో అది అసమర్థత అవుతుంది. గతంలో చంద్రబాబు ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకుంది. జగన్ అండ్ కో విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మరింత అప్రమత్తత ప్రదర్శించాలి.**

అలా వదిలేస్తారా...?

కాగా, చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలే అయింది. ఇంతలోనే జగన్‌రెడ్డిలో అసహనం పెరిగిపోతోంది. తన పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలైందన్న విమర్శలు వచ్చినందున ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆయన విమర్శిస్తున్నారు. శాంతిభద్రతలు కుప్పకూలి పోయాయని గగ్గోలు పెడుతున్నారు. తనకు ఎదురైన అనుభవాలు ప్రత్యర్థులకు కూడా ఎదురవాలని ఆయన ఆశిస్తున్నారు. అవినీతి కేసులలో తాను పదహారు నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చినందున తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబు కూడా జైలుకు వెళ్లాలని జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోరుకున్నారు. అందుకే తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో చంద్రబాబును దాదాపు రెండు నెలల పాటు జైలుకు పంపించారు. ఆ బాటలోనే అప్పుడు రాజారెడ్డి రాజ్యాంగం అన్నారని ఇప్పుడు రెడ్ బుక్ రాజ్యాంగం అని అంటున్నారు. అంతేకాదు, రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయని, పెట్టుబడులకు భద్రత ఉండదని, తెలంగాణ వైపు చూడండని తన మద్దతుదారులతో సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా జగన్ అండ్ కో ప్రచారం చేయడం వింతగా ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని కోరే దాకా వెళ్లారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి చంద్రబాబు అధికారం చేపట్టినప్పటికీ మెతక వైఖరినే అవలంబిస్తున్నారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను వేధించిన వారిపై కనీసం చర్యలు తీసుకోవడం లేదని తెలుగు తమ్ముళ్లు ఆవేశంతో ఊగిపోతున్నారు. గడచిన కొద్ది రోజులుగా జగన్ రోత మీడియాలో వస్తున్న వార్తలను గతంలో ఇతర పత్రికలు ప్రచురించి ఉంటే కేసులు పెట్టి ఉండేవారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దని ప్రచారం చేస్తున్న వారిపై కూడా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరును ఎవరో దుండగులు తొలగిస్తే దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఆ దుశ్చర్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రధాన కారణమంటూ సదరు రోత పత్రికలో వార్తలు వండి వార్చారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు మరింత మండిపడుతున్నారు. కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతం మంచిది కాదని చంద్రబాబు భావిస్తున్నట్టుగా ఉంది. అయితే, ఈ ధోరణి తెలుగుదేశం కార్యకర్తల్లో నిరాశా నిస్పృహలకు కారణం అవుతోంది. శుక్రవారం నాటి విజయవాడ సంఘటన పూర్వాపరాలను పరిశీలిస్తే... ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచేందుకు జగన్ అండ్ కో ఎంతకైనా తెగిస్తారని అర్థమవుతోంది. 2014—19 మధ్య కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పితాలు ప్రచారం చేసి జగన్ అండ్ కో లబ్ధి పొందింది. ఇప్పుడు కూడా అవే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2019లో చంద్రబాబు ఓడిపోయి జగన్‌రెడ్డి అధికారం చేపట్టడంతో దాదాపు రెండేళ్లపాటు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు బయటకు రావాలంటేనే భయపడ్డారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచే వైసీపీ శ్రేణులు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి చికాకులు సృష్టిస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా జగన్‌రెడ్డి ప్రత్యక్షమవుతున్నారు. దీన్ని తేలికగా తీసుకుంటే అధికార పక్షమే నష్టపోతుంది. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారంపై వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ తప్పుడు ప్రచారాలను కట్టడి చేయని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్‌రెడ్డి పేరు తొలగించడానికి కారకులైన వారి వెనుక చంద్రబాబు, లోకేశ్ ఉన్నారా? లేరా? అన్నది తేల్చాలి. వారి ప్రమేయం లేని పక్షంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. కక్ష సాధింపులు వాంఛనీయం కాదుగానీ... అసత్య ప్రచారాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే వారిపైన, రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు కూడా తీసుకోని పక్షంలో అది అసమర్థత అవుతుంది. గతంలో చంద్రబాబు ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకుంది. జగన్ అండ్ కో విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మరింత అప్రమత్తత ప్రదర్శించాలి. లేనిపక్షంలో ఎదురయ్యే పరిణామాలకు సిద్ధం కావాలి!

> **ఢిల్లీ మద్యం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్నది దర్యాప్తు సంస్థల ఆరోపణ. జగన్‌రెడ్డి కేసులలో 35 వేల కోట్ల ప్రజాధనం లూటీ జరిగిందని ఇవే దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. మద్యం కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా 17 నెలల పాటు జైల్లో ఉండగా, 35 వేల కోట్ల రూపాయల అవినీతి కేసులో జగన్‌రెడ్డి 16 నెలలు మాత్రమే జైల్లో ఉండి బెయిల్ పొందారు. పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్న జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కూడా కొనసాగారు. మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంకా జైల్లోనే ఉన్నారు. ఈ వైరుధ్యాలకు కారణం ఎవరు? సిసోడియా, జగన్‌రెడ్డి కేసులలో సుప్రీంకోర్టుకు కనిపించిన అభ్యంతరం కింది కోర్టులకు ఎందుకు కనిపించలేదు? న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు ఈ దేశంలో ఎంత మంది వెళ్లగలరు? వెళ్లినా న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ఉంటుందా? అదీ లేదు.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అపురూప కథలు ఆమెవి..!

> **సుజాతాదేవి బాలసాహిత్యంలో ఎంత కృషి చేసిందో, కథారచనలోనూ అంతటి కృషి చేసింది. సుజాత స్వీకరించిన పలు కథాంశాలను అప్పట్లో రచయిత్రులే కాక రచయితలు కూడా సాహిత్యంలోకి తీసుకురాలేదు. సాహిత్య విలువలు, సామాజిక బాధ్యత తెలిసిన ఆమె ఏ ప్రక్రియ చేపట్టినా నిబద్ధతతో ప్రతిభావంతంగా రాసింది. మేము ప్రచురించి ఇచ్చిన 'ఆటలో అరటిపండు' పుస్తకానికే సుజాతాదేవికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం రావటంతో మాకే వచ్చినంతగా సంబరపడ్డాం నేను, వీర్రాజుగారు.**

డి. సుజాతాదేవి పేరు వింటే సాహిత్య రంగంలో కొందరు 'ఆమె బాల సాహిత్య రచయిత్రి' అంటారు. మరికొందరు 'గేయం రాస్తుంది' అంటారు. తమ రచనలు తప్ప ఇతరుల రచనలు చదివే అలవాటు లేని వాళ్ళు 'ఎవరామె? ఏమిటి రాసింది? ఎప్పుడూ పేరు విన్నట్లు లేదే?' అని ఆశ్చర్యంతో చూసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఆమె మాట మలయానిలయం, పాట తేనెల సోన, గేయం వెన్నెల వాక. మరి కథో? సమాజం మారుమూలలోకి దృష్టి సారించి పరిశీలించి నివ్వెరపోయేలా రాసిన అపురూప కథలు ఆమెవి. నేలమీద సాము చేయని, నిబద్ధతతో కూడిన కథలు. బాలల నేస్తం, స్నేహపూరితరూపం ఆమె. ఆగస్ట్ నాలుగు స్నేహితుల దినోత్సవం రోజున అల్జీమర్స్‌తో బాధపడుతూ కన్నుమూసింది నా స్నేహితురాలు సుజాత!

1970లో సాహిత్య రంగంలోకి అడుగుపెట్టి సుజాత మూడు కథాసంపుటాలు, మూడు పాటల పుస్తకాలు, ఒక గేయకావ్యం, మూడు నవలలు, ఒక వ్యాసాల పుస్తకం, ప్రముఖులతో చేసిన ముఖాముఖీల సంకలనంతో పాటు రెండు పాటలు కేసెట్లు వెలువరించారని చాలా మందికి తెలియదు. NCERT వాళ్ళ పురస్కారం, బాలల నవలకి జాతీయ పురస్కారం, బాలల లఘుచిత్రానికి ప్రతిష్ఠాత్మకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్నారన్న విషయం అనేక మందికి తెలియదు. బహుశా 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారనే విషయం కొందరికైనా తెలిసే ఉంటుంది అనుకుంటాను మరి.

సుమారు యాభై ఏళ్ళక్రితం సుజాతతో నా పరిచయం రాను రాను స్నేహబంధంగా గాఢమైంది. అనేక సభలలో సమావేశాల్లో కలిసిన మేము తర్వాత తర్వాత మూడునాలుగేళ్ళ క్రితం వరకూ ఫోనులో సాహిత్యం గురించి చర్చలూ, ఒక్కొకప్పుడు ఫోనులోనే పాటలూ, కథలూ రాగరంజితంగా మాట్లాడుకునేవారం.

నా పదవీ విరమణ అయ్యాక వీర్రాజుగారూ, నేనూ మొదట ఒక అవార్డు మొదలుపెట్టాలనుకున్నాం. తర్వాత అవార్డు కంటే ఉత్తమంగా ఎవరైనా ఏదైనా కారణం చేత పుస్తకాలు వేసుకోని రచయితల ఒక పుస్తకం 500 కాపీలు వేసి వాళ్ళకే ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఆ కోవలో మొట్టమొదటగా అంతకు ముందు ఈనాడు పత్రికలో ధారావాహికంగా వచ్చిన డి. సుజాతాదేవి 'ఆటలో అరటి పండు' పిల్లల కథల్ని పుస్తక రూపంలో వేసి సుజాతకు ఇచ్చాం.

సుజాత ఆంధ్ర మహిళా సభ లిటరసీ హౌస్‌లో ఉద్యోగంలో చేరిన రోజుల్లోనూ, బ్రౌన్ అకాడమీలో పని చేసినపుడూ కూడా తరుచూ మేము ముగ్గురం కలిసే వాళ్లం. ఒక్కొక్కప్పుడు అత్తలూరి విజయలక్ష్మీ, భార్గవీరావూ కలిసేవారు. కొత్తగా రాసుకున్న కవితో కథో చదువుకునే వాళ్ళం, పాటలు పాడుకునేవాళ్ళం. అయితే అందరం కలిసి ఒక గొలుసు కథ రాయాలనుకున్న మా ప్రయత్నం మాత్రం కార్యరూపం దాల్చలేదు.

అకస్మాత్తుగా ఒక రోజు రాంకోఠీ కిమ్స్ హాస్పిటల్‌లో హార్ట్ ఆపరేషన్ జరిగిందని తెలిసి నేను హాస్పిటల్‌లో కలిసాను. వాళ్ళ అమ్మాయి ఆమె చేత ఉద్యోగం రాజీనామా చేయించి నల్గొండలో తన దగ్గరకు తీసుకువెళ్ళిపోతున్నదని తెలిసి నేను బాధపడ్డాను. నల్గొండ వెళ్ళిపోయాక ఆమె అప్పుడప్పుడు సభల కోసమో, ఏదైనా అవసరార్థమో హైదరాబాదు వచ్చినపుడల్లా కలుస్తూనే ఉన్నాను. సుజాత పెద్దమ్మాయి కొడుకు పెళ్లిలో జానకీ బాలతో సహా మేము ముగ్గురం కలిసి కబుర్లు చెప్పుకున్నాం. మాడభూషి రంగాచార్యులు స్మారక పురస్కారం సుజాతాదేవి రాసిన 'చేపలు' కథల సంపుటికి వచ్చినప్పుడూ,



మాడభూషి రంగాచార్యుల పురస్కారాల పదేళ్ళ వేడుక సందర్భంగా కూడా మేము కలుసుకున్నాం. అప్పుడే అనుకుంటాను వీర్రాజుగారిని ఇంటర్వ్యూ చేస్తానని వచ్చి రోజంతా మా యింట్లో గడిపింది. ఇలా ఎంతమంది ప్రముఖులనో ఇంటర్వ్యూలను చేసి 'ముఖేముఖే సరస్వతి' పేరుతో సుజాత సంకలనంగా వేసింది.

సుజాతాదేవి బాలసాహిత్యంలో ఎంత కృషి చేసిందో, కథారచనలోనూ అంతటి కృషి చేసింది. ఆమె రాసిన 'చేపలు' కథ, సవరాలు కట్టి జీవించే వారి కథ 'ఎటు చూస్తే అటు', వెట్టిచాకిరీ చేసే బాల్బీ కథ 'మలుపు', షాపుల ముందు వూడ్చే పనివారి జీవితం 'ఇంతేలే', ఆర్థికంగా వెసులుబాటులేని జీవితాల కథ 'వృత్తం'... ఇలా ఏ కథ తీసుకున్నా సుజాత స్వీకరించిన పలు కథాంశాలను అప్పట్లో రచయిత్రులే కాక రచయితలు కూడా సాహిత్యంలోకి తీసుకురాలేదు. సాహిత్య విలువలు, సామాజిక బాధ్యత తెలిసిన ఆమె ఏ ప్రక్రియ చేపట్టినా నిబద్ధతతో ప్రతిభావంతంగా రాసింది. మేము ప్రచురించి ఇచ్చిన 'ఆటలో అరటిపండు' పుస్తకానికే సుజాతాదేవికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం రావటంతో మాకే వచ్చినంతగా సంబరపడ్డాము నేను, వీర్రాజుగారు.

రెండు మూడేళ్ళుగా సుజాత ఫోన్లు చేస్తున్నా ఆమె మాటలు కొంత అసంబద్ధంగా ఉండటం గమనించి ఆమె పిల్లలతో మాట్లాడాను. 'అల్జీమర్' లక్షణాలు అప్పట్లోనే గమనించాను. కాని నేను సాహిత్యం గురించి, పాత రచయిత్రుల గురించి మాట్లాడినప్పుడు మామూలుగానే తన అభిప్రాయాలు చెప్తూనే వుంది. భగవద్గీత అంశాలను పాటలుగా రాస్తున్నానని ఫోన్ చేసినపుడు పాడి వినిపించేది. ఫోను చేసినపుడల్లా ఆమెతో మొత్తం పాటలు తొందరగా రాయటం పూర్తి చేసి పుస్తకంగానో, కేసెట్ గానో చేయమని ప్రోత్సహిస్తూ మాట్లాడేదాన్ని. అప్పటికి అదే ప్రయత్నంలో ఉన్నానని చెప్తుండేది.

2022 మార్చిలో వీర్రాజు గారి పెయింటింగ్స్ దామెర్ల కళానికేతన్‌కి వితరణ చేసిన సందర్భంలో వెళ్ళినప్పుడు కమల వాళ్ళ అమ్మ సుజాతని మేమున్న హోటల్‌కు తీసుకువచ్చింది. సుజాత నన్ను గుర్తుపట్టి మాట్లాడిందికాని మధ్య మధ్యలో మౌనంలోకి జారిపోవటం చూసి నేను దిగులుపడ్డాను. అదే నేను ఆమెను ఆఖరుసారి చూడటం. ఆ చిన్నినవ్వుతో.. ఆ చిలిపి నవ్వుతో.. ఇంక నన్ను అలా పలకరించేవారు ఎవరు సుజాతా...!

■ శీలా సుభద్రాదేవి



వాక్‌థాన్‌లో ప్లకార్డులతో యువతులు

సైబర్‌పై సమరం

- నగరంలో సైబర్ వాక్‌థాన్
- బెంజ్‌సర్కిల్‌లో మానవహారం



సైబర్ వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రి అనిత, సీపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, జాబ్‌ఫ్రాడ్, గూగుల్‌మ్యాప్‌లో రేటింగ్, డిజిటల్ అరెస్టు... ఇవన్నీ సైబర్ నేరాలు. వాటిల్లో ఇరుక్కుని వేలాది మంది కోట్లాది రూపాయలను పోగొట్టుకుంటున్నారు. తాము డబ్బులు పోగొట్టుకున్నామని రోజుకు ఐదారుగురు బాధితులు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఒకప్పుడు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) నేరాలు జోరుగా జరిగేవి. వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించడంతో ఈ నేరాల్లో బాధితులు ఇరుక్కోవడం తగ్గింది. ఇతర నేరాల్లో బాధితుల సంఖ్య పెరగడంతో ప్రజల్లో అవగాహన కల్పించడా నికి పోలీసులు శ్రీకారం చుట్టారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సి పల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకు శనివారం సైబర్ వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హోంమంత్రి అనిత ప్రారంభించారు. విస్తృతంగా జరుగుతున్న 16 నేరాలపై ప్రజలకు వివరించడానికి పోలీసులు ప్రత్యేకంగా ఒక సిమ్యూలేటెడ్ యాప్‌ను రూపొందించారు. దాన్ని ఆమె ప్రారంభించారు. ఈ అవగాహన కోసం ఎంపిక చేసిన సైబర్ కమాండోలకు ప్రత్యేక టీ షర్టులను అందజేశారు. విద్యార్థులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొని బెంజ్‌సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. తామంతా సైబర్ పౌరులుగా తయారైన ప్రజలకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు టి.హరికృష్ణ, గౌతమీశాలి, కె.చక్రవర్తి, ఉదయరాణి, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్ర, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్రద్ధే సైబర్ నేరాలకు కారణం



తెలియనితనం, అజాగ్రత, అశ్రద్ధను సైబర్ నేరగాళ్లు ఆసరగా చేసుకుని నేరాలు చేస్తున్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా జీవితంలో అనేక మార్పులు వస్తున్నాయి. పోలీసింగ్‌లోనూ మార్పులు వస్తున్నాయి. ఇప్పుడు మన జీవితంలో టెక్నాలజీకి విడదీయరాని బంధం ఏర్పడింది. సైబర్ నేరాల నుంచి అవగాహనతో మాత్రమే బయట పడగలం. **- సృజన, కలెక్టర్**

రోజుకు ఐదారు మోసాలు



విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో రోజుకు ఐదారు సైబర్ నేరాలు జరుగుతున్నాయి. ఈ మోసాల్లో విద్యార్థులు, వైద్యులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇలా అన్ని వర్గాల వారు నష్టపోతున్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి. జాతీయ స్థాయిలో ఉండే ఈ పోర్టల్ సైబర్ నేరగాళ్ల లావాదేవీలను స్తంభింపజేస్తుంది. కమిషనరేట్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి 200 మంది సైబర్ కమాండోలను పోలీసు శాఖ నుంచి ఎంపిక చేశాం. వారికి ఈ నేరాలపై అవగాహన కల్పించి విద్యార్థులు, యువత నుంచి 2వేల మంది సైబర్ సోల్జర్స్‌ను తయారు చేస్తారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి? వాటి నుంచి ఎలా తప్పించుకోవాలన్న అంశాలపై కమాండోలు సోల్జర్స్‌కు శిక్షణ ఇస్తారు.

- రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

బాధ్యతాయుతంగా ఇంటర్నెట్ ఉపయోగించుకోవాలి



ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ వంటి అకౌంట్లు ఉండడం చాలామంది గర్వంగా భావిస్తున్నారు. కొంతమంది లింక్‌లు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేయాలా వద్దా అన్న విషయంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం లైఫ్‌ని ఈజీ చేయడానికి ఉంది. దీన్ని చాలామంది దుర్వినియోగం చేయాలనుకుంటున్నారు.

- ధ్యానచంద్, మున్సిపల్ కమిషనర్

టెండర్ల మాయాజాలం

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)లో టెండర్ల మాయాజాలం నడుస్తోంది. గడువు తీరిన దుకాణాలకు టెండర్లు పిలవకుండా పాత వారికే గడువులు పొడిగించటం పట్ల తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. పదేపదే గడువులు పెంచడంతో భారీ అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ఆహార సంబంధిత దుకాణాల నిర్వాహకుల గడువు ముగిసినా వారికే పొడిగిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఈ ఆరోపణలకు బలం చేకూర్చే సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

పీఎన్‌బీఎస్‌లో ఆహార సంబంధిత స్టాళ్ల గడువు ముగిసినా పొడిగింపు

- టెండర్లు పిలవకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన
- పాత వారికి ప్రయోజనం కల్పించేందుకు దూరాలోచన
- గత ప్రభుత్వం నుంచి నామినేషన్ పద్ధతిలో స్టాళ్ల కేటాయింపు
- ఒక విధానం లేకుండా అద్దెల నిర్ణయం





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పీఎన్‌బీఎస్‌లో ఆహార ఉత్పత్తుల స్టాల్స్ నిర్వాహకుల నుంచి ఇటీవల ఈ వ్యాపారాలను తాము నిర్వహించలేమని లేఖలు వచ్చాయి. వీటి వెనుక ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్టుగా తెలుస్తోంది. టెండర్లు పిలవకుండా వారికి నష్టం వచ్చిందన్న సాకుతో మరికొంత కాలం గడువును పెంచటం కోసం ఈ విధంగా వ్యవహరించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ వ్యాపారులకు నిజంగానే నష్టం వచ్చిందనే అనుకుంటే ఆర్టీసీ అధికారులు అద్దెలను తగ్గించాల్సి ఉంటుంది. ఈ పని చేయకుండా గడువులు పెంచటంలోనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆహార సంబంధిత నిర్వాహకులతో కొందరు ఉన్నతాధికారులు కూడా భాగస్వామ్య వ్యాపారాలను కలిగి ఉన్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. వ్యాపారులతో ఉన్న భాగస్వామ్య వాటాల కారణంగానే.. లీజుల గడువు తీరినా మళ్లీమళ్లీ పొడిగిస్తున్నారని తెలుస్తోంది. లీజులు పొడిగించటం ద్వారా ఎక్కువ కాలం వ్యాపారాలు చేసి లాభాలను గడించటానికి దోహదపడుతుంది. ఉన్న

వ్యాపారాల్లో అధికారులకు వాటాలు

వ్యాపారుల దగ్గర నష్టాలు వస్తున్నాయని లేఖలు తీసుకోవటం ద్వారా మళ్లీ టెండర్లు పిలిస్తే ఎవరూ రారేమోనన్న అభిప్రాయాన్ని కలిగించి తమ వారిని కొనసాగించేందుకు మంచి అవకాశం ఏర్పడుతుంది. ఆహార దుకాణాలకు సంబంధించి లీజు గడువులు ముగిసి నెలలు కావస్తున్నా ఆర్టీసీ ఉన్నతాధికారులు టెండర్లు పిలవటం లేదు.

వైసీపీ పాలనలోనే నామినేషన్ విధానం

ఆర్టీసీ ఉన్నతాధికారులు టెండర్ల సంప్రదాయానికి వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి తూట్లు పొడవటం ప్రారంభించారు. నామినేషన్ విధానంలో స్టాల్స్ ఇచ్చేస్తున్నారు. ఎలాంటి టెండర్లు పిలవకుండా.. పోటీదారులు రాకుండానే కొంత మంది వ్యక్తులకు దుకాణాలను నిర్వహించుకోవటానికి అవకాశం కల్పిస్తున్నారు. ఈ వ్యవహారాల మాటున కూడా భారీగా ముడుపుల పర్వం నడుస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం తక్షణం విచారణకు ఆదేశించాల్సిన అవసరంఎంతైనా ఉంది.

అద్దెలు అనూహ్యంగా పెంపు

ఆర్టీసీ అధికారుల అద్దె పెంపు విధానం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. బస్‌స్టేషన్‌లో వివిధ కేటగిరీ స్టాల్స్ నిర్వాహకులకు ఎంతమేర అద్దె నిర్ణయించగలిగితే ఉభయతారకంగా ఉంటుందన్న ఆలోచన చేయటం లేదు. చివరి టెండర్లలో ఎవరు ఎంత ఎక్కువ పాటకు పాడితే ఆ ధరలను ఫిక్స్ చేస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంలో అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత బస్‌స్టేషన్‌లో స్టాల్స్ వల్ల భారీగా వ్యాపారాలు చేయవచ్చన్న ఉద్దేశంతో ఎలా అయినా వాటిని దక్కించుకోవాలని ఔత్సాహికులు ఎక్కువ కోట్ చేశారు. అప్పటి నుంచి ఆర్టీసీ అధికారులు కూడా అవే ధరలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు బాగానే ఆర్జించారు. కొందరు ఆర్థికంగా నష్టపోయారు. వాస్తవానికి ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన ధరలు కొంప ముంచుతున్నాయి. పెద్దపెద్ద దుకాణదారులకు లాభంగా ఉంటుండగా.. చిన్న దుకాణాల వారికి మాత్రం నష్టాన్ని కలిగిస్తోంది. వాస్తవానికి కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి విధ్వంసం కారణంగా బస్‌స్టేషన్‌లో చాలా వరకు వ్యాపారాలు తగ్గాయి. కానీ గతంలో నిర్ణయించిన ధరలే ఉండటం వల్ల పలు స్టాల్స్‌కు సంబంధించిన టెండర్లలో ఎవరూ ముందుకు రాని విషయం కూడా వాస్తవమే. ఆహార సంబంధిత స్టాల్స్‌కు నష్టాలు ఉండకపోయినా చిన్నవారికి మాత్రం ఇబ్బందిగానే ఉంటుంది. ఈ విధానంపై ప్రభుత్వం సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కూడా ముక్కుపిండి వసూలు

విజయవాడలో రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన కనకదుర్గమ్మ తల్లి ఆలయం ఉంది. ఈ ఆలయానికి వచ్చే వారితో ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజూ ప్రయాణించేవారు వందల సంఖ్యలో ఉంటారు. అలాంటి దుర్గగుడికి సంబంధించి బస్‌స్టేషన్‌లో లడ్డూలు విక్రయించటానికి ఇచ్చిన ప్లేస్‌కు కూడా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. దుర్గగుడి వారికి ఇక్కడ లడ్డూలు విక్రయించటం వల్ల వచ్చే లాభమేమీ లేదు. భక్తుల కోసం తాపత్రయంతో దుర్గగుడి అధికారులు ఇక్కడ లడ్డూలు విక్రయిస్తున్నారు. దుర్గగుడి వల్ల ఆర్టీసీకి ఆదాయం వస్తుందన్న ఆలోచనలో ఆర్టీసీ ఉంటే.. స్టాల్ పేరుతో దుర్గగుడి నుంచి భారీగా డబ్బులు పిండుకోవాలని అనుకునేది కాదు. బస్‌స్టేషన్‌లో ప్రధానంగా మెడికల్ స్టాల్ అవసరం. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెడికల్ స్టాల్‌కు ప్రతి టెండర్‌లోనూ ఆర్టీసీ అధికారులు ధరలను పెంచేస్తున్నారు. ఆర్టీసీలో పోస్టాఫీసుకు కొంత స్పేస్ ఇచ్చారు. పోస్టాఫీసుల నుంచి కూడా దండిగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సాటి ప్రభుత్వ సంస్థల విషయంలో కూడా ఆర్టీసీ అధికారులు పూర్తి వ్యాపార దృష్టితో ఆలోచిస్తున్నారు.



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

పులిచింతలకు పెరిగి తగ్గిన ఇన్‌ఫ్లో


- ప్రకాశం బ్యారేజీకి పెరుగుతున్న అవుట్‌ఫ్లో
- పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద నిలకడగా వరద

విజయవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. అదే సమయంలో పులిచింతలకు దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ నుంచి అవుట్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న నీటిని మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 3 లక్షల 25 వేల 921 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఆ మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 15 గేట్లను 2.5 మీటర్ల మేరకు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి పెరుగుతున్న ఇన్‌ఫ్లో రాత్రికి తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు 3.16 లక్షల క్యూసెక్కులు నీరు వచ్చింది. సాయంత్రం ఆరు గంటలకు ఈ ఇన్‌ఫ్లో 3.29 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. తర్వాత రాత్రి పది గంటకు ఇన్‌ఫ్లో 3.25లక్షలకు చేరుకుంది. ప్రకాశం బ్యారేజీకి 3 లక్షల 27 వేల 900 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీకి ఉన్న 10 గేట్లు ఎనిమిది అడుగులు, 60 గేట్లు ఏడు అడుగుల మేరకు ఎత్తారు. 3 లక్షల 9 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి 3 లక్షల 17 వేల 835, పాలేరు 177, కీసర 9888 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువకు విడుదల చేస్తున్న నీటి నుంచి కాల్వలకు 14,451 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కేఈబీకి 1601, బందరు 1300, ఏలూరు 1404, రైవస్ 4619, కేఈ మెయిన్ 8924, కేడబ్ల్యూ 5527 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఉదయం ఆరు గంటలకు అవుట్‌ఫ్లో 2,46,950 క్యూసెక్కులగా ఉంది. మధ్యాహ్నం ఒంటి నుంచి ఈ అవుట్‌ఫ్లో పెరిగింది. 2,51,750 క్యూసెక్కుల నీటిని బ్యారేజీ నుంచి విడుదల చేశారు. ఆ తర్వాత క్రమంగా అవుట్‌ఫ్లో పెరిగింది. రాత్రి తొమ్మిది గంటలకు అవుట్‌ఫ్లో 2,94,550 క్యూసెక్కులకు చేరుకుంది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టిన ప్రకాశం బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఊపిరిపీల్చుకున్న ప్రజలు

అవనిగడ్డ రూరల్ : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న నీటితో పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద లక్షా 50 వేల క్యూస్కెల వరద ప్రవాహం కొనసాగుతోంది. రెండు రోజులుగా ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందిన లంక గ్రామాల ప్రజలు వరద ఉధృతి తగ్గటంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండు రోజులపాటు ఇదే వరద నీటి ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

దుర్గమ్మకు భద్రత..?



- సోషల్ మీడియాలో అంతరాలయ దృశ్యాలు
- నిఘా లోపమే అంటున్న భక్తులు
- ఆలయంలోకి సెల్‌ఫోన్ల నిషేధంపై చర్యలేవీ

వన్‌టౌన్, ఆగస్టు 10 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భద్రత కొరవడిందనడానికి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలే నిదర్శనం. దుర్గగుడిలో ఓ భక్తుడు అంతరాలయ చిత్రాలను సెల్ ఫోన్ ద్వారా చిత్రీకరించిన వీడియో దృశ్యాలు హల్ చల్ చేస్తున్నాయి. శుక్రవారం వీడియో తీసినట్టుగా తెలుస్తోంది. అంతరాలయంలోని అమ్మవారి మూల విరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో విడుదల చేస్తూ శుక్రవారం అమ్మవారి వైభోగాన్ని చూడండి.. అంటూ క్యాప్షన్ పెట్టారు. బహిరంగంగా అంతరాలయంలో అమ్మవారిని వీడియో తీస్తుంటే అక్కడ ఉన్న అధికారులు, సెక్యూరిటీ ఏం చేస్తోందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. అధికారులు, సెక్యూరిటీ అందరూ ఉన్నా కూడా ఆలయంలో జరుగుతున్నదానిపై దృష్టి పెట్టడం లేదనేది ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. నిబంధనల ప్రకారం అమ్మవారి అంతరాలయ దృశ్యాలు చిత్రీకరించకూడదు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాలకు కొన్ని నిబంధనలు ఉంటాయి. ఈ క్రమంలో అమ్మవారి ఆలయంలో ఎవరూ చిత్రీకరించకూడదు. పైగా ఆలయంలోకి సెల్ ఫోన్‌లు నిషేధం ఉన్నప్పటికీ చాలామంది సెల్ ఫోన్లతో వస్తున్నారు. తనిఖీల్లో డొల్లతనం కారణంగానే అమ్మవారి అంతరాలయ దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తరించిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతరాలయం వద్ద విధులు నిర్వహించే సూపరింటెండెంట్‌లు, ఏఈవోలు, ప్రైవేటు సెక్యూరిటీ, ఆలయ సిబ్బంది, అర్చకులు అంతా చిన్న ప్రాంతంలోనే కిక్కిరిసి ఉంటారు. అలాంటప్పుడు ఒక వ్యక్తి సెల్‌ఫోన్‌తో చిత్రీకరిస్తుంటే ఎందుకు పట్టుకోలేకపోయారన్నది ప్రశ్నగా ఉంది. గతంలో కూడా ఓ మహిళ అంతరాలయ దృశ్యాలను చిత్రీకరించి, ఫేస్‌బుక్‌లో పెట్టింది. తరువాత ఆమెను గుర్తించారు కానీ, చర్యలు తీసుకోకపోవటంతో ఇలాంటివి పునరావృతమవుతున్నాయి. దుర్గగుడిలో భద్రతా చర్యలపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న దుర్గగుడి అంతరాలయ దృశ్యాలు



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి హరనాథ్ దంపతులకు..

దుర్గమ్మసేవలో హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, ఆగస్టు 10 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఏఈవో రమేష్ బాబు వారికి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం, వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణ శుద్ధ షష్ఠి సందర్భంగా వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. శనివారం వల్లీ, దేవసేన అర్చనామూర్తులకు తొలుత అభిషేకాదులు నిర్వహించి, కళ్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయ సిద్ధంగా కళ్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు తదితరులు కళ్యాణోత్సవంలో పాల్గొని తలంబ్రాలు సమర్పించారు. నాగపుట్ట వద్ద పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గమ్మకు 52 గ్రాముల బంగారు నత్తువ కానుక..



హైదరాబాద్‌కు చెందిన ఎస్.దయానంద్ దంపతులు అమ్మవారికి అలంకరణ నిమిత్తం 52 గ్రాముల రాళ్లు పొదిగిన బంగారు నత్తువ (ముక్కుపుడక)ను కానుకగా సమర్పించారు. దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావులను కలిసి నత్తువను అందజేశారు.

25 గ్రాముల బంగారం హారం..



దుర్గమ్మకు అలంకరణ నిమిత్తం కృష్ణా జిల్లా చల్లపల్లి చింతలమడకి చెందిన ఎస్.వెంకట సుబ్బారావు కుటుంబసభ్యులు 25 గ్రాముల బంగారు హారాన్ని ఈవో కేఎస్ రామారావులను కలిసి అమ్మవారికి కానుకగా అందజేశారు.

పోరంకి ఎన్టీఆర్ వీధికి చెందిన లావు నాగవరప్రసాద్ అన్నవితరణ నిమిత్తం రూ.1,01,116లను పద్మజ, వెంకట రుద్రాన్ష్ పేరిట విరాళం అందజేశారు.

ధర్మపథం వేదికపై..

ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం శలక రఘునాథ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అమ్మవారి విశేషాలు, భక్తికి సంబంధించిన పలు అంశాలను భక్తులకు వివరించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనను సత్కరించారు.



చదరంగం ఆడుతున్న బాల క్రీడాకారులు



ఎత్తుకు పై ఎత్తు..

- ఆలోచింపచేసిన చిన్నారుల చదరంగం పోటీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 10 : కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్, సన్‌స్టార్ స్కూల్ ఆధ్వర్యంలో అండర్ 13 జిల్లా స్థాయి బాల బాలికల చదరంగం పోటీలు శనివారం క్రీడాకారులను ఆలోచింప చేశాయి. అండర్ 13 బాలబాలికలు పోటీలో పాల్గొన్నారు. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ క్రీడాకారులు పోటీ పడ్డారు. సీనియర్లను తలపించేలా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. బాలుర విభాగంలో 84, బాలిక విభాగంలో 40 మంది పాల్గొన్నారు. బాలుర విభాగంలో 6, బాలికల విభాగంలో 5 రౌండ్లలో పోటీలు నిర్వహించారు. విజయవాడ, గుడివాడ, అవనిగడ్డ, పెడన ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. బాలుర విభాగంలో లలిత కౌషిక్ ప్రథమ, ఎం.కార్తీకేయ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో అట్లా అక్షయ ప్రథమ, ఎన్.నాగసుభశ్రీ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలను శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఫణి తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం డివిజన్ అప్సా అధ్యక్షుడు జాన్, స్టార్ అకాడమీ మెంటర్ శ్రీరాం, డైరెక్టర్ అయ్యప్పస్వామి, ప్రిన్సిపల్ ఎం.ఎల్. ఆదిత్యలు బహుమతులు అందజేశారు. ఆదివారం అండర్ 9 క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

రైల్వే ప్రాజెక్టులకు క్లియరెన్స్

- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఎం వెల్లడి

రైల్వేస్టేషన్, ఆగస్టు 10 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన రైల్వే ప్రాజెక్టు క్లియరెన్స్‌లపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. అనేక కొత్త ప్రాజెక్టుల గురించి ఆయన ప్రస్తావించారు. రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని 8 ప్రాజెక్టులకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు మొత్తం అంచనా వ్యయం రూ.24,557 కోట్లు అని తెలిపారు. 2030 - 2031 ఆర్థిక సంవత్సరానికి ఈ ప్రాజెక్టులు పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా పాండురంగాపురం-భద్రాచలం-మల్కన్‌గిరి కొత్త రైల్వే ప్రాజెక్టును గిరిజన ప్రాంతాల ద్వారా తీసుకున్నామని, కొత్త రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. అసన్‌సోల్-వరంగల్ మధ్య రైలు మార్గం, జనాఘర్ -నవరంగపూర్-జీపూర్, మల్కన్‌గిరి-భద్రాచలం-పాండురంగాపురాల మధ్య కన్టెవిటీ ఉంటుందన్నారు. రూ.7,383 కోట్లతో 290 కిలోమీటర్ల రూట్‌లో రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ మాట్లాడుతూ, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే విజయవాడ-హౌరా తీర రేఖకు ప్రత్యామ్నాయ, సమాంతర మార్గంగా కొత్త ప్రతిపాదిత మార్గాలు పనిచేస్తాయని తెలిపారు. పాండురంగాపురం, మల్కన్‌గిరి, భద్రాచలం మీదుగా జనాఘర్ 85.5 కిలోమీటర్ల దూరం రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాలోనే ఉందన్నారు. ఒడిసా రాజధాని ఇంటెన్సివ్ ఇండస్ట్రీ క్లస్టర్లను ఈ రైలు మార్గం కలుపుతుందని తెలిపారు. సరుకు రవాణాను సులభతరం చేసేందుకు ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడే ప్రధాన ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చినందుకు, కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం విజయవాడ - హౌరా సెక్షన్ల కెపాసిటి 130 శాతానికి చేరిందని, అనేక కొత్త రైళ్ల నిర్వహణకు మార్గమవుతుందన్నారు.



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్‌లో విజయవాడ డివిజన్ నుంచి పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్

రిజర్వేషన్లపై ఆందోళనలు చేపట్టండి

- మాలల జేఏసీ పిలుపు

గవర్నర్‌పేట, ఆగస్టు 10 : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని మాలల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మాలల జేఏసీ నిర్ణయించింది. శనివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకె)లో జరిగిన మాలల జేఏసీ నేతల సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జేఏసీ సభ్యులు, మాల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. రిజర్వేషన్లను సమూలంగా రద్దు చేసే కుట్రలో భాగంగానే ఈ తీర్పు వచ్చిందని, ఈ తీర్పు వెనుక ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష మరోమారు నిరూపితమైందని సమావేశంలో వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ కులాల మధ్య ఐక్యత దెబ్బతీయడానికి, వారి హక్కులు కాలరాయడానికి, వారి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు పట్ల మనువాద వ్యవస్థకు ఉన్న వివక్షను ఈ తీర్పు ద్వారా బయటకు వచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సరైన అధ్యయనం చేయకుండా జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయడం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమాలు, ధర్నాల ద్వారా తీర్పుకు వ్యతిరేకంగా ప్రజా మద్దతు కూడగడతామని, రిజర్వేషన్లు వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. జేఏసీ పిలుపునకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా మాలలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ఎమ్మెల్యే శ్రావణకుమార్, మాజీ ఎంపీ హర్షకుమార్, మాలల సంఘాల నేతలు మదిరి రాంబాబు, మల్లెల వెంకటరావు, పంతగాని రమేష్, దిలీప్, రాజా, జయకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణకుమార్

బీచ్ కబడ్డీ క్వార్టర్స్‌లో హర్యానాపై ఏపీ ఓటమి

విజయవాడ స్పోర్ట్సు: బీహార్ రాష్ట్రం బోధ గయలో జరుగుతున్న సీనియర్ నేషనల్ బీచ్ కబడ్డీలో రాష్ట్ర పురుషుల జట్టు క్వార్టర్స్ ఫైనల్స్‌లో హర్యానా చేతిలో శనివారం పరాజయం పాలైంది. శుక్రవారం వరుసగా తమిళనాడు, ఢిల్లీపై ఘన విజయం సాధించి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టిన ఏపీ జట్టు సెమీస్‌కు చేరుతుందని ఆశించినప్పటికీ పోరాడి 10 పాయింట్ల తేడాతో హర్యానా చేతిలో ఓడి ఇంటి దారి పట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

మైలవరం, ఆగస్టు 10 : విద్య రంగ సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని, విద్యా రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. మైలవరంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం రెండో రోజు నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవో నంబరు 77ను వెంటనే రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ సుధాకర్, మహేష్, చరణ్, శశి, ఉహ నబి, భావన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవేంద్రరావు

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 10 : సమగ్ర శిక్షలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష పార్ట్‌టైం ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సీహెచ్ దేవేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు జి.వనజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవేంద్రరావు మాట్లాడారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న క్రాఫ్ట్, ఆర్ట్, పీఈటీ టీచర్లను 2009లో జీవో 84 ప్రకారం రెగ్యులర్ చేయాలన్నారు. రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎ.శేషుబాబు, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

వానొచ్చె.. వరదొచ్చె

చెరువుల్లా రోడ్లు.. పడవలు, ట్రాక్టర్లపైనే ప్రయాణం

- వంతెనల నిర్మాణానికి నేతల హామీలు బుట్టదాఖలు
- కార్యరూపం దాల్చని పనులు
- చెవిటికల్లు వాసులకు తప్పని కష్టాలు



వాగు పొంగటంతో ట్రాక్టర్‌పై వస్తున్న గ్రామస్తులు

చెవిటికల్లు వాగులపై వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదనలు ఏళ్లు గడుస్తున్నప్పటికీ కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్పితే కార్యరూపం దాల్చటం లేదు. వర్షాకాలంలో వాగులు పొంగి గ్రామస్తులు బయటకు వచ్చేందుకు వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు నిర్మిస్తున్నామంటూ ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. నేతల డిమాండ్ మేరకు ముడుపులు చెల్లించలేక కాంట్రాక్టరు పరారు కావటంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

కంచికచర్ల : కంచికచర్ల మండలంలో కృష్ణా నది తీర గ్రామాల్లో చెవిటికల్లు ఒకటి. ఇక్కడ నది మూడు కిలోమీటర్లకు పైగా వెడల్పు ఉంటుంది. ఇంతకు ముందు ఈ గ్రామం మీదుగానే గుంటూరు జిల్లా పాత అమరావతికి రాకపోకలు సాగేవి. చెవిటికల్లు నుంచి కంచికచర్ల వెళ్లే ప్రధానమైన తొమ్మిది కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డులో గ్రామం మొదట్లో రెండు వాగులు ఉన్నాయి. ఈ రెండు చోట్ల ఐదారు అడుగుల లోతులో లోలెవల్ కాజ్‌వేలు ఉన్నాయి. వర్షాకాలంలో కిలోమీటర్ల దూరం ఎగువ పంట భూముల నుంచి వచ్చే నీరు ఈ వాగుల ద్వారా నదిలో కలుస్తుంది. వరదలు వచ్చినపుడు కృష్ణా నది ఈ వాగులకు ఎగదాపు అవుతుంది. వరదలపుడు, భారీ వర్షాలు పడినపుడు రెండు వాగుల్లో పది అడుగుల పైగా వరద నీరు చేరుతోంది. కిలోమీటరు దూరం రోడ్డు ముంపునకు గురవుతున్నది. వాగులు పోటెత్తినపుడు గ్రామస్తులు బయటకు రావటానికి వీలుపడటం లేదు. గ్రామం ద్వీపంలా మారుతుంది. మరో మార్గం లేక పడవలను ఆశ్రయించాల్సి వస్తున్నది. గతంలో వాగుల వద్ద జరిగిన ప్రమాదంలో 13 సంవత్సరాల బాలిక మృతి చెందింది. వాగుల వద్ద ఎత్తైన వంతెనలు నిర్మించాల్సిందిగా గ్రామస్తులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పాలకులకు, అధికారులకు ఇచ్చిన వినతిపత్రాలు బుట్టదాఖలా అయ్యాయి తప్పితే ఇప్పటి వరకు అతీ గతీ లేదు. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఎన్నికలకు ముందు ఒక వాగుపై వంతెన నిర్మాణానికి 1.80 కోట్లు మంజూరైనట్టుగా వైసీపీ నేతలు చెప్పారు. అప్పటి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు శంకుస్థాపన కూడా చేశారు. కాంట్రాక్టరు ఇనుము, ఇతర మేటీరియల్ కూడా సిద్ధం చేశాడు. వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండ డైవర్షన్ రోడ్డు వేశారు. ఇంతలో ఏమైందో.. కాంట్రాక్టరు మేటీరియల్ తీసుకుని వెళ్లిపోయాడు. నేతలు అడిగిన మేరకు ముడుపులు చెల్లించలేక పరారయ్యాడని తెలుగుదేశం నాయకులు ఆరోపిస్తున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని నిధులు మంజూరు చేసి, వంతెనలు నిర్మించాల్సిందిగా గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.





విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్‌లో కదలిక

- జక్కంపూడి-రెమిడిచర్ల వరకు 30 కిలోమీటర్లు
- 280 ఎకరాల పైబడి భూ సేకరణ అవసరం
- జేసీ నిధి మీనాను కలిసిన ఖమ్మం ఎన్‌హెచ్ పీడీ
- భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నాగపూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ-ఖమ్మం మధ్య నిర్మించనున్న నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే భూ సేకరణ ప్రక్రియకు అడుగు ముందుకు పడింది. కూటమి ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ సంబంధిత అంశాలపై జాయింట్ కలెక్టర్ నిధిమీనా సమీక్ష చేశారు. ఖమ్మం డివిజన్ నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఎం.రామాంజనేయ రెడ్డి జేసీ నిధి మీనాను కలవటంతో ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. నాగ్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ-ఖమ్మం అనుసంధానానికి సంబంధించి జక్కంపూడి నుంచి రెమెడిచర్ల వరకు 30 కిలోమీటర్ల పొడవున భూమి సేకరించాల్సి ఉంది. మొత్తం ప్రాజెక్టుకు సంబంధించి 280 ఎకరాలకు పైగా భూములు సేకరించాల్సి ఉండగా.. ఇప్పటికే సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. సుమారు 180 ఎకరాల సేకరణకు మార్గం సుగమమైనా ఇంకా కొంత భూమిపై ప్రక్రియ జరగాల్సి ఉంది. ప్రాజెక్టు పనులను మేఘా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే. నాగ్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్ పనుల్లో విజయవాడ-ఖమ్మం అనుసంధానమే చివరిది కావటం గమనార్హం. విజయవాడ నుంచి చూస్తే ఇదే మొదటిది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్లు ఖరారు కావటంతో పాటు పలు ప్యాకేజీలలో పనులు జరుగుతున్నాయి. విజయవాడ-ఖమ్మం మధ్య కూడా పనులు ప్రారంభమైతే ఈ ప్రాజెక్టుకు పూర్తి రూపం వస్తుంది.



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెట్టెం రఘురాం

వైసీపీ నుంచి టీడీపీలోకి సర్పంచ్, వార్డు సభ్యులు

కంచికచర్ల రూరల్, ఆగస్టు 10 : కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీత, ఆమె భర్త వేల్పుల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు గొర్రెపాటి సతీష్, శేషం సుధ, షేక్ ఖరిమా, కావాటీ ఉషారాణి - రాంబాబు, ఓర్సు నరసింహారావు, చెన్నంశెట్టి కుమారి ప్రసాద్‌లు వైసీపీని వీడి శనివారం టీడీపీ తీర్థం తీసుకున్నారు. వీరితో పాటు వైసీపీ నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, పుల్లగూర బాబు, దాసరి రాము, జోరిగ కిషోర్, గ్రంధి వెంకటేశ్వరరావు, కావాటి రాంబాబు, వీర్నాల వెంకటేశ్వరరావు, కట్టా తిరుపతిరావు, బాణావత్ సురేష్ (వలంటీర్), బర్రె విష్ణు, చలవాది లక్ష్మణరావు, ఆవుల రాంబాబు, మంగిశెట్టి ప్రతాప్, మాగంటి నరేంద్రబాబు, చల్లా చిట్టిబాబు తదితరులు టీడీపీ తీర్థం తీసుకున్నారు. వారికి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మండల టీడీపీ అధ్యక్షుడు కోగంటి బాబులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కంచికచర్లతో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లు కనిపిస్తుంది. ఈసందర్భంగా రఘురాం మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులై పలువురు టీడీపీలోకి వస్తున్నట్లు చెప్పారు.

ఎస్పీఎఫ్ ఎస్ఐకు గాయాలు

వన్‌టౌన్, ఆగస్టు 10 : గొల్లపూడి వన్ సెంటర్ వద్ద టిప్పర్ ఢీకొనటంతో వీటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు (59)కు గాయాలైనట్టు శనివారం భవానీపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, చినకాకానిలో శ్రీనివాసరావు కుటుంబంతో నివాసం ఉంటూ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (ఎస్పిఎఫ్) సబ్ ఇన్స్పెక్టర్‌గా వీటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజూ బైక్‌పై ఉదయం 6 గంటలకు పెరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి 7 గంటలకు వీటీపీఎస్‌కు విధులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ ఇబ్రహింపట్నం నుంచి బైక్‌పై వస్తుండగా గొల్లపూడి వన్ సెంటర్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాధితుడు కుడి చేతికి బలమైన గాయమైంది. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం సూర్యారావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిచ్చికుక్క దాడి ముగ్గురికి గాయాలు



నందిగామ రూరల్ : సోమవరం గ్రామంలో పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు గాయపడిన ఘటన శనివారం జరిగింది. గ్రామానికి చెందిన సునీత, రాజ్‌కుమార్, వెంకట నరసమ్మలను పిచ్చికుక్కలు దాడి చేసి గాయపరిచాయి. బాధితులకు గోళ్లమూడి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి చికిత్స అందించి వ్యాక్సిన్ వేశారు. కొంత కాలంగా గ్రామంలో కుక్కల సంచారం అధికంగా ఉందని, పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పంచాయతీ అధికారులకు తెలిపినా కనీసం పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

ఇద్దరు యువకుల అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్: ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి నగదు లాక్కున్న ఇద్దరు యువకులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం బుడమేరు మధ్యకట్ట ప్రాంతానికి చెందిన నంద్యాల రమేష్ అతని బాబాయి వెంకటేశ్వరరావులు ఈనెల 8న తెల్లవారుజామున బుడమేరు వంతెన వద్ద టీ తాగి బయలుదేరుతుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి వీరు వెళ్తున్న రిక్షాకు వాహనాన్ని అడ్డంపెట్టి వారిపై దాడి చేశారు. ఇరువురి వద్ద నుంచి రూ. 1860 లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దాడికి పాల్పడిన యువకులు వాంబేకాలనీకి చెందిన తమ్మిశెట్టి సందీప్, సింధపల్లి అప్పన్నలుగా గుర్తించారు. పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే జగన్‌కు బుద్ధి చెబుతాం

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, ఆగస్టు 10: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండూ సమపాళ్లలో చేసి చూపించి జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెబుతాం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 3వ డివిజన్ కనకదుర్గా నగర్లోని 4వ రోడ్డు నిర్మాణానికి గద్దె రామ్మోహన్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నగరంలోని సమస్యల పరిష్కారంపై టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. సైబర్ నేరాలపై నగర ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే రాంగ్‌కాల్స్, నకిలీ మెసేజ్‌లకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయ బారిన పడకుండా యువతను ఎలా కాపాడుకోవాలి, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎలా కల్పించాలన్న దానిపై తాము పూర్తి స్థాయిలో దృష్టి పెట్టామని చెప్పారు. ఈ తరుణంలో జగన్మోహన్ రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తూ రాష్ట్ర ప్రజలను పక్కదోవ పట్టించాలని ప్రయత్నం చేయడం సబబు కాదన్నారు. కాలనీ అధ్యక్షుడు యలమందరావు, డివిజన్ అధ్యక్షుడు తాడి బాబూరావు, టీడీపీ సీనియర్ నాయకులు ముమ్మనేని ప్రసాద్, గుత్తికొండ కృష్ణమోహన్, గద్దే రమేష్, యలమంచలి పండు, గొల్లపల్లి నారాయణరావు, పేరేపి ఈశ్వర్, ఇంద్రకుమార్, వంగల కృష్ణప్రసాద్, మాధవ్, జాస్తి శ్రీనివాసరావు, సుబ్బారావు, అడపా శివనాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మీ పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు

పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు సూచన

మొగల్రాజపురం, ఆగస్టు 10: కళాశాలకు వెళుతున్న తమ పిల్లల్ని తల్లిదండ్రులు గమనిస్తుండాలని, కళాశాలకు సక్రమంగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో మొట్టమొదటి సారిగా మూడు రోజుల పాటు తల్లిదండ్రులతో జరిగిన సమావేశం శనివారంతో ముగిసింది. ఆర్ట్స్, సైన్సు గ్రూపుల వారీగా జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లను తరగతి గదుల్లోకి అనుమతించేది లేదని, తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇవ్వొద్దని సూచించారు. హాజరు లేకపోతే పరీక్షలకు పంపడం జరగదని హెచ్చరించారు. సైన్సు విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ తరగతుల నిర్వహణ, ఆర్ట్స్ విద్యార్థులకు టాలీ కోర్స్‌ల్లో శిక్షణ ప్రారంభ వివరాలను తెలిపారు. అనంతరం జూన్, జూలై హాజరుశాతాన్ని, జూలైలో నిర్వహించిన పరీక్షల ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థి తల్లిదండ్రులతో విడివిడిగా ముఖాముఖి మాట్లాడారు. ఇంటర్ మీడియట్ ఆర్ట్స్, సైన్సు గ్రూపులకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు

కేరళ బాధితులకు ఇస్కఫ్ విరాళం



గవర్నర్‌పేట, ఆగస్టు 10: కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని భారత స్నేహ, సాంస్కృతిక సహకార సంఘం (ఇస్కఫ్) జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్ర విభాగం సేకరించిన రూ. 25 వేలు, సంఘ పత్రిక మైత్రి నిర్వహణ కోసం సేకరించిన రూ. 10 వేలను శనివారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి అజయ్‌కుమార్, మోతుకూరి అరుణ్‌కుమార్‌లు, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్‌కు అందజేశారు. వరద సహాయ నిధిని కేరళ ఇస్కఫ్ కమిటీకి పంపుతున్నట్లు మోతుకూరి తెలిపారు.

దేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



చిట్టినగర్, ఆగస్టు 10: శ్రావణ శుక్రవారం సందర్భంగా కాంచీపురం కంచి కామకోటి పీఠం ప్రధాన అర్చకులు నట రాజన్ శాస్త్రి శుక్రవారం రాత్రి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠంను సందర్శించి శ్రీ చక్రార్చన చేశారు. దేవి కరుమారి అమ్మన్ పీఠం పీఠాధిపతి కరుణ దాసు మాట్లాడుతూ కామాక్షి పీఠం తరుపున ఈ పీఠంలో 10 రోజులపాటు దశ మహా విద్య యాగాలు నిర్వహిస్తామన్నారు. అమ్మన్ పీఠం అర్చకులు జ్ఞానేశ్వర్, ప్రముఖ న్యాయవాది కొరగంజి హేమంత్ పాల్గొన్నారు.

రణదీవెనగర్ ప్రాంతంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు దోనేపూడి కాశీనాథ్

కృష్ణలంక, ఆగస్టు 10 : కృష్ణలంకలోని 20, 21 డివిజన్ల పరిధిలోని రణదీవెనగర్ ప్రాంతం ముంపునకు గురికాకుండా కాపాడాలని, తక్షణమే అవుట్ ఫాల్‌డ్రెయిన్ నిర్మాణం చేపట్టి ప్రజల ఆరోగ్యాలను రక్షించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. కృష్ణానది వరద ప్రవాహానికి ఇళ్లు మునగకుండా 20, 21 డివిజన్ల పరిధిలోని రణదీవెనగర్‌లో చేపట్టిన రిటైనింగ్ వాల్ ప్రాంతంలో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణాన్ని విస్మరించారన్నారు.

దాదాపు 7 అడుగుల లోతు మేరకు డ్రెయినేజీ నీరు రణదీవెనగర్‌లో ఆరు చోట్ల పేరుకుపోయి చాలా ప్రమాదకరంగా వుందన్నారు. ఇదే తరహా సమస్య రాణిగారితోటలోని భూపేష్‌గుప్తానగర్, తారకరామా నగర్‌లలో కూడా వుందన్నారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం వలనే ఈ సమస్య పరిష్కారమవుతుందని కాశీనాథ్ పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించని పక్షంలో ప్రజలను కలుపుకొని సీపీఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ ముందు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, తాడి రమణ, కొరవి శివాజీ, సరోజనమ్మ, పెంటి కోటి, అంగిడి లక్ష్మణ, రాజా, నాగరాజు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు కాశీనాథ్ తదితరులు

వృద్ధురాలి మెడలో చైన్ లాక్కెళ్లిన కేసులో మహిళ అరెస్టు

వన్‌టౌన్, ఆగస్టు 10 : వృద్ధురాలి మెడలో 2 కాసుల బంగారు చైన్ అపహరించిన కేసులో గూటాల మానసవీణ (39)ను శనివారం కృష్ణలంక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణలంక ఆర్చి రోడ్డులో వెంకట లక్ష్మి (62) ఉంటుంది. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని మహిళ ఇంట్లోకి చొరబడి వెంకట లక్ష్మి మెడలో ఉన్న సుమారు 2 కాసుల బంగారు చైన్‌ని లాక్కొని గోడదూకి పరారైంది. సమాచారం తెలుసుకున్న గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, ఉండవల్లిలో ఉంటున్న బాధితురాలి కుమార్తె అరవపల్లి లలిత అదేరోజు సాయంత్రం కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీఎస్ ఏసీపీ స్రవంతి రాయ్ ఆదేశాల మేరకు ఎస్ఐ దుర్గాదేవి తన సిబ్బందితో 24 గంటల్లోనే బాపిస్టుపాలెంకు చెందిన ప్రస్తుతం కృష్ణలంకలో ఉంటున్న గూటాల మానసవీణను అరెస్టు చేసి, రెండు కాసుల బంగారు చైన్‌ను రికవరీ చేశారు. మానస వీణను కోర్టులో హాజరుపరిచారు.



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ దుర్గాదేవి

లయోలాలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

పటమట, ఆగస్టు 10 : ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో శనివారం ఉన్నత విద్యలో పరిశోధన ప్రక్రియలు, పద్ధతుల్లో బెంచ్ మార్కు అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ జరిగింది. ముఖ్య అతిథి రిటైర్డు చీఫ్ కో-ఆర్డినేటర్, ఇస్రో-డీఆర్‌డీవో సైంటిస్ట్, డాక్టర్ మనియోజి మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధన అనేది విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు కలిసి ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడానికి ముఖ్యమైన అంశంగా మారిందని, ఈ క్రమంలో పరిశోధన ప్రక్రియలు, పద్ధతుల్లో బెంచ్ మార్కింగ్ అత్యంత అవసరంగా పరిగణించబడుతుందన్నారు. బెంచ్ మార్కింగ్‌కు అవసరమయ్యే ముఖ్యాంశాలు, సమగ్ర అభివృద్ధి ఇవన్నీ కూడా తమ పరిశోధనా నాణ్యతను మెరుగుపరిచి, అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చునని పేర్కొన్నారు. ఇంత చక్కని కార్యక్రమం నిర్వహించిన ఐక్యూ ఏసీని కళాశాల మేనేజ్‌మెంట్ ఫాదర్ జోజిరెడ్డి, సెక్రటరీ అండ్ డైరెక్టర్ ఫాదర్ పీఆర్ జాన్, రెక్టార్ ఆఫ్ లయోలా ఇన్‌స్టిట్యూషన్స్ ఫాదర్ డి. బాలస్వామిలు అభినందించారు.



డాక్టర్ మనియోజిని సత్కరిస్తున్న లయోలా యాజమాన్యం

స్థూలకాయుల్లో కీళ్లనొప్పులు అధికం

● డాక్టర్ భరత్‌చంద్ర



మాట్లాడుతున్న డాక్టర్ కే భరత్‌చంద్ర

పటమట, ఆగస్టు 10 : స్థూలకాయం ఉన్న వాళ్లకి కీళ్లనొప్పుల సమస్య అధికంగా ఉంటుందని ప్రముఖ ఎముకల కీళ్ల వైద్య నిపుణులు కె. భరత్ చంద్ర పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన కీళ్లనొప్పులు అనే అంశంపై సవివరంగా ప్రసంగించారు. కీళ్ల నొప్పులకు ప్రాథమిక దశలోనే నివారణ చర్యలు తీసుకుంటే ఫలితం ఎక్కువగా ఉంటుందన్నారు. జంక్ ఫుడ్ తినేవారిలో ఇతర ఆరోగ్య సమస్యలతో పాటు కీళ్ల నొప్పులు కూడా కనిపిస్తాయని, కీళ్ల నొప్పులు ఉన్నవారు కమోడ్ వాడాలని సూచించారు. స్టాటిక్ సైకిల్ రోజూ కొంత సేపు తొక్కడం, స్విమ్మింగ్ చేయడం, యోగా చేయడం అవసరమన్నారు. పండ్లతో పాటు విటమిన్ డి, కాల్షియం మాత్రలు వేసుకోవాలని వివరించారు. ఆధునిక యుగంలో కీళ్ల మార్పిడికి రోబోటిక్ సర్జరీ వచ్చిందని, దీని వల్ల కూడా చక్కని ఫలితాలు ఉంటాయన్నారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

28న ఏటీప అధ్యక్ష ఎన్నిక

ఆటోనగర్, ఆగస్టు 10: ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్(ఏటీప) అధ్యక్ష పదవికి ఈనెల 28న ఎన్నికలు జరపనున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు రాజనాల బాట్జీ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సభ్యత్వ బకాయిలు ఈనెల 24లోపు చెల్లించి ఓటుహక్కును పునరుద్ధరించుకోవాలని కోరారు.



చిన్నారులతో కమిషనర్ ధ్యానచంద్ర

ఫన్‌టైమ్ క్లబ్‌లో వసతులపై ఆరా

పటమట, ఆగస్టు 10 : గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్ క్లబ్‌లో వసతులపై వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర శనివారం ఆరా తీశారు. ఈ ప్రాంతంలో పర్యటించిన ఆయన ఫన్‌టైమ్ క్లబ్‌లో చిన్నారులతో కాసేపు సందడి చేశారు. ఇక్కడ వివిధ ఆటలు ఆడుతున్న క్రీడాకారులను ఆయన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పటమటలోని ఖన్నా నగర్‌లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరపాలని కార్మికులకు ఆదేశించారు. ఖాళీ ప్రదేశాల యజమానులు తమ ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

జాబ్‌మేళాలో జనసైనికుల సేవలు

భవానీపురం, ఆగస్టు 10 : పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళా కార్యక్రమంలో పలు డివిజన్లకు చెందిన జనసేన నేతలు, కార్యకర్తలు అభ్యర్థుల దరఖాస్తులను పూరించడం, వాటిలో లోటుపాట్లను వివరించి సరిచేయడం వంటి సేవలతో ఆకట్టుకున్నారు. 45వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాబు, ఉపాధ్యక్షుడు దుర్గా కిషోర్‌లు పాల్గొని సేవలందించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 10: భార్యను వేధిస్తున్న ఓ వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో బొందల వరలక్ష్మి, కృష్ణ దంపతులు ఉంటున్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన కృష్ణ భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం కృష్ణ తప్పతాగి భార్యను వేధించడంతో ఆమె న్యూ రాజరాజేశ్వరిపేటలోని పుట్టింటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వొత్తులతో వైసీపీ నాయకుల నిరసన

వన్‌టౌన్, ఆగస్టు 10 : స్వరాజ్యమైదాన్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేసినందుకు నిరసనగా శనివారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, తూర్పు వైసీపీ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ అసిఫ్, పార్టీ నాయకులు గౌతమ్ రెడ్డి, పోతిన మహేశ్, గుండే సుందరపాల్, వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

పటమట : బెంజిసర్కిల్ ఆంజనేయస్వామి గుడి వెనుక సర్వీసు రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్, కార్పొరేట్ కళాశాలకు సంబంధించిన వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచటంతో ద్విచక్రవాహనాలు, కార్లు ఆ రోడ్డులో వెళ్లాలంటే చుక్కలు కనబడుతున్నాయి. మచిలీపట్నం, గుడివాడ, భీమవరం వైపు నుంచి వచ్చే బస్సులు బెంజిసర్కిల్ నుంచి ఈ సర్వీసు రోడ్డు ద్వారానే వెళుతుంటాయి. బందర్ రోడ్డులో ట్రాఫిక్ స్థంభించినప్పుడు ప్రత్యామ్నాయంగా ద్విచక్ర వాహనదారులు, కార్లు ఈ సర్వీసు రోడ్డులో వెళ్లే సమయంలో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర నుంచి బెంజిసర్కిల్ వరకు ప్రైవేట్ బస్సులు తమ ఇష్టారాజ్యంగా రోడ్డుమీదే నిలిపి ఉంచడంతో ప్రతి రోజు వాహనదారులు నరకం చూస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

చర్చి సెంటర్‌లో ప్రమాదకరంగా గోతులు

పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



భవానీపురం, ఆగస్టు 10 : వరుస వర్షాలతో భవానీపురంలోని చర్చి సెంటర్‌లో భారీ గోతులు ఏర్పడి ప్రమాదభరితంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే నాలుగు కూడలి జంక్షన్‌లో ఈ గోతులు దగ్గరకు వస్తే గానీ కనిపించవు. ఊర్మిళానగర్ నుంచి రోడ్డుపైకి వచ్చి గొల్లపూడి వైపు, క్రాంబ్వే రోడ్డు నుంచి గొల్లపూడి వెళ్లే వారికి ఇక్కడ గోతులు పడ్డ విషయం దగ్గరకి వెళితే గానీ కనిపించవు. ఎవరి తొందరలో వారు రాకపోకలు సాగించడం వలన ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. యుద్ధప్రాతిపదికన ఇక్కడ గోతులను పూడ్చాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.



ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఉయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'



నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీ.జే. మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.

'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.













వినేశ్ కేసు..13న తీర్పు



న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్ కేసు తీర్పుపై సస్పెన్స్ మరో రెండు రోజులు కొనసాగనుంది. తనపై అనర్హత వేటును భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (సీఏఎస్)లో సవాలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ ఎదుట శుక్రవారం వాదనలు జరిగాయి. వినేశ్ తరపున ఫ్రెంచ్ లాయర్లు, భారత ఒలింపిక్ సంఘం తరపున హరీశ్ సాల్వే, విధుష్పత్ సింఘానియా, అలాగే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. కాగా..సీఏఎస్ శనివారం తన తీర్పు వెలువరిస్తుందని భావించారు. అయితే ఒలింపిక్స్ ముగిశాక తీర్పు వెల్లడించాలని అడ్‌హాక్ కమిటీ నిర్ణయించినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తెలిపింది. ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు ఆర్బిట్రేటర్ జస్టిస్ అనాబెల్ బెనెట్ తీర్పు వెలువరించనున్నట్టు పేర్కొంది.



వినేశ్‌కు ఒలింపిక్ విజేత ఓదార్పు

నాది '50 గ్రాముల' బాధ

పారిస్: అందివచ్చిన పతకం చేజారడం ఎంత బాధాకరమో తనకు తెలుసునని ఒలింపిక్ చాంపియన్, జపాన్ రెజ్లర్ రీ హిగూచీ భారత స్టార్ వినేశ్ ఫొగట్‌ను ఓదార్చాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల 57కి. ఫ్రీస్టయిల్ రెజ్లింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన 28 ఏళ్ల రీ..రియో విశ్వక్రీడల్లో ఇదే విభాగంలో రజత పతకం నెగ్గాడు. అయితే టోక్యో గేమ్స్‌లో నిర్ణీత బరువుకంటే 50 గ్రాములు అదనంగా ఉండడంతో అనర్హతకు గురయ్యాడు. 'నీ బాధను అర్థం చేసుకోగలను. నాదేమో 50 గ్రాముల బాధ. నీ చుట్టూ ఉన్నవారు ఏమనుకుంటున్నారో అని ఆందోళన చెందవద్దు. జీవితం సాగుతూనే ఉంటుంది. ఎదురు దెబ్బలను తట్టుకొని లేచి నిలవడం ఎంతో గొప్పగా ఉంటుంది. తగిన విశ్రాంతి తీసుకో' అని వినేశ్‌కు హిగూచీ సూచించాడు.

10 గంటలు 4.6 కిలోలు

'ఆపరేషన్ వెయిట్ లాస్'

పతక పోరుకు ముందు బరువు తగ్గిన అమన్



పారిస్: కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉండడంతో వినేశ్ ఫొగట్ పతకం కోల్పోయింది. దాంతో ఆమెతోపాటు యావత్ దేశం తీవ్ర ఆవేదనలో కూరుకుపోయింది. ఈనేపథ్యంలో మరో భారత రెజ్లర్‌కు అలాంటి దుస్థితి ఎదురుకాకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈక్రమంలో అమన్ సెహ్రావత్ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించింది. పురుషుల 57 కిలోల విభాగంలో రీ హిగుచీ (జపాన్)తో సెమీఫైనల్లో అమన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన ఈ బౌట్ అనంతరం సాయంత్రం 6.30 సమయానికి సెహ్రావత్ 61 కిలోల 5 గ్రాముల బరువున్నాడు. దాంతో శుక్రవారం జరిగే కాంస్య పతక పోరు సమయానికి.. అమన్ 10 గంటల్లో 4 కిలోల 5 గ్రాముల బరువు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే..ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా కోచ్‌లు జగ్‌మందర్ సింగ్, వీరేందర్ దహియా 'ఆపరేషన్ వెయిట్ లాస్' మిషన్ చేపట్టారు. అది ఫలించి రెండోరోజు బరువు తూచే సమయానికి సెహ్రావత్ ఏకంగా 4.6 కిలోలు తగ్గి 56.9 కిలోలకు చేరడంతో మొత్తం భారత బృందం ఊపిరి పీల్చుకుంది. ఇక..బరువు తగ్గేందుకు అమన్ ఎలా శ్రమించాడంటే.. కోచ్‌ల సూచన మేరకు తొలుత గంటన్నరపాటు మ్యాట్‌పై కసరత్తులు చేశాడు. ప్రత్యర్థితో తలపడేటప్పుడు తీసుకొనే పొజిషన్లను ఇందులో ప్రాక్టీస్ చేశాడు. తర్వాత గంట పాటు వేడినీటితో స్నానం చేశాడు. అనంతరం జిమ్‌లో 60 నిమిషాలు నిరంతరాయంగా ట్రెడ్‌మిల్ చేశాడు. ఆపై 30 నిమిషాలు అమన్‌కు కోచ్‌లు విశ్రాంతి ఇచ్చారు. తర్వాత..సెషన్‌కు ఐదు నిమిషాల చొప్పున ఐదు సెషన్లపాటు ఆవిరి స్నానం చేయించారు. చివరి ఆవిరి సెషన్ తర్వాత అమన్ బరువు తూస్తే 900 గ్రాములు ఎక్కువగా ఉన్నాడు. దాంతో అతడికి మసాజ్ చేయడంతోపాటు తేలికపాటి జాగింగ్ చేయించారు. అనంతరం సెషన్‌కు 15 నిమిషాల చొప్పున ఐదు సెషన్లు రన్నింగ్ చేయించారు. ఉదయం 4.30కల్లా సెహ్రావత్ బరువు 56.9 కిలోలకు దిగొచ్చింది. అంటే నిర్దేశిత 57 కిలోలకంటే 100 గ్రాములు తక్కువన్నమాట. అప్పటికి కానీ భారత బృందం స్థిమితపడలేదు. ఇన్ని కసరత్తుల నడుమ సెహ్రావత్‌కు గోరు వెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి ఇచ్చారు. అలాగే కొద్దిగా కాఫీ తాగించారు. గురువారం రాత్రంతా అతడు నిద్రపోలేదు. 'అతడి బరువును ప్రతి గంటకూ పరిశీలించాం. ఆ రాత్రేకాదు శుక్రవారం ఉదయం కూడా అమన్ నిద్రపోలేదు' అని కోచ్ దహియా వెల్లడించాడు. 'బరువు తగ్గించడం సాధారణంగా జరిగే ప్రక్రియ. మాకిది అలవాటే. కానీ వినేశ్ ఘటన నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాం' అని దహియా తెలిపాడు. మొత్తంగా తాను, కోచ్‌లు పడిన కష్టాన్ని ప్రతిఫలిస్తూ అమన్ కాంస్య పతకంతో అదరగొట్టాడు.

అయ్యో.. రీతిక

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల ప్రదర్శన ముగిసింది. పది పతకాల లక్ష్యంతో బరిలోకి దిగినా..ఆఖరుకు ఆరింటితోనే సరిపెట్టుకుంది. చివరి రోజు పోటీల్లో పతక ఆశలతో బరిలోకి దిగిన రెజ్లర్ రీతిక హుడా మహిళల 76కేజీ ఫ్రీస్టయిల్ క్వార్టర్స్‌లో ఓడింది. అయితే ప్రీక్వార్టర్స్‌లో ప్రత్యర్థిపై 12-2 తేడాతో నెగ్గిన ఆమె భారత్ నుంచి ఈ విభాగంలో క్వార్టర్స్‌లో ప్రవేశించిన తొలి రెజ్లర్‌గానూ అదుర్స్ అనిపించుకుంది. కానీ, కీలక బౌట్‌లో టాప్ సీడ్ ఐపెరిని ఎంతగా నిలువరించినా అదృష్టం వరించలేదు. ఇక రెపిచేజ్‌పై ఆశలు పెట్టుకున్నా.. సెమీస్‌లో ఐపెరి ఓడడంతో రీతికకు చాన్స్ దక్కలేదు. అటు గోల్ఫర్లు కూడా ఏమాత్రం ప్రభావం చూపలేదు.

పారిస్‌లో ముగిసిన భారత క్రీడాకారుల పోరు



క్వార్టర్స్‌లో పోరాడి ఓడిన రెజ్లర్



గట్టి పోటీతో..

పారిస్: పతకంపై ఆశలు రేపిన రెజ్లర్ రీతికా హుడా క్వార్టర్ ఫైనల్స్‌లో పరాజయం పాలైంది. మహిళల 76కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో టాప్ సీడ్ ఐపెరి మెడెట్ (కిర్గిస్థాన్)తో హోరాహోరీగా సాగిన ఈ పోరులో రీతిక మెరుగైన ఆటతీరుతో స్కోరును 1-1తో సమం చేసింది. అయితే కౌంట్ బ్యాక్ నిబంధన ప్రకారం ఐపెరిని విజేతగా ప్రకటించడంతో రీతికకు నిరాశే ఎదురైంది. అయినప్పటికీ రీతిక పతకంపై ఆశలు పెట్టుకుంది. ఎందుకంటే ఐపెరి తన సెమీస్ బౌట్‌లో గెలిస్తే రీతికకు రెపిచేజ్ రౌండ్‌లో ఆడే అవకాశం దక్కేది. కానీ యూఎస్ రెజ్లర్ బ్లేడ్స్ చేతిలో తను ఓడిపోవడంతో రీతిక ఎలిమినేట్ కాక తప్పలేదు. ఓవరాల్‌గా భారత అథ్లెట్లు ఐదు కాంస్యాలు, ఓ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ప్రీక్వార్టర్స్‌లో పూర్తి ఆధిపత్యం

రెజ్లర్ రీతిక మొదట ప్రీక్వార్టర్స్‌లో చెలరేగింది. హంగెరీకి చెందిన బెర్నాడెట్ నాగీపై 12-2 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీ పద్ధతిలో అద్భుత విజయం సాధించింది. తొలి రౌండ్‌లోనే ఆమె 4-0తో 'పట్టు' సాధించింది. రెండో రౌండ్‌లో నాగీ రెండు పాయింట్లు నెగ్గినా.. రీతిక పదేపదే తనను టేక్‌డౌన్ చేయడంతో 12-2తో తిరుగులేని ఆధిక్యం అందుకుంది. దీంతో రెండోరౌండ్ 29 సెకన్లలో ముగుస్తుందనగా రెఫరీ బౌట్‌ను నిలిపేశాడు. రెజ్లింగ్‌లో ఇద్దరి మధ్య పది పాయింట్ల తేడా ఉంటే వెంటనే బౌట్‌ను ఆపేసి టెక్నికల్ సుపీరియారిటీ ప్రకారం ఆధిక్యంలో ఉన్న అథ్లెట్‌ను విజేతగా ప్రకటిస్తారు. దీంతో భారత్ నుంచి 76 కిలోల విభాగంలో తొలిసారి క్వార్టర్స్ చేరిన రెజ్లర్‌గా రీతిక నిలిచింది.

ప్రీక్వార్టర్స్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో రీతిక క్వార్టర్స్ బరిలో నిలిచింది. అటు వరల్డ్ నెంబర్‌వన్ ఐపెరి మెడెట్ ప్రత్యర్థి కావడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. కానీ 22 ఏళ్ల రీతిక మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోకుండా నువ్వా.. నేనా? అనే రీతిలో గట్టి పోటీనే ఇచ్చింది. పాయింట్లు కోల్పోకూడదనే పట్టుదల కనిపించడంతో ఎక్కువగా ఇద్దరూ డిఫెన్సివ్ ఆటకే పరిమితమయ్యారు. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించిన ఐపెరి కూడా రీతికపై పైచేయి సాధించలేకపోయింది. తొలి రౌండ్‌లో రీతిక పాయింట్ సాధించగా.. రెండో రౌండ్ ఐపెరి స్కోరును సమం చేసింది. అయితే రీతిక ఎక్కువగా డిఫెన్స్‌కే పరిమితమై ఎటాకింగ్‌కు దిగలేకపోయింది. అటు మరో పాయింట్ కోల్పోకుండా ఐపెరి తన అనుభవంతో రీతికను హెడ్ లాక్ పొజిషన్‌తో అడ్డుకుని ఫలితం సాధించింది.

స్కోరు సమమైనా ఎందుకలా?

క్వార్టర్స్ పోరు 1-1తో సమమైనా రీతిక ఓటమి చెందడం అభిమానులకు ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం ఇద్దరు రెజ్లర్లు సమాన పాయింట్లు సాధిస్తే కౌంట్ బ్యాక్‌ను అమలు చేస్తారు. అంటే.. ఈ ఇద్దరిలో చివరి పాయింట్ ఎవరు సాధిస్తే వారే విజేతగా నిలుస్తారు. ఈ బౌట్‌లో రీతిక మొదట పాయింట్ సాధించగా.. ఆ తర్వాత ఐపెరి స్కోరును సమం చేసింది. ఈ కారణంగా భారత రెజ్లర్‌కు ఓటమి తప్పలేదు. ఈ రూల్ తెలుసు కాబట్టే ఐపెరి వ్యూహాత్మకంగా ఆడి రీతికను అడ్డుకోగలిగింది.



అదితి

గోల్ఫ్‌లో నిరాశ

మహిళల వ్యక్తిగత గోల్ఫ్ ఫైనల్లో భారత్ పోరు ముగిసింది. ఆఖరిదైన నాలుగో రౌండ్‌లో అదితి అశోక్ 29వ స్థానంలో నిలవగా.. మరో గోల్ఫర్ దీక్ష దాగర్ 49వ స్థానంతో నిరాశపరిచారు.

దేశం	స్వ	ర	కా	మొ
చైనా	37	27	24	88
అమెరికా	35	41	41	117
ఆస్ట్రేలియా	18	18	14	50
జపాన్	16	12	13	41
ఫ్రాన్స్	15	22	22	59
బ్రిటన్	14	20	25	59
కొరియా	13	8	8	29
నెదర్లాండ్స్	13	6	11	30
జర్మనీ	12	10	8	30
ఇటలీ	11	13	15	39
భారత్	0	1	5	6

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

పతక వీరులకు అపూర్వ స్వాగతం

స్వదేశం చేరిన హాకీ జట్టు

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకంతో అదరగొట్టిన భారత హాకీ జట్టుకు స్వదేశంలో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. శనివారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొన్న హర్మన్‌ప్రీత్ సింగ్ సేనపై పూలవర్షం కురిపించిన ఫ్యాన్స్.. డప్పులు మోగిస్తూ, డ్యాన్సులు చేస్తూ ఘనస్వాగతం పలికారు. కాంస్య పతక పోరులో భారత్ 2-1తో స్పెయిన్ ఓడించింది. టోక్యో క్రీడల్లో కూడా టీమిండియా కంచు మోత మోగించింది. అయితే, కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్ కీపర్ శ్రీజేష్.. షూటర్ మను భాకర్‌తో కలసి ముగింపోత్సవంలో పతాకధారిగా వ్యవహరించనున్నాడు. అమిత్ రోహిదాస్, రాజ్‌కుమార్ పాల్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, సంజయ్ కూడా శ్రీజేష్‌తో పాటు ఉండిపోయారు. వీరు కార్యక్రమం ముగిసిన తర్వాత మిగతా భారత అథ్లెట్లతో కలసి స్వదేశానికి చేరుకోనున్నారు. అపూర్వ స్వాగతం ఎంతో ఆనందం కలిగించిందని హర్మన్‌ప్రీత్ చెప్పాడు. భారత హాకీ మళ్లీ గాడినపడిందనే భావన ప్రజల్లో కలిగిందన్నాడు.



అఫ్ఘాన్ అథ్లెట్‌పై అనర్హత



తమ దేశంలో మహిళల దుర్భర పరిస్థితిని విశ్వ క్రీడా వేదికపై ఎలుగెత్తి చాటిన అఫ్ఘాన్ బ్రేక్ డ్యాన్సర్ మనీజా తలాష్‌పై అనర్హత వేటు పడింది. శుక్రవారం జరిగిన బ్రేకింగ్ ఈవెంట్ ప్రీ క్వాలిఫయర్ ఈవెంట్‌లో ఆమె నెదర్లాండ్స్ డ్యాన్సర్ ఇండియా సర్దో చేతిలో ఓడింది. ఆ తర్వాత 'అఫ్ఘాన్ మహిళలకు స్వేచ్ఛ కల్పించాలి' అనే స్లోగన్‌తో కూడిన బ్యానర్‌ను ధరించి కలకలం రేపింది. అయితే ఒలింపిక్ రూల్స్ ప్రకారం క్రీడల్లో రాజకీయ, మతపరమైన నినాదాలను ప్రదర్శించకూడదు. దీంతో క్రమశిక్షణ చర్య కింద తలాష్‌ను డిస్‌క్వాలిఫై చేసినట్టు ప్రపంచ డ్యాన్స్ స్పోర్ట్స్ సమాఖ్య ప్రకటించింది.

కొవిడ్‌తోనే కొట్టేశారు!



లైల్స్

టోక్యో ఒలింపిక్స్‌కు పారిస్ గేమ్స్‌కు ఎంత భేదమో! ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా కారణంగా టోక్యో క్రీడలు ఏడాదిపాటు వాయిదా పడ్డాయి. 2021లో ఆ క్రీడలను అత్యంత కఠినమైన ఆంక్షల నడుమ నిర్వహించారు. ఏ పోటీకి ఫ్యాన్స్‌ను అనుమతించలేదు. ఇకపోతే.. పారిస్‌లోనూ కొవిడ్ కేసులు బయటపడకపోలేదు. కాకపోతే ఆ వ్యాధి ఓ సాధారణ ఫ్లూ స్థాయికి మారడంతో అంతా లైట్‌గా తీసుకున్నారు. అమెరికా స్ప్రింట్ స్టార్ నోవా లైల్స్ కరోనాతోనే 200 మీ. పరుగులో తలపడి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఇంకా.. క్రీడా గ్రామంలో పలు కొవిడ్ కేసులు వెలుగు చూశాయి. కానీ నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలనే సూచన చేశారు తప్పితే ఆంక్షలేమీ విధించలేదు. కాగా..క్రీడా గ్రామంలో 40 మంది అథ్లెట్లకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. స్విమ్మింగ్‌లో రజత పతకం సాధించిన బ్రిటన్ స్టార్ ఆడమ్ పెటీకి కూడా గతవారం కొవిడ్ సోకింది. తమ మహిళా వాటర్ పోలో జట్టులో ఐదుగురు కొవిడ్ బారిన పడ్డారని ఆస్ట్రేలియా ప్రతినిధులు తెలిపారు. అయినా తమ జట్టు ప్రాక్టీస్‌కు అనుమతి లభించిందన్నారు. 'టోక్యోలో కొవిడ్‌ను తీవ్రమైనదిగా భావించాం. కానీ ఇప్పుడు అది సాధారణ ఫ్లూ స్థాయికి మారింది. అందువల్ల ఈసారి ఆ వ్యాధికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక సూచనలు చేయలేదు' అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ చీఫ్ థామస్ బాచ్ చెప్పారు.



ఆడమ్ పెటీ



ఇమానె.. పసిడి సాధించె

తాజా ఒలింపిక్స్‌లో అల్జీరియా మహిళా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగ నిర్ధారణపై వచ్చిన విమర్శలు అన్నీఇన్నీ కావు. అసలు ఆమె మహిళే కాదని.. ఓ మగాడిని మహిళల పోటీల్లో ఎలా అనుమతించారంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీపైనా నెట్టింట తీవ్రంగా దాడులు చేశారు. కానీ ఇమానె మాత్రం తన దృష్టంతా లక్ష్యంపైనే ఉంచి ఏకంగా స్వర్ణ పతకమే అందుకుంది. శనివారం మహిళల వెల్టర్‌వెయిట్ 66కేజీల ఫైనల్‌లో తను యాంగ్ లియు (చైనా)ను 5-0తో ఓడించి చాంపియన్‌గా అవతరించింది. అంతేకాదు.. ఇన్నాళ్లు తనలో గూడు కట్టుకున్న ఆవేదనను కూడా వెళ్లగక్కుతూ తాను మహిళనేనంటూ ఎలుగెత్తి చాటింది. 'నేనూ అందరిలాంటి మహిళనే. అలాగే పుట్టా.. అలాగే పెరిగా. అన్ని అర్హతలను దాటుకునే ఇక్కడిదాకా వచ్చా. ఇప్పుడు నా 8 ఏళ్ల కల నెరవేరి విజేతగా నిలిచా. భవిష్యత్‌లో ఇలాంటి విమర్శలు ఎదురుకావనే ఆశిస్తున్నా' అని ఇమానె వ్యాఖ్యానించింది.



అలా సెలెబ్రేట్ చేసుకొని..

అలీషా న్యూమన్.. కెనడాకు చెందిన ఈ పోల్‌వాల్ట్ భామ పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కొల్లగొట్టింది. అయితే, ఈ 30 ఏళ్ల సుందరి.. పతకం గెలవడం కన్నా, విజయాన్ని సెలెబ్రేట్ చేసుకున్న తీరుతో పాపులర్ అయింది. మూడోస్థానంలో నిలిచి పతకం ఖాయం చేసుకున్న వెంటనే అలీషా.. ఆనందంలో ట్వెర్కింగ్ (మోకాళ్లపై వంగి నడుమును కదిలించడం) స్టయిల్లో సెలెబ్రేట్ చేసుకుంటూ ఫొటోకు పోజిచ్చింది. అసలే అందగత్తె.. అందులోనూ మత్తెక్కించే విధంగా పోజివ్వడంతో ఈ ఫొటో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సాధారణంగా బియాన్స్ నోల్స్, రిహన్నా, షకీరాలాంటి అంతర్జాతీయ పాప్ తారలు మ్యూజిక్ షోస్ చేసేటప్పుడు స్టేజ్‌పై ట్వెర్కింగ్ భంగిమలను ఇస్తుంటారు.

యమిసి.. పసిడి గెలిచి..



యమిసి ఓగన్‌లియే

పారిస్: జర్మనీ అథ్లెట్ యమిసి ఓగన్‌లియే మహిళల షాట్‌పుట్ స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఆఖరి త్రోలో ఆమె ఇనుప గుండును 20 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచింది. 19.86 మీ. దూరంతో మాడిసన్ లి వెస్సే (న్యూజిలాండ్), 19.32 మీ. దూరం విసిరి యవాన్ (చైనా) రజతకాంస్యాలు సొంతం చేసుకొన్నారు. 1996లో ఆస్ట్రిడ్ కుంబర్‌నస్ తర్వాత ఈ విభాగంలో జర్మనీకి పతకం లభించడం.. గత 28 ఏళ్లలో ఇదే తొలిసారి.

వరల్డ్ రికార్డ్ హోల్డర్‌ను ఓడించి: పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ స్వర్ణాన్ని రాయ్ బెంజ్‌మెన్ (అమెరికా) గెలుచుకొన్నాడు. ఫైనల్లో బెంజ్‌మెన్ 46.46 సెకన్ల టైమింగ్‌తో.. వరల్డ్ రికార్డు సాధించిన కాస్టెన్ వార్‌హోం (నెదర్లాండ్స్)ను వెనక్కినెట్టి పసిడి పట్టేశాడు. డూస్ శాంటోస్ (బ్రెజిల్) కాంస్యం దక్కించుకొన్నాడు.

ఇథోపియా రన్నర్ తమిరత్ టోలా పురుషుల మారథాన్ స్వర్ణాన్ని ఎగరేసుకుపోయాడు. 2 గంటల 6 నిమిషాల 26 సెకన్ల టైమింగ్‌తో అతడు రేస్‌ను పూర్తి చేశాడు. బషీర్ అబ్ది (బెల్జియం) రజతం, బెన్సన్ కిప్రుటో (కెన్యా) కాంస్యం నెగ్గారు.

బీచ్ వాలీబాల్ విజేత బ్రెజిల్: మహిళల బీచ్ వాలీబాల్‌లో బ్రెజిల్ 2-1తో కెనడాను ఓడించి పసిడి నెగ్గింది.

'ఆరే'సిన లాంగ్



ఒలింపిక్స్‌లో అత్యధికంగా ఆరు స్వర్ణాలు సాధించిన చైనా అథ్లెట్‌గా టేబుల్ టెన్నిస్ ప్లేయర్ మ లాంగ్ రికార్డు సృష్టించాడు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో చైనా 3-0తో స్వీడన్‌పై గెలిచింది. ఈ జట్టులో లాంగ్ సభ్యుడు. 2012 నుంచి అతడు ఒలింపిక్స్‌లో స్వర్ణాలు సాధిస్తూనే ఉన్నాడు. మహిళల టీటీ టీమ్‌లో స్వర్ణం చైనా సొంతమైంది.

ఫ్రాన్స్‌కు టైటిల్: పురుషుల బాస్కెట్‌బాల్ స్వర్ణాన్ని ఫ్రాన్స్ గెల్చుకుంది. ఫైనల్లో ఫ్రాన్స్ 3-0తో పోలెండ్‌పై గెలిచింది. కాంస్య పోరులో అమెరికా 3-0తో ఇటలీపై గెలిచింది.

హాకీ విజేత నెదర్లాండ్స్: పురుషుల టైటిల్ నెగ్గిన నెదర్లాండ్స్ మహిళల హాకీ స్వర్ణాన్ని కూడా సొంతం చేసుకొంది. ఫైనల్లో నెదర్లాండ్స్ 1-1 (3-1)తో చైనాపై గెలిచింది. అర్జెంటీనా కాంస్యం అందుకుంది.

జోర్డాన్‌కు ట్రిపుల్ జంప్ స్వర్ణం: డిఫెండింగ్ చాంప్ పెద్ర పిచార్డో (పోలెండ్)ను ఓడించిన స్పెయిన్ అథ్లెట్ జోర్డాన్ డియాజ్ ట్రిపుల్ జంప్ స్వర్ణాన్ని కైవసం చేసుకొన్నాడు.

బ్రెజిల్‌కు నిరాశ: మహిళల ఫుట్‌బాల్‌లో బ్రెజిల్‌కు షాకిచ్చిన అమెరికా బంగారు పతకాన్ని కైవసం చేసుకొంది. ఫైనల్లో అమెరికా 1-0తో బ్రెజిల్‌పై గెలిచింది. జర్మనీకి కాంస్యం దక్కింది.

చెబెట్‌కు డబుల్



కెన్యా అథ్లెట్ బీట్రైస్ చెబెట్ పారిస్‌లో అరుదైన డబుల్ సాధించింది. మహిళల 10 వేల మీటర్ల రేస్‌లో చెబెట్ 30 నిమిషాల 43.25 సెకన్ల టైమింగ్‌తో టాప్ నిలిచింది. 5 వేల మీటర్ల ఈవెంట్‌లో కూడా చెబెట్ పసిడి సొంతం చేసుకొంది. నాడియా బటోసెలెట్టి (ఇటలీ) రజతం, సిఫాన్ హసన్ (నెదర్లాండ్స్) కాంస్యం దక్కించుకొన్నారు.

మోగిన ఏసీఏ ఎన్నికల నగారా

● నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఎన్నికల నగారా మోగింది. ఏసీఏ ఎన్నికల అధికారిగా ఏపీ మాజీ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ నియమితులయ్యారు. మధ్యంతర ఎన్నికలు కావడంతో మిగిలున్న మరో ఏడాది కాలానికి ఎన్నికల ప్రక్రియ చేపడతున్నట్టు రమేష్ తెలిపారు. ఈనెల 16న నామినేషన్ల దాఖలు, 17న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ తర్వాత 20న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. కార్యవర్గ పదవులకు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే ఎనిమిదో తేదీన ఎన్నికల నిర్వహణ, అదేరోజు ఫలితాలు ప్రకటిస్తారు.

త్వరలో కిడాంబి శ్రీకాంత్ వివాహం!



హైదరాబాద్: స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ త్వరలో ఓ ఇంటివాడు కానున్నాడు. ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ మేనకోడలు శ్రావ్య వర్మ-శ్రీకాంత్ కొంతకాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ శనివారం వెల్లడించాడు. త్వరలో తాము అంతులేని కథను రాసేందుకు సిద్ధమవుతున్నట్టు సోషల్ మీడియాలో తెలిపాడు. శ్రావ్య వర్మ టాలీవుడ్‌లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తోంది.



అలనాటి కథ

మనవాళ్లకు దక్కని గౌరవం

శేషేంద్రతో కలిసి నేను అనేక సాహితీ సమావేశాలకు వెళుతుండే దాన్ని. ఇలాంటి సమావేశాలకు విదేశీ రచయితలు వస్తే... సాధారణంగా అందరి దృష్టి వారిపైనే ఉండేది. మన దేశానికి చెందిన రచయితలకు ఒకింత తక్కువ గౌరవమే లభించేది. విదేశాలలో జరిగిన సమావేశాల్లో ఈ తరహా సమస్యలు ఎదురయ్యేవికావు. మన దేశంలో నా ఈ అనుభవాలు... అనేక మందికి కూడా ఎదురయి ఉండవచ్చు.



మన దేశంలో ఇటీవల కాలంలో అతి ఎక్కువ మంది రచయితలు పాల్గొనే సాహితీ సమావేశం... 'జైపూర్ లిటరరీ ఫెస్టివల్'. దీనికి దేశవిదేశాల నుంచి రచయితలు వస్తూ ఉంటారు. దీనిని ప్రారంభించక ముందు... అంటే 1980ల్లో భోపాల్‌లో ఈ తరహా ప్రయత్నమే జరిగింది. దీనికి నిర్వాహకుడు ప్రముఖ రచయిత అశోక్ బాజ్‌పేయ్. ఆ సమావేశానికి అనేకమంది రచయితలతో పాటు శేషేంద్రను కూడా ఆహ్వానించారు. అక్కడకు వెళ్లిన దగ్గర నుంచి రకరకాలైన ఇబ్బందులు ఎదురయ్యాయి. మొదటగా మాకు కనీస వసతులు లేని ఒక రూమ్ కేటాయించారు. మా సమస్యను అశోక్ దృష్టికి తీసుకువచ్చాము. కానీ ప్రయోజనం లేకపోయింది. దీంతో మాకు కోపం వచ్చి, అక్కడ వేరే హోటల్‌కు వెళ్లాం. మా దురదృష్టమేమిటంటే అక్కడ కూడా రూమ్‌లు లేవు. తప్పని సరి పరిస్థితుల్లో అక్కడి మేనేజర్ రూమ్ పక్కనే ఉన్న చిన్న గదిలో ఆ రోజు రాత్రి సర్దుకోవాల్సి వచ్చింది.

ఆ మర్నాడు సమావేశం ప్రారంభమయింది. భారతీయ రచయితలకు సంబంధించిన కొన్ని సెషన్స్ ఉన్నా... వాటికి వెళ్లేవారు అతి కొద్ది మందే కనిపించారు. విదేశీ రచయితల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. ఆ రోజు రాత్రి అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అర్జున్‌సింగ్... రచయితలందరికీ ఒక విందు ఏర్పాటు చేశారు. ఆ విందుకు నేను, శేషేంద్ర కూడా వెళ్లాం. వెళ్లిన వెంటనే అక్కడ అర్జున్‌సింగ్ కనిపించారు. ఆయన పక్కనే ఉన్న ఒక నిర్వాహకుడు... 'ఈమె ఇందిరా ధన్‌రాజ్‌గిర్. ఆయన శేషేంద్ర" అని పరిచయం చేశాడు. అర్జున్‌సింగ్ వెంటనే... "హిందూ బెనారస్ యూనివర్సిటీలో నేను చదువుకున్నప్పుడు... ధన్‌రాజ్‌గిర్ హాస్టల్‌లోనే ఉండేవాడిని" అన్నారు. ఇలా కొంత సంభాషణ సాగింది. అర్జున్ సింగ్‌తో సంభాషణ తర్వాత అక్కడున్న నిర్వాహకులకు మాపై గౌరవం పెరిగినట్లు అనిపించింది. మమ్మల్ని విదేశీ ప్రతినిధులు కూర్చునే టేబుల్ దగ్గర కూర్చోబెట్టారు. నా పక్కనే ప్రముఖ ఆంగ్ల రచయిత సర్ స్పెన్సర్ భార్య కూర్చుంది. కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. ఈ లోపు అర్జున్‌సింగ్ రచయితల టేబుల్స్ దగ్గరకు వచ్చి పలకరించటం మొదలుపెట్టారు. అర్జున్ సింగ్‌తో పాటు ఆయన సిబ్బంది... వారితో కెమెరామెన్... ఇలా ఒక గుంపులా కదలటం మొదలుపెట్టారు. భారతీయ రచయితలందరూ ఆయనకు లేచి వినయంతో నమస్కారాలు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం నాకు చాలా ఇబ్బంది కలిగించింది. ఆ మర్నాడు ఉదయం... భారతీయ భాషలకు సంబంధించిన సెషన్స్ ఉన్నాయి. సమావేశ మందిరానికి వెళ్లిన వెంటనే అక్కడ మాకు ప్రముఖ కన్నడ రచయిత గోపాలకృష్ణ అడిగ కనిపించారు. మమ్మల్ని చూసిన వెంటనే ఆయన మా దగ్గరకు వచ్చి... "ఈ రోజు ఉదయం నన్ను ప్రధాని సన్మానిస్తారని చెప్పారు. దాంతో ఉదయాన్నే లేచి వచ్చేశా. అప్పటి నుంచి ఇప్పటిదాకా నాకు కాఫీ ఇచ్చేవారు కూడా లేరు. భారతీయ రచయితగా పుట్టడం కన్నా ఇంగ్లీషు రచయితగా పుడితే ఎక్కువ గౌరవం లభిస్తుందనిపిస్తోంది" అని నిరాశగా అన్నారు. ఆ మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి.

భారతీయ భాషల్లో అద్భుతమైన సాహిత్యం ఉంది. గొప్ప సాహితీ కారులున్నారు. వీరిలో చాలామందికి ఇతర దేశాల్లో తగినంత పేరు రాలేదు. కారణం... వీరి రచనలు ఇంగ్లీషులోకి అనువాదం కాకపోవటమే. చాలా సందర్భాలలో ఇంగ్లీషు అనువాదాల ద్వారా పేరు వచ్చిన తర్వాతే మన రచయితలకు తగినంత గుర్తింపు లభిస్తోంది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఆదివారం

ఆయన రచయితగా సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆర్టిస్టుగా మారి, ఎన్నో విభిన్న పాత్రలు పోషించారు. మధ్యలో దర్శకుడు కూడా అయ్యారు. సరస్వతీ కటాక్షం పుష్కలంగా ఉన్న ఆ అదృష్టవంతుడి పేరు.. తనికెళ్ల భరణి. ఆయనకు ఇప్పుడు గౌరవ డాక్టరేట్ లభించడంతో నలభై ఏళ్ల సినీ జీవితానికి సార్థకత చేకూరినట్లయింది. ఈ నేపథ్యంలో తనికెళ్ల భరణితో 'నవ్య' ముచ్చట్లు.



అక్షరమే నాకు అన్నం పెట్టింది

ఏ కళాకారుడికైనా ఇటువంటి పురస్కారాలు టానిక్‌లా పనిచేస్తూ ఉత్సాహాన్ని ఇస్తుంటాయి. అయితే డాక్టరేట్ కానీ, లోకనాయక సాహిత్య పురస్కారం కానీ నేను ఊహించనవి. సాహిత్య సేవ అనే పదానికి నేను వ్యతిరేకిని. ఎందుకంటే సాహిత్యానికి కానీ, కళకు కానీ నేనేమీ సేవ చేయలేదు. నాకు అన్నం పెట్టింది అక్షరమే! సాహిత్యాన్ని నమ్ముకుని రచయితగా కొనసాగుతున్నా. దాని ప్రభావమే ఈ డాక్టరేట్ అని నమ్ముతున్నా. అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

మీ కెరీర్‌లో 'ఆట కదరా శివా' అనిపించిన సందర్భాలున్నాయా?

సినిమాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏదన్నా ఉద్యోగం చేసుకుంటూ నాటకాలు ఆడితే చాలనుకున్నా. నా నాటకం చూసి ఓ నిర్మాత రచయితగా అవకాశం ఇవ్వడం ఒక ఆట. సినిమా వాతావరణం నచ్చక నేను వెనక్కి తిరిగి వచ్చేసి మళ్లీ ఉద్యోగం చేసుకోవడం మరో ఆట. నేను తొలిసారిగా రచన చేసిన 'కంచు కవచం' చిత్రంలో డైలాగులు బాగున్నాయని ఓ నిర్మాత భావించి మళ్లీ నన్ను పిలిపించడం ఇంకో ఆట. ఆ సినిమా అయ్యాక ఇక్కడ హిపోక్రసీ ఎక్కువ అని భావించి మళ్లీ వెనక్కి వచ్చేశాను. ఇదో ఇంకో ఆట. ఆ తర్వాత 'లేడీస్ టైలర్' సినిమాకు అవకాశం రావడం, నాకు పేరు రావడంతో ఇక మళ్లీ వెనక్కి తిరిగివచ్చే అవకాశం కలగలేదు. ఇదంతా నేను డిజైన్ చేసింది కాదు. అందుకే అంటుంటాను.. 'ఆట కదరా శివా' అని. ఊహించని అద్భుతం జరిగిందని అనుకోండి. అదీ ఆటే అనుకుంటాను. మా నాన్నగారు మరణించిన కొన్ని రోజులకు ఈవీవీ సత్యనారాయణగారి షూటింగ్‌కు వెళ్లాను. ఆయన నా దగ్గరకు వచ్చి భుజం మీద చెయ్యి వేసి 'ఆట కదరా శివా' అన్నారు. దానిలో ఎంత అర్థం ఉందో మీరే ఊహించండి. నా దృష్టిలో 'ఆట కదరా శివా' అనేది ఒక మాట కాదు.. జీవన మంత్రం.

నలభై ఏళ్ల కెరీర్.. ఎనిమిది వందల చిత్రాలు.. అందులో మూడొందలకు పైగా తండ్రి పాత్రలు.. మీకు రొటీన్‌గా అనిపించలేదా?

దర్శకుడు తేజ తీసిన 'చిత్రం'తో తండ్రి పాత్రలు మొదలయ్యాయి. వంద సినిమాల వరకూ తండ్రి పాత్రలు పరవాలేదనిపించాయి. ఆ తర్వాత కూడా ఆ తరహా పాత్రలే వస్తుండడంతో తండ్రి పాత్రలకే ఫిక్స్ చేసేస్తారేమోనని భయపడి ఇక నేను చెయ్యనయ్యా.. అని చెప్పడం ప్రారంభించాను. అలా ఈ ఏడాది పదకొండు మంది దర్శకులకు చెప్పేశా. వీళ్లలో తమిళ దర్శకుడు మణిరత్నంగారు కూడా ఉన్నారు. ఈ నెల 15న విడుదలవుతున్న 'మిస్టర్ బచ్చన్'లో మాత్రం రవితేజకు తండ్రిగా నటించా. అది రెగ్యులర్‌కు భిన్నమైన రోల్.

మీకు సినిమాలు తగ్గడానికి ఇది కూడా ఒక కారణమా?

అవును. మంచి పాత్రలు, డిఫరెంట్ క్యారెక్టర్లు వస్తే మాత్రమే చేద్దామని నిర్ణయించుకున్నాను. మా ఇంట్లో పెద్ద లైబ్రరీ ఉంది. పుస్తకాలు చదవడం నాకు వ్యసనం. వంట కూడా వచ్చు. సరదాగా అప్పుడప్పుడు వంట కూడా చేస్తుంటాను.

నటన తగ్గించుకొని సినిమాలకు రచన చేసే అవకాశం ఉందా?

నేను రచయితగా 52 చిత్రాలకు రాశాను. రచయితగా ఏమీ సంపాదించుకోలేదు. 'శివ'లో వేషం వెయ్యగానే 'ఇక మీరు పెన్ను మూసుకోవచ్చు' అని రాంగోపాల్ వర్మ చెప్పాడు. 'యమలీల'లో తోట రాముడు పాత్ర బాగా క్లిక్ అయింది. ఆ సినిమా తర్వాత ఒకే ఏడాదిలో 26 సినిమాల్లో నటించా. అప్పట్లో లేదు కానీ ఇప్పుడు రచయితలకు మంచి పారితోషికాలు ఇస్తున్నారు. పెద్ద సినిమాలకు రచన చేసే అవకాశం వస్తే నటుడిగా నాలుగైదు చిత్రాలు వదిలేసైనా రాస్తా. ఇప్పుడు దర్శకులే రచన కూడా చేస్తున్నారు కనుక అది జరగదని అనుకుంటున్నాను. 'కథ బ్రహ్మాండంగా ఉంది, మాటలు రాయడంవల్ల నాకు, ఆ సినిమాకూ ఉపయోగం' అనిపిస్తే తప్పకుండా రాస్తా.

> **"రంగస్థలం మీద ఒక ప్రయోగం చేయబోతున్నా. అంతకు ముందు ఎప్పుడో రాసిన 'గాలి.. హోరు.. మైదానం' నాటకంలో కొన్ని మార్పులు చేసి 'పంజరంలో ఎలుక' గా పేరు మార్చి ప్రదర్శించబోతున్నా. ఈ ఏడాది సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాను కనుక వచ్చే ఏడాది ఆ నాటకం ప్రదర్శిస్తా. లండన్‌లోని షేక్స్‌పియర్ గ్లోబల్ థియేటర్‌లో ఆ నాటకాన్ని ఆడాలని తెలుగు వాడిగా నా కోరిక. షేక్స్‌పియర్ స్వయంగా అక్కడ నాటకాలు వేశారు. గ్లోబల్ థియేటర్‌తో పాటు లండన్‌లో ఎక్కడెక్కడ ఆ నాటకాన్ని ప్రదర్శించవచ్చో నా మిత్రులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నెల రోజులు లండన్‌లోనే ఉండి కనీసం అర డజను ప్రదర్శనలు ఇవ్వాలని నా ఆలోచన."**

'మిథునం' తర్వాత మీరు మెగాఫోన్ పట్టకపోవడానికి కారణం?

పడుతున్నా. ఆ వార్త 'ఆంధ్రజ్యోతి'కే మొదట చెబుతున్నా. నవంబరు నుంచి 'మిథునం' తరహాలో మరో మంచి చిత్రం తీయబోతున్నా.

మణిరత్నం దర్శకత్వంలో మీరు నటిస్తున్నారని తెలిసింది..!

అవును. వాస్తవానికి 'దళపతి' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అయితే అది తండ్రి పాత్ర. నా వయసుకు మించిన పాత్ర. విగ్గు పెట్టుకుని నటిస్తానని చెప్పినా మణిరత్నంగారు ఒప్పుకోలేదు. చివరకు ఆ వేషం అమ్రిష్‌పురి వేశారు. ఇటీవల వచ్చిన 'పొన్నియన్ సెల్వం' తెలుగు వెర్షన్‌కు నాతో డైలాగులు రాయించారు మణిరత్నంగారు. ఆ సినిమాలో జయరామ్ పోషించిన పాత్రకు నాతో డబ్బింగ్ చెప్పించారు. అప్పుడే ఆయన్ని అడిగాను.. 'మీ దర్శకత్వంలో నటించే అవకాశం ఇవ్వండి. అయితే తండ్రి పాత్ర మాత్రం ఇవ్వకండి ప్లీజ్' అని. ప్రస్తుతం కమల్‌గారితో ఆయన తీస్తున్న చిత్రంలో నాకు చాలా పెద్ద వేషం ఇచ్చారు. నెగెటివ్ టచ్ ఉన్న వేషం. ఇప్పటికి 30 రోజులు వర్క్ చేశాను. ఇంకో ఐదు రోజులు చేయాలి.

• వినాయకరావు

'దిక్సూచి' వెబ్ పేజీలో సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jkW93tpలో చదవండి.

ఈ వారమే విడుదల — ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డాటర్స్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
వరస్ట్ ఎక్స్ ఎవర్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
ఎమిలీ ఇన్ పారిస్	వెబ్‌సిరీస్	ఆగస్టు 14
ది యూనియన్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 16
లవ్ నెక్స్ట్ డోర్	కొరియన్ సిరీస్	ఆగస్టు 17
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
డార్లింగ్	తెలుగు చిత్రం	ఆగస్టు 13
ది టైరాంట్	కొరియన్ సిరీస్	ఆగస్టు 14
అమెజాన్ ప్రైమ్		
నామ్ నమక్ నిషాన్	హిందీ చిత్రం	ఆగస్టు 14
జాక్‌పాట్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 15
కల్కి 2898 ఏ.డి.	తెలుగు చిత్రం	ఆగస్టు 15
సోనీ లివ్		
కౌన్ బనేగా క్రోర్‌పతి 16	రియాలిటీ షో	ఆగస్టు 12
చమక్	హిందీ సిరీస్	ఆగస్టు 16
జీ 5		
మనోరథంగల్	యాంథాలజీ ఫిల్మ్	ఆగస్టు 15
జియో సినిమా		
శేఖర్ హోమ్	హిందీ సిరీస్	ఆగస్టు 14
ఈటీవి విన్		
వీరాంజనేయులు విహారయాత్ర	తెలుగు చిత్రం	ఆగస్టు 14
ఆహా...		
వీర మారి ఆఫీస్ 2	వెబ్‌సిరీస్	ఆగస్టు 15

బిజినెస్

అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్‌కు వాటాలు!

మరో బాంబు పేల్చిన హిండెన్‌బర్గ్



న్యూఢిల్లీ: ఏడాదిన్నర క్రితం అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్..తాజాగా మరో బాంబు పేల్చింది. అదానీ గ్రూప్ అక్రమంగా నిధుల మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ (బెర్ముడా, మారిషస్) ఫండ్లలో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌తో పాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు రహస్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ శనివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన బ్లాగ్‌లో ఆరోపించింది. ఓ ప్రజావేగు (విజిల్ బ్లోయర్) అందించిన పత్రాల ఆధారంగా ఈ ఆరోపణలు చేసింది. బుచ్ దంపతులు ఐపీఈ ప్లస్ ఫండ్ 1లో ఖాతాను 2015 జూన్ 5న సింగపూర్‌లో తెరిచారని, ఈ ఆఫ్‌షోర్ మారిషస్ ఫండ్‌ను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ.. ఇండియా ఇన్ఫోలైన్ (ఐఐఎఫ్ఎల్) ద్వారా తెరిచారని ప్రజావేగు పత్రాలను బట్టి తెలుస్తున్నదని హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయితే, మాధవి పురి బుచ్ సెబీలో చేరకముందు విషయమిది. ఎందుకంటే, బుచ్ 2017లో సెబీలో పర్మినెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలపై సెబీ, బుచ్ స్పందించలేదు. ఐఐఎఫ్ఎల్ ప్రిన్సిపల్ సంతకం చేసిన డిక్లరేషన్ ఆఫ్ ఫండ్స్ ప్రకారం.. విదేశీ ఫండ్లలో వీరి పెట్టుబడి జీతం ద్వారా సమకూరిందని పేర్కొనగా.. దంపతుల మొత్తం ఆస్తి కోటి డాలర్లు (సుమారు రూ.84 కోట్లు)గా ఉండవచ్చని అంచనా వేసింది. సెబీ చైర్‌పర్సన్‌గా తన నియంత్రణ పరిధిలోకి వచ్చే వేలాది మ్యూచువల్ ఫండ్లు ఉండగా.. తాను, తన భర్త మాత్రం అతి తక్కువ ఆస్తులతో కూడిన, హై రిస్క్ ప్రాంతాల్లో ఏర్పాటైన, అదానీ అక్రమ నిధుల మళ్లింపు కుంభకోణంతో సంబంధాలున్న మల్టీ లేయర్డ్ విదేశీ ఫండ్లలో పెట్టుబడి పెట్టారని ప్రజావేగు పత్రాలు తెలుపుతున్నాయంది. ఈ షెల్ కంపెనీల ద్వారానే వినోద్ అదానీ నిధులను మళ్లించి అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించినట్లు హిండెన్‌బర్గ్ గతంలోనే ఆరోపించింది.

ఇంకా చర్యలు తీసుకోనేలేదు..

అదానీ అక్రమాలపై తాము నివేదిక విడుదల చేసి 18 నెలలు అవుతున్నప్పటికీ, అదానీ బహిర్గతం చేయని మారిషస్, ఇతర విదేశీ షెల్ కంపెనీలపై చర్యలు చేపట్టేందుకు సెబీ ఏమాత్రం ఆసక్తి చూపకపోవడం విస్మయం కలిగించిందని హిండెన్‌బర్గ్ తన బ్లాగ్‌లో అభిప్రాయపడింది. అదానీ ఆఫ్‌షోర్ ఫండ్లకు ఎవరు నిధులు సమకూర్చారనే విషయాన్ని సెబీ తన దర్యాప్తు పత్రాల్లో ఖాళీగా ఉంచిందన్న సుప్రీంకోర్టు ఆర్డరు కాపీని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఒకవేళ ఈ విదేశీ ఫండ్ హోల్డర్లను గుర్తించాలనుకుంటే సెబీ చైర్‌పర్సన్‌కు తన ముఖమే తొలుత ప్రతిబింబించేదని తెలిపింది. తమ చీఫ్ గుట్టు విప్పే దర్యాప్తు జరిపేందుకు సెబీ ఇష్టపడకపోవడం తమకు ఆశ్చర్యం కలిగించలేదని హిండెన్‌బర్గ్ పేర్కొంది. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతో పాటు అనుచిత పద్ధతుల్లో గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని 2023 జనవరి 24న విడుదల చేసిన నివేదికలో హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీతో పాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. హిండెన్‌బర్గ్ నివేదికతో స్టాక్ మార్కెట్‌తో పాటు కార్పొరేట్ రంగమూ భారీ కుదుపునకు లోనైంది. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతోపాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

మాధవి పురి బుచ్ గురించి



ఫైనాన్షియల్ రంగంలో తనదైన ముద్ర వేసిన మాధవి 1966లో ముంబైలో జన్మించారు. ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్న మాధవి 1989లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో చేరి తన కెరీర్ ప్రారంభించారు. ఐసీఐసీఐలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఆమె 2009లో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తొలి మహిళా ఎండీ, సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత చైనా, షాంఘైలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కన్సల్టెంట్‌గా, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్‌కు సారథ్యం వహించారు. అనంతరం 2017లో సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 మార్చిలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎవరీ ధవల్ బుచ్: ఐఐటీ ఢిల్లీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ధవల్ బుచ్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్‌తో పాటు అల్వరెజ్ అండ్ మర్సల్‌కు సీనియర్ అడ్వైజర్‌గా సేవలందిస్తున్నారు. అలాగే, గ్లిడాన్ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. గతంలో బుచ్ యూనిలీవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు.



ప్రముఖ జువెలర్ జోయాలుక్కాస్.. హైదరాబాద్, కొండాపూర్‌లోని షోరూమ్‌లో 'డైమండ్ జువెలరీ షో' ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ గ్రూప్ రీజినల్ మేనేజర్ ఆంటో థామస్, కొండాపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ అభిజిత్ సహా పలువురు కస్టమర్లు పాల్గొన్నారు.

అరబిందో ఫార్మా లాభంలో 61% వృద్ధి

క్యూ1లో రూ.919 కోట్లుగా నమోదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అన్ని మార్కెట్లలో అమ్మకాలు గణనీయంగా పెరగటంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 61.1 శాతం వృద్ధి చెంది రూ.919 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.571 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల ఆదాయం కూడా 10.5 శాతం వృద్ధితో రూ.6,851 కోట్ల నుంచి రూ.7,567 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో కంపెనీకి చెందిన అన్ని వ్యాపార విభాగాలు మంచి పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు. జూన్ త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత వృద్ధి లక్ష్యాలను అందుకోవచ్చని విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,310 ▲	64,450 ▲	88,100 ▲
ముంబై	69,663 ▲	63,811 ▲	80,263 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	450
వరంగల్	427	గోదావరి	446
చిత్తూరు	493	విశాఖపట్నం	455
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	93
కర్నూలు	80	నెల్లూరు	93
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

తెలంగాణలో అమరరాజా బ్యాటరీ ప్యాక్ ప్లాంట్ ప్రారంభం

సెల్ తయారీ ప్లాంట్‌కు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ అర్బన్: అమర రాజా గ్రూప్ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లిలో ఏర్పాటు చేస్తున్న బ్యాటరీ ప్యాక్ ప్లాంట్ ఫేజ్ 1ను శనివారం ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్ నిల్వ అవసరాలకు ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లను అసెంబ్లింగ్ చేయనుంది. ఫేజ్ 1 సామర్థ్యం 1.5 గిగావాట్లు కాగా, ప్లాంట్ పూర్తి సామర్థ్యాన్ని దశల వారీగా 5 గిగావాట్లకు విస్తరించనుంది. ఈ గిగా ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే సంస్థ బ్యాటరీ సెల్ తయారీ కోసం కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూపీ)కు శంకుస్థాపన చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికానికల్లా సెల్ తయారీ ప్లాంట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పారిశ్రామిక, ఆటోమోటివ్ బ్యాటరీల తయారీదారైన అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) పూర్తి అనుబంధ విభాగమైన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) ఈ గిగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తోంది. దివిటిపల్లిలో రూ.9,500 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ యూనిట్‌తో పాటు 16 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన లిథియం అయాన్ బ్యాటరీ సెల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయటం తమకు ఎంతో సంతోషంగా ఉందని అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈఎం) చైర్మన్, ఎండీ జయదేవ్ గల్లా అన్నారు. కాగా అమర రాజా గ్రూప్ గతంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

పియాజియోతో ఒప్పందం: అమర రాజా ఈ కార్యక్రమంలోనే పియాజియోతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కూడా కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పియాజియో వెహికిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి అమర రాజా లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ), లిథియం అయాన్ సెల్స్ అభివృద్ధి, సరఫరాతో పాటు పియాజియో త్రిచక్ర వాహనాలకు చార్జర్లు అందించనుంది. ద్విచక్ర వాహనాల కోసం బ్యాటరీ సెల్స్, బ్యాటరీ ప్యాక్‌లను అభివృద్ధి చేయనుంది. అమర రాజా ఈ మధ్యనే ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ ఏథర్‌తోనూ ఒప్పందం కుదుర్చుకుంది. అమర రాజా ఇప్పటికే పియాజియో ఇండియాకు 50,000 ఎన్ఎంసీ లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లను, ఈవీ చార్జర్లను సరఫరా చేసింది. అంతేకాదు, అమర రాజా ఇటీవలి కాలంలో గోషన్ ఇనోబ్యాట్ బ్యాటరీస్‌తోనూ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. కాగా, నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసీ) టెక్నాలజీ కోసం జియాంగ్సు హైస్టార్ బ్యాటరీ మాన్యుఫాక్చరింగ్ కంపెనీతోనూ అమర రాజా ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది.

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ ప్రోత్సాహం

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహం అందిస్తోందని జయదేవ్ అన్నారు. రాష్ట్రంలో ఈ గిగా కారిడార్ ఏర్పాటుకు గత ప్రభుత్వం తమకు కొన్ని పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఆఫర్ చేసిందని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వాటికి కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడు కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయని, ప్రస్తుతం తాము వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలిపారు.

బ్యాంక్‌లూ డిపాజిట్లు పెంచండి

- ప్రజల నుంచి నిధుల సమీకరణకు కొత్త మార్గాలను అన్వేషించండి
- కీలక కార్యకలాపాలపై దృష్టిసారించండి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: బ్యాంక్‌లు డిపాజిట్ల సమీకరణ, రుణ వితరణ వంటి కీలక కార్యకలాపాలపై దృష్టిసారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్బోధించారు. కుటుంబ పొదుపు ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాలు, సాధనాల్లోకి మళ్లుతున్న తరుణంలో ప్రజల నుంచి డిపాజిట్లను ఆకర్షించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని బ్యాంక్‌లకు సూచించారు. ఆర్‌బీఐ కేంద్రం బోర్డుతో శనివారం నిర్వహించిన సంప్రదాయక పోస్ట్ బడ్జెట్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి మీడియాతో మాట్లాడారు. "బ్యాంక్‌లు తమ కీలక వ్యాపార కార్యకలాపాలపై దృష్టిసారించాలని ఆర్‌బీఐతోపాటు కేంద్రం కోరుతున్నాయి. డిపాజిట్ల సమీకరణ, ఆ తర్వాత రుణ వితరణలో దూకుడుగా ఉండాలి" అని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు, రుణాల వృద్ధి మధ్య అంతరం పెరిగిపోయింది. రుణాల వృద్ధికి అనుగుణంగా డిపాజిట్లు పెరగడం లేదు. కాబట్టి, డిపాజిట్ల సేకరణకు ప్రాధాన్యమివ్వాలి. వడ్డీ రేట్ల నిర్వహణ విషయంలో ఆర్‌బీఐ ఇప్పటికే బ్యాంక్‌లకు కొంత స్వేచ్ఛ ఇచ్చింది. తద్వారా బ్యాంక్‌లు డిపాజిట్ రేట్లను మరింత ఆకర్షణీయంగా మార్చాలి. కొత్త ఆర్థిక సాధనాల ద్వారా నిధులు సమీకరించాలన్నారు. బ్యాంక్‌లు సోమరితనాన్ని వీడి, బల్క్ డిపాజిట్లకు బదులు చిన్న పొదుపుదారుల నుంచి డిపాజిట్లు రాబట్టడంపై దృష్టిసారించాలని సీతారామన్ సూచించారు. అది చాలా కష్టమైన పనే అయినప్పటికీ, అదే మిమ్మల్ని పోషిస్తుందన్నారు. ప్రస్తుతం రుణ వృద్ధితో పోలిస్తే డిపాజిట్ల వృద్ధి 3-4 శాతం తక్కువగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఈ అంశాన్ని ఎత్తిచూపడమే తమ ఉద్దేశమని, బ్యాంక్ యాజమాన్యాలకు ఇది ముందుచూపుతో చేసిన హెచ్చరికని ఆయన పేర్కొన్నారు. ఎందుకంటే, అంతరం పెరుగుతూ పోతే, బ్యాంకింగ్ రంగానికిది వ్యవస్థాగత సమస్యగా పరిణమించే ముప్పు ఉందన్నారు. బ్యాంక్‌లు వినూత్న ఆర్థిక పథకాలు, సేవల ద్వారా డిపాజిట్ల సమీకరణను పెంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తమ శాఖలను విస్తృతంగా వినియోగించుకోవాలని ఈ వారం ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటించిన సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సూచించారు.



విజయవాడలో సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం... వాక్‌థాన్‌లో పాల్గొన్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు, అధికారులు

నాలుగు నెలల్లో 1,730 కోట్లు కొట్టేశారు

» దేశవ్యాప్తంగా 24% పెరిగిన సైబర్ నేరాలు

» రాష్ట్రంలో సైబర్ సమన్వయ బృందం: హోం మంత్రి అనిత

» విజయవాడ పోలీస్ కమిషనరేట్ నేతృత్వంలో వాక్‌థాన్

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో దేశవ్యాప్తంగా నాలుగు నెలల్లో రూ.1730 కోట్లను దోచేశారని హోం మంత్రి అనిత తెలిపారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కోసం వాక్‌థాన్ నిర్వహించారు. స్టేడియం ఆవరణలో నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఆమె మాట్లాడారు. 'దేశంలో సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయి. నిత్యం ఉపయోగించే అనేక యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయి. యాప్‌లకు మనం ఇస్తున్న వ్యక్తిగత సమాచారం ఒక క్లిక్‌తో మోసానికి దారి తీస్తోంది. రాష్ట్రంలో సైబర్ సమన్వయ బృందం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి జిల్లాలోనూ సైబర్ సెల్ మరియు వాలంటీర్ల వ్యవస్థ' అని మంత్రి అనిత అన్నారు. విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ 'సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేయాలి. ఈ నంబరు 98 బ్యాంకులతో అనుసంధానమై ఉంది' అని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమ, కలెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం పేరును మాత్రమే తొలగించారు

» విగ్రహం ధ్వంసం దుష్పచారమే: సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ స్మృతివనంలో భవనంపై ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి అన్న అక్షరాలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'అక్షరాలను తొలగించిన ఘటనపై విచారణ కొనసాగుతోంది. దీన్ని కొంతమంది వక్రీకరిస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, అవమానించారని ప్రచారం చేస్తున్నారు. సామాజిక వర్గాలను, దళిత సంఘాలను రెచ్చగొట్టడానికి కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దు' అని సీపీ విజ్ఞప్తి చేశారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులకు పాతపేర్లే

» వైఎస్ఆర్, వైసీపీ నేతల పేర్ల తొలగింపు.. ఉత్తర్వులు జారీ

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖలో గత ప్రభుత్వ హయాంలో పెట్టిన వైఎస్ఆర్, వైసీపీ నేతల పేర్లు చెరిగిపోయాయి. కేంద్రంతో సమావేశాలు, సమీక్షల సమయంలో రాజకీయనేతల పేర్లుండే వాటి బ్యాక్ గ్రౌండ్ ఏమిటో చెప్పడం కష్టమవుతోంది. దీంతో కేంద్రం ఈ పథకాలపై సకాలంలో సహేతుకమైన స్పందనను ఇవ్వడంలేదు. ప్రాజెక్టులకు అవసర మైన సాంకేతిక, డిజైన్, నిధులపరమైన అనుమతులు, ఆమోదాలకు ఆటంకం కలుగుతోంది. దీంతో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి పెట్టిన పేర్ల పిచ్చికి శాశ్వత పరిష్కారం చూపేలా 12 ప్రాజెక్టుల పేర్లను మారుస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు. 'వైఎస్ఆర్ పల్నాడు డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టును ఇకపై 'గోదావరి-పెన్నా నదుల అను సంధానం-1'గా పిలుస్తారు. ఆదివిరం వైకుంఠపురం ఎత్తిపోతల పథకాన్ని అదే పేరుతో పిలుస్తారు. 'వైఎస్ఆర్ వేదాద్రి ఎత్తిపోతల' పథకాన్ని 'ముక్త్యాల ఎత్తిపోతల పథకం'గా మార్చేశారు. వెలిగల్లు రిజర్వాయరుకు వైఎస్ఆర్ పేరును తొలగించారు. సర్వరాయ సాగర్ రిజర్వాయరు (జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పరిధిలో), నెల్లూరు బ్యారేజీ, తాడిపత్రి రిజర్వాయరు, హంద్రీనీవా సుజల స్రవంతి, పరిటాల రవీంద్ర ఎత్తిపోతల పథకం పేర్లను పాత విధానంలో కొనసాగిస్తారు. వైసీపీ నేతల పేర్లను తొలగించారు. మొగలిగుండాల మినీ రిజర్వాయరు, రాజోలు ఆనకట్ట ఎత్తిపోతల పథకాలను యథాతథంగా పాతపేర్లతోనే కొనసాగిస్తారు.

రైల్వే జోన్‌పై బాబుతో చర్చిస్తున్నాం: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే జోన్‌పై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్నామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఇందుకు గత ప్రభుత్వం కేటాయించిన స్థలం నీరు నిలిచే ప్రాంతమని, మరో స్థలం కేటాయించేలా చర్చిస్తున్నామన్నారు. దీనిపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తరచూ తమతో మాట్లాడుతున్నారని తెలిపారు. కొత్త రైల్వే ప్రాజెక్టుల్లో తెలుగు రాష్ట్రాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. శనివారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రాజెక్టుల్లో ఏపీలో 85.5 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. హౌరా-చెన్నై రైల్వే కారిడార్ అనేక రాష్ట్రాలను కలుపుతుందని, ఈ కారిడార్ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించామని తెలిపారు. విజయనగరం నుంచి 3వ లైన్ నిర్మాణం ఆమోదం పొందిందని చెప్పారు. మొత్తంగా 4 లైన్ల కారిడార్ నిర్మించాలని భావిస్తున్నామని తెలిపారు. ఆనస్ సోల్(బెంగాల్)- వరంగల్ వరకు కోల్‌పేలా సరుకుల కారిడార్ ఏర్పాటు చేయనున్నామన్నారు. జునగఢ్-నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి-పాండురంగాపురం వయా భద్రాచలం రైల్వే లైన్లు ఈ కారిడార్లో భాగంగా ఉంటాయని వివరించారు. రూ.7,383 కోట్లతో ఈ రెండు ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరాకు ఈ కారిడార్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. సింగరేణి బొగ్గు ఎగుమతికి ఇదెంతో దోహదపడుతుందన్నారు. ఈ కారిడార్ ద్వారా 500 నుంచి 700 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులోనే భద్రాచలం వద్ద గోదావరిపై రైల్వే బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. కుపొన్న ఏర్పడినప్పుడు కోస్తా ఏరియాలో నరకు రవాణాకు ఈ కారిడార్ కీలకంగా మారుతుందన్నారు. కాగా, రైల్వే నూతన ప్రాజెక్టుల వల్ల ఇప్పటి వరకు రైల్వే సౌకర్యం లేని అనేక ప్రాంతాలకు రైల్వే సౌకర్యాలు అందుబాటులోకి రావడంతోపాటు ఆయా ప్రాంతాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించనున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం - మల్కాన్‌గిరి రైల్వేలైన్ వల్ల ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని గనులు, అల్యూమినియం, స్టీల్ ప్లాంట్ల నుంచి ఆంధ్రప్రదేశ్ సముద్రతీర ప్రాంతంలో ఉన్న పోర్టులకు ఉత్పత్తులను తరలించడానికి సుమారు 140 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. వర్తీసగఢ్ నుంచి ప్రజలు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలను చేరుకునే దూరాన్ని, ప్రయాణ సమయాన్ని ఈ లైన్ తగ్గిస్తుందన్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్, విజయవాడ నగరాలకు కనెక్టివిటీని ఈ ప్రాజెక్టు పెంచుతుందన్నారు.

అమరావతికి రూ.15వేల కోట్ల రుణం

» ప్రపంచ బ్యాంకుకు ప్రభుత్వ ప్రతిపాదనలు

» సీఆర్డీయే అధికారులతో కలసి రాజధాని పనులను పరిశీలించిన వరల్డ్ బ్యాంక్ బృందం

» నేడు కొండవీడు వాగు పంపింగ్ స్కీమ్, ఉండవల్లి గుహలు, ఎన్టీఆర్ వర్సిటీ సందర్శన

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని అభివృద్ధి పనుల కోసం ప్రపంచ బ్యాంకు నుంచి తొలిదశలో రూ.15వేల కోట్ల రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ప్రపంచ బ్యాంకు తన అధికారుల బృందాన్ని అమరావతికి పంపించింది. శనివారం నలుగురు సభ్యులతో కూడిన



రాజధానిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

బృందం రాజధానిలో పర్యటించింది. సీఆర్డీఏ అధికారులతో కలసి ఎమ్మెల్యే భవనాలు, ఐఏఎస్ అధికారుల భవనాలు, సెక్రటరీల భవనాలు, గవర్నమెంట్ టైప్-1, టైప్-2 భవనాలు, ఎన్-14 రోడ్డును క్షుణ్ణంగా పరిశీలించింది. రాజధాని పరిధిలో గ్రామాల గురించి, సీడ్ లబ్ధిపై కూడా సీఆర్డీఏ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు స్కూళ్లు, హెల్త్ సెంటర్లు తదితర సోషల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులను చేపడుతున్నామని సీఆర్డీఏ అధికారులు వివరించారు. అయితే వాటిని పరిశీలిస్తామని బృందం సభ్యులు కోరటంతో రాయపూడిలో కట్టించిన స్కూలును చూపించారు. ఆదివారం కొండవీటివాగు పంపింగ్ స్కీమ్, ఉండవల్లి గుహలు, ఉండవల్లి స్కూల్, ఎన్టీఆర్ యూనివర్సిటీ, ఎన్-9 రోడ్డు పరిశీలన చేపట్టనున్నారు. ఈ బృందం ప్రాథమిక పరిశీలన పూర్తయిన తర్వాత ఎంత రుణం ఇస్తారో, రుణ అవగాహన ఒప్పందాలు, షరతుల వివరాలపై స్పష్టత రానుంది.

ఇదేం ఖర్మ వెంకటరెడ్డి?

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఉనికిని కనిపెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్నా ఉన్నాయి. కానీ ఆయన ఆచూకీ తెలియకుండా ఎక్కడో దాక్కున్నారు. కేవలం సస్పెన్షన్‌కే అజ్ఞాతవాసమా? లేక వెంకటరెడ్డి భయానికి కారణాలు ఇంకా ఏమైనా ఉన్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో తారాజువ్వలా ఓ వెలుగు వెలిగి...గనుల వెంకటరెడ్డి అంతలోనే లేదనిపించుకున్న అది కారి ఇప్పుడు దాక్కొనే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆది కారి హోదాలో ఆయన తప్పులు చేశారా? అంతిమంగా దిన నేరాలకు పాల్పడ్డారా? గతంలో ఎందరో సీనియర్ అధికారులు పలు ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత అరెస్ట్ అయి జైలుకు వెళ్లివచ్చారు. వారేమీ దాక్కోలేదు. వెంకటరెడ్డికి ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? జగన్ శిబిరం నుంచి ఒత్తిడి ఉందా? లేక దొరికితే అన్నీ బయటకొస్తాయేమోనన్న భయమా?

నింగికి ఎగసి.. నేలకు రాలి...

కోస్ట్‌గార్డ్‌లో సీనియర్ సివిలియన్ ఆఫీసర్‌గా ఉన్న వెంకటరెడ్డి 2019లో ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. సీఎం కార్యాలయంలోని ధనుంజయరెడ్డి సహకారంతో ఆయనకు తొలుత విద్యాశాఖలో స్పెషల్ సెక్రటరీ అనే పోస్టు క్రియేట్ చేసి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత కొద్దిరోజులకే గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఆ తర్వాత ఏపీఎండీసీ ఎండీగా నియమించారు. ఆ తర్వాతే అసలు కథ మొదలయింది.

ఇసుకలోనే అక్రమాలు

గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుకను ఎత్తివేశారు. అడ్డే నేరపూరితమైన



అన్నమయ్య జిల్లా కొత్తకోటలోని వెంకటరెడ్డి నివాసానికి సస్పెన్షన్ ఆర్డర్‌ను అతికించిన దృశ్యం

అంశంగా పరిగణించారు. ఇసుక అమ్మకాలకు తెరతీశారు. జగన్ అన్న దీయ కంపెనీకి టెండర్ ఇవ్వాలనుకున్నారు. ఏపీలో కాకుండా కోల్‌కతా కేంద్రంగా టెండర్లు నిర్వహించి జేపీ వెంచర్స్‌ను ఎంపిక చేశారు. ఆ సంస్థ పర్యావరణాన్ని ఉల్లంఘిస్తూ అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపడుతుందని ఫిర్యాదులు వచ్చినా గనులశాఖ డైరెక్టర్‌గా వెంకటరెడ్డి పట్టించుకోలేదన్న ఫిర్యాదులున్నాయి. అక్రమ తవ్వకాలపై ఎన్జీటీలో కేసు దాఖలయినప్పుడు కూడా కోర్టును తప్పుదోవ పట్టించేలా పర్యావరణ ఉల్లంఘన జరగడం లేదని, అంతా నిబంధనల ప్రకారమే సాగుతోందని అఫిడవిట్‌లు దాఖలు చేశారు. ఎన్జీటీకి నమ్మకం లేక కేంద్ర బృందాలను పంపి విచారణ చేయించగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని నిర్ధారించాయి. ఇసుక అక్రమాలను నిరోధించకుండా జేపీ వెంచర్స్‌కు సహకరించారని ఎన్జీటీ గుర్తించింది. దీంతో గనుల శాఖ తీరును ఆక్షేపించింది. జేపీ వెంచర్స్ ఇసుక కాంట్రాక్టు ఉన్నా, ఉమ్మడి జిల్లాల వారీగా వైసీపీ నేతల అనధికార కాంట్రాక్టులు తీసుకొని అమ్మకాలు చేశారు. ఇలా నెలకు సగటున 20-25 కోట్లమేర అప్పట్లో జగన్ నివాసం తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పం కట్టారన్న ఫిర్యాదులున్నాయి. ఇలా 2021-23 కాలంలో ఇసుక అక్రమ అమ్మకాల ద్వారానే తాడేపల్లికి రూ. 6,240 కోట్లమేర చేరాయని పలువురు నేతలు ఆరోపించారు. ఇసుకను జిల్లాల వారీగా కాంట్రాక్టు దక్కించుకున్న నేతలు తాడేపల్లికి ఇచ్చిన దానికంటే రెట్టింపుగానే సంపాదించుకున్నారని చెబుతున్నారు. అంటే రెండేళ్ల వ్యవధిలోనే ఇసుక వ్యాపారం రూ.10వేలకోట్లపైనే చేశారని, నదులను గుల్లచేశారన్న ఫిర్యాదులు టీడీపీ కూటమి ప్రభుత్వానికి అందాయి.

ఎందుకీ పరిస్థితి?

సీనియర్ అధికారి అయిన వెంకటరెడ్డికి ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకోకుండా దాక్కొనే పరిస్థితిని ఎందుకు తెచ్చుకున్నారు? ఓ సీనియర్ అధికారిగా తనెందుకు పనిచేసే జూనియర్ అధికారి తప్పుచేస్తే వెంకటరెడ్డి సస్పెండ్ చేస్తారా. నోటీసులు ఇస్తారా. ఆ అధికారి కూడా నోటీసులు తీసుకోకుండా తప్పించుకొని తిరిగితే వెంకటరెడ్డి కేసు పెట్టకుండా ఉంటారా? కచ్చితంగా చర్యలు తీసుకుంటారు. మరి ఆదే తప్పు వెంకటరెడ్డి చేస్తే ఆయనపై చర్యలు ఉండాయని మరచిపోయారా? పైగా జగన్ పాలనలో జరిగిన సహజవనరుల దోపిడీలో వెంకటరెడ్డి పాత్ర చాలా కీలకమని ప్రభుత్వం నమ్ముతోంది. ఇసుక కేసు విచారణను ఏసీబీకి అప్పగించింది. గనుల శాఖలో జరిగిన పలు అక్రమాలపై సీఐడీతో విచారణ చేయించాలనుకుంటోంది. ఈ విచారణలు మొదలయితే వెంకటరెడ్డి కేంద్రంగా తీసుకున్న నిర్ణయాలన్నింటిపై ఆయన బదులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో తన పాత్రేమీ లేదని చెప్పాల్సిఉంటుంది. అప్పుడు తనకు మౌఖిక ఆదేశాలు ఇచ్చిన జగన్, ఆయన అస్మదీయుల పాత్ర కూడా బయటకొస్తుంది. అందువల్లే సస్పెన్షన్ ఆర్డర్ తీసుకునేందుకు ఆయన వెలుగులోకి రావడం లేదని తెలిసింది. సస్పెన్షన్ ఆర్డర్ ఇచ్చే 'పేరిట ఏసీబీ అరెస్టుచేసే ఆవకాశం ఉందని, కోర్టుకెళ్లి ఊరట పొందే ప్రయత్నం చేయాలని జగన్ శిబిరం నుంచి వచ్చిన సూచన తోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గనుల ఫైళ్లు మాయం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వెంకటరెడ్డిపై వేటు పడింది. ఆయనను తప్పించి, యువరాజ్‌కు ఆ శాఖ తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అయితే, అప్పటికే వెంకటరెడ్డి కీలకమైన ఫైళ్లు మాయం చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఇసుక, బొగ్గు, బెరైటీస్, బీచ్ శాండ్‌లో లీజులకు సంబంధించిన నిర్ణయాలకు సంబంధించిన నోట్ ఫైల్స్ మాయం చేశారని ప్రభుత్వానికి ఆధారాలతో కూడిన ఫిర్యాదులు వచ్చాయి. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే 2808పైగా గనుల లీజులకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)లు జారీ చేశారని, లీజుదారుల నుంచి అక్రమంగా వందల కోట్ల రూపాయలు వసూలు చేశారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. నిజనిజాలను వెలికితీసేందుకు సన్నద్ధమైంది. తొలుత ఇసుక టెండర్ల అక్రమాలను నిగ్గుతేల్చేందుకు అవినీతి నిరోధకశాఖతో విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. ఇసుక టెండర్లు, ఒప్పందాలు, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన డాక్యుమెంట్లు తమకు అందించాలని ఏసీబీ గనుల శాఖను కోరినట్లు తెలిసింది. దీంతోపాటు విచారణకు హాజరయ్యేందుకు వెంకటరెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఆయన అందుబాటులోకి రాలేదు. నిజానికి వెంకటరెడ్డిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు (జీఓ 61)లో అమరావతిని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. ఇక వేళ ఏదైనా అత్యవసర పనిమీద బయటకు వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. కానీ వెంకటరెడ్డి ఇటు అమరావతిలో, అటు తెలంగాణలో లేరు. దీంతో ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను చెన్నై, తిరుపతిలోని ఇళ్లకు, ఉమ్మడి కడప జిల్లా ఓబులవారిపల్లెలోని కొర్లకుంట గ్రామంలోని వెంకటరెడ్డి నివాసాలకు అతికించారు.

ఇంటర్ విద్యలో సంస్కరణలు

» పాఠ్య ప్రణాళిక సమీక్షకు విద్యామండలి నిర్ణయం

» 2025-26 నుంచి కొత్త పుస్తకాలు అందుబాటులోకి



అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పాఠ్యప్రణాళికను సమీక్షించి మార్పులు, చేర్పులు చేయాలని ఇంటర్ విద్యామండలి నిర్ణయించింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి నూతన పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తేనుంది. పదేళ్ల తర్వాత పాఠ్యాంశాల మార్పులకు నిర్ణయం తీసుకుంది. 2015లో చివరిసారిగా ఇంటర్ కరిక్యులమ్‌ను సమీక్షించగా, అప్పటివరకూ అవే పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంటర్ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు ఉన్నత విద్యను అనుసంధానించేలా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు 1,980 పేజీలతో ఆరు పుస్తకాలు, ఆర్ట్స్ గ్రూపులకు 1,650 పేజీలతో ఐదేసి పుస్తకాలు చొప్పున ఉన్నాయి. వీటిని సమూలంగా మార్చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో పాఠ్యపుస్తకాల సమీక్ష కేవలం పాఠ్యాంశాలను అటూ ఇటూ మార్చడంలా సాగింది. ఇప్పుడు అందుకు భిన్నంగా పూర్తిగా ఉద్యోగ అవసరాలు, ఉన్నత విద్యకు అనుసంధానం, జాతీయ విద్యా సంస్థల్లో సీట్ల కోసం పోటీపడేలా సిలబస్‌ను మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం సంబంధిత అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఏపీ పాఠ్యాంశాల మార్పులకు మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. వీలైనంత త్వరగా మార్పులు చేర్పులు పూర్తిచేసి వచ్చే ఏడాది పుస్తకాల ముద్రణకు ఆలస్యం కాకుండా చూడాలని భావిస్తున్నారు. దీంతోపాటు ఇంటర్‌లో మరిన్ని సంస్కరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కరిక్యులమ్‌లో మార్పులతో పాటు బోధనా సిబ్బంది కొరత లేకుండా చర్యలు ప్రారంభించింది. గతంలో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది పలు కారణాలతో విధుల్లో చేరకుండా ఆగిపోయిన 43మందికి ఇప్పుడు మళ్లీ స్థానాలు కేటాయిస్తోంది. వారు కాలేజీల్లో చేరితే సిబ్బంది కొరత కొంతమేర తీరుతుందని భావిస్తోంది. ఆ తర్వాత జిల్లాల్లో ఒకేషనల్ విద్య పోస్టులను కూడా భర్తీ చేయాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇస్తే సిబ్బంది ఎంతమంది అవసరమో అంచనా వస్తుంది. అందుకు తగ్గట్టుగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఇంటర్ విద్యలో మరో కీలక సంస్కరణ దిశగా ప్రభుత్వం ఆడుగులు వేస్తోంది. ఇంటర్‌లో తొలి నుంచీ మార్కుల విధానం ఉంది. రెండేళ్లకు కలిపి వెయ్యి మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. అయితే ఇకపై మార్కుల స్థానంలో గ్రేడ్ విధానం తీసుకొస్తే ఎలా ఉంటుందని దానిపై అధ్యయనం చేయనున్నారు. పరిశ్రమిక రంగాలు గ్రేడింగ్‌కు మొగ్గు చూపుతున్నాయని, అందువల్ల ఈ విధానం ఎలా ఉంటుందో చూడాలని మంత్రి లోకేశ్ ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ విధానం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. అయితే ఇంటర్ మార్కులు ఈఏపీసెట్, జాతీయ పోటీపరీక్షల్లో వెయిటేజీ ఉంటుంది. అందువల్ల గ్రేడింగ్ సాధ్యమేనా అనే కోణంలోనూ అధ్యయనం చేయనున్నారు.

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు రెన్యువల్

» పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 3,619 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల సర్వీసును రెన్యువల్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి 2025 ఏప్రిల్ వరకు ఈ ఒప్పందం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేశ్, కల్లూరి శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేశారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించినందుకు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెన్యువల్‌పై ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి టీజే గాంధీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

చదువు.. చట్టుబండలు

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయింది. అంటే 1,55,652 మంది విద్యార్థులు ఈ స్థాయిలో తగ్గిపోయారు. ఇంత స్థాయిలో ఆర్థేపణ్ణ పడిపోవడానికి కారణాలేంటనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో తరగతి నుంచి టెన్త్ వరకు చూస్తే 67,752 మంది విద్యార్థులు తగ్గిపోయారు. ఈ కేటగిరీలో ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 9,939 మంది తగ్గారు. ప్రీప్రైమరీ, ఒకటో తరగతిలో ఆడ్మిషన్లు తగ్గాయంటే శిశు జననాలు తగ్గడం కొంతవరకు కారణం కావొచ్చు. కానీ గతేడాది బడుల్లో ఉన్నవారు ఇప్పుడు ఏమైనట్టు అనేది కీలకాంశం. ఇంటర్మీడియట్‌లో ఈ సంఖ్య భారీగా పెరిగింది. గతేడాది 10,13,057 మంది ఇంటర్ కాలేజీల్లో ఉంటే, ఈ ఏడాది ఆ సంఖ్య 8,12377కు పడిపోయింది. అంటే 2,00,680 మంది తగ్గిపోయారు. వీరిలో ఎంతమంది పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు? ఎంతమంది డ్రాపౌట్ అయ్యారు? అనేది తేలాలి. మొత్తంగా ప్రీస్కూల్ నుంచి ఇంటర్ వరకు 4,24,084 మంది విద్యార్థులు తగ్గారు.

ఉన్నత విద్య ట్రెండ్

గతంలో ఉన్నత విద్యలో మాత్రమే రాష్ట్రానికి చెందిన విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లి చదువుకునేవారు. కానీ ఇప్పుడు ఇంటర్మీడియట్‌లోనూ ఆ ట్రెండ్ కనిపిస్తోంది. 2లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారంటే వారిలో చాలా మంది తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదివే అవకాశం కనిపిస్తోంది. విద్యాశాఖలో గత ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో విద్యార్థులు వలస బాట పట్టే పరిస్థితులు వచ్చాయి.

విలీనంతో దెబ్బతీశారు

ప్రాథమిక విద్యను జగన్ ప్రభుత్వం విలీనంతో దెబ్బతీసింది. 4వేలకు పైగా ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఇది ప్రాథమిక పాఠశాలలపై తీవ్రంగా ప్రతికూల ప్రభావం చూపింది.

ఇప్పుడేం చేయాలి?

విద్యార్థుల సంఖ్య పడిపోవడం కొత్త ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఒకేసారి పిల్లలు భారీగా తగ్గిపోవడంతో వారిని తిరిగి బడులకు తీసుకురావాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై పడింది. గత ప్రభుత్వం టీచర్లపై బోధనేతర పనులను రుద్ది, బోధన అంశాలను పక్కనపెట్టడంతో ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు ఇంకా తగ్గిపోయే పరిస్థితి వచ్చింది. జీవో 117తో చేసిన ప్రయోగాలు కూడా బెడిసి కొట్టాయి. ఒకే తరగతికి ఒక బడిలో సబ్జెక్టు టీచర్లతో బోధించడం, మరో బడిలో ఎస్జీటీలతో పాఠాలు చెప్పించడం వివక్షలను దారితీసింది. దానివల్ల ప్రయోజనం లేదని తెలిసినా కొనసాగించడంతో విద్యార్థులు ప్రైవేటు బాట పట్టే పరిస్థితి వచ్చింది.

ప్రజల వద్దకే పాలన!

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమించుకొని రికార్డులను తారుమారు చేసి వారికి నరకం చూపించారు. ఇదివరకటి అధినేత సమాధానం చెప్పే దిక్కులేదు. ఉద్దేశపూర్వకంగా వెబ్‌ల్యాండ్‌లో దిద్దిన చిన్న మార్పులు చేసి ప్రజలను హింసించారు. కొత్త ప్రభుత్వం వచ్చాక స్వీకరిస్తోన్న వినతిపత్రాల్లో ఇటువంటివే అధికంగా ఉంటున్నాయి. జగన్, ఆయన అనుయాయులు చేసిన పాపాలు సరిదిద్దకపోతే గ్రామాల్లో ఆరాచకం ప్రబలుతుందని, పేదల నోటికాడి ముద్దను తీసేసినట్లవుతుందని భావించిన ప్రభుత్వం తక్షణమే ఆ సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. 45 రోజులపాటు ఊరూరు తిరిగి అధికార యంత్రాంగాన్ని మోహరించి ఎక్కడికక్కడే సమస్యలు తెలుసుకోవడం, ఆ తర్వాత 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపడం...ఇదే ప్రస్తుత టార్గెట్. ఈ నెల 15న మంత్రుల లాంఛనంగా గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తారు. ఆ తర్వాత 16నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు అంటే 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను 13నాటికి ఖరారు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఓ సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తారు. జేసీ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండలం, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కలెక్టర్లు తగిన చొరవ తీసుకోవాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. అటవీ, దేవదాయ, వక్ఫ్ శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు హాజరవుతారు. భూ కొలతల్లో తేడాలు, సర్వేనెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదైన తప్పులు, ప్రజల నుంచి వైసీపీ నేతలు లాక్కున్న భూములు, భూ కబ్జాలు, భూ ఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం వంటి తదితరాలపై బాధితుల నుంచి పిటిషన్లు తీసుకుంటారు. 2019కి ముందు భూమి రికార్డులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయో పరిశీలిస్తారు. అడంగల్, పహాణీ, ఆర్ఓఆర్, 1బీ రిజిస్టర్, 22(ఏ) జాబితాలను ఆయా బాబుల్లో ఉంచుతారు. వాటిపై ప్రజల నుంచే వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. తహసీల్దార్ నేతృత్వంలో అవసరమైతే భూములను పరిశీలన చేస్తారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఆర్ఓఆర్ రికార్డును ప్రజల సమక్షంలో చదివి వినిపించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని సూచించింది. జగన్ బొమ్మలున్న పాస్ పుస్తకాలను తహసీల్దార్ల ద్వారా ధ్వంసం చేయాలని రెవెన్యూ సెల్ సీఎస్ సిసోడియా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. గ్రామంలో జగన్ ఫొటో, బొమ్మలతో సర్వేరాళ్లు ఉంటే, వాటిపై పేర్లను చెరిపివేయాలని నిర్దేశించారు.

ఐదు కేటగిరీలుగా..

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఐదు రిజిస్టర్లలో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 1.మ్యుటేషన్, 2.కౌలు రైతు కార్డులు(ఎల్ఈసీ), 3.భూమి వివాదాలు, 4.భూ ఆక్రమణ, 5.నిషేధ జాబితా 22(ఏ) గోడమాల రిజిస్టర్లను నిర్వహిస్తారు. వీటిలో నమోదుచేసి, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. వీటిని ఆర్ఓజీఎస్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే ఓ రశీదు ఇస్తారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ అనేది ప్రభుత్వం చేపట్టిన పెద్ద టార్గెట్. దాన్ని విజయవంతం

సదస్సుల్లో ఏం చేస్తారంటే..

గ్రామ రెవెన్యూ సదస్సుకు రెండు రోజుల ముందే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు భూముల మ్యాప్‌లను ప్రకటిస్తుంది. సదస్సులకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, చేయాలంటే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. అందుకే ప్రజాప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైతు నేతలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, భూ సమస్యలపై పనిచేస్తోన్న ఎన్జీవోలను పిలిచి సదస్సుల ఆవశ్యకతను తెలియజేయాలని, ఈ సదస్సులకు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించింది. జిల్లా, డివిజన్, మండల, గ్రామంవారీగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వాటి లక్ష్యాలు తెలిపేలా ప్రచారం చేయాలని నిర్దేశించింది.

90 రోజుల టార్గెట్..

ఈ నెల 15నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరిస్తారు. ఆ తర్వాత మరో 45 రోజుల్లో అంటే నవంబరు 15 నాటికి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారం 90 రోజుల్లోనే పూర్తిచేయాలనేదే లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనుంది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారంపై రోజువారీగా సమీక్ష చేయనున్నారు. ఆర్డీఓ రుకు పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వం ఇదివరకే ఆదేశించింది. పర్యవేక్షణ ఆర్జీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రజల వద్దకే అధికారులు..

రెవెన్యూ సదస్సుల పేరిట పదేళ్ల తర్వాత కీలక ప్రభుత్వ శాఖలు ప్రజల వద్దకు వెళ్లను న్నాయి. ఇది ప్రజల వద్దకు పాలనే అని సీనియర్ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇంతకు ముందు అధికారుల వద్దకు ప్రజలు వెళ్లి గోడు చెప్పుకొనేవారు. దీంతో అధికారి స్వీకరించే పరిస్థితి బట్టి పరిష్కారం ఉండేది. కానీ, ఇప్పుడు ప్రజల భూ వివాదాలు వినడానికి ఐదారుశాఖల అధికారులతో కూడిన బృందాలు రోజంతా గ్రామంలో మకాం వేయబోతున్నాయి. ఇందులో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కాబోతున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటోంది.

'ఫ్రీహోల్డ్' బంద్

(మొదటి పేజీ తరువాయి)

మోసాలు, దోపిడీలు, కబ్జాలను గుర్తించి 6నెలల్లో నివేదిక ఇచ్చే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. దీనిపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్రీహోల్డ్ చేసిన 22ఏ, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నెలల పాటు నిలిపివేయాలని అందులో స్పష్టం చేశారు. అసైన్ చేసి 20ఏళ్లు దాటిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ గత జగన్ సర్కారు అసంబద్ధ జీవో జారీ చేసింది. దీని ముసుగులో వైసీపీ నేతలు క్షేత్రస్థాయిలో చెలరేగిపోయారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, పేదల్ని బెదిరించి, కబ్జాలకు పాల్పడి భూములను లాగేసుకున్నారన్న భారీగా ఫిర్యాదులు వచ్చాయి. ఆలానికి ప్రభుత్వ భూములను పట్టాలు పుట్టించి వాటిని కూడా ఫ్రీహోల్డ్ చేశారు. వైసీపీ హయాంలో మొత్తంగా 9లక్షల ఎకరాల భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 20వేల ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో వైసీపీ నేతలకు సంబంధించినవే ఎక్కువ. 20ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఫ్రీహోల్డ్ చేయాలని నిర్ణయిస్తున్నారు... వాటి అమ్మకాలు, కొనుగోళ్లకు వీలు కల్పిస్తూ వైసీపీ హయాంలో జీవో 596 ఇచ్చారు. ఆ భూముల గుర్తింపు పనిని ఎమ్మార్వోలకు అప్పగించారు. మొదట పక్కాగా పరిశీలించి 20ఏళ్లు దాటిన అసైన్డ్ భూముల రాష్ట్రవ్యాప్తంగా 40వేల ఎకరాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. కానీ... అప్పటి ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. ఎన్నికల ముందు మెప్పు కట్టిపెట్టి మరీ బలవంతంగా రికార్డులు తారుమారు చేసి 40వేల ఎకరాలను 9లక్షల ఎకరాలకు పెంచేలా చేశారు. వైసీపీ నేతలు ఎక్కడికక్కడ రంగంలోకి దిగి భూములను లాగేసుకునే పనిలో పడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపజేశారు. ఈలోపే ఎన్నికల నియమావళి రావడం, ప్రభుత్వం మారిపోవడంతో... రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. నిజమైన సామాన్య లబ్ధిదారుల భూములకు నిషేధ జాబితా నుంచి విముక్తి లభించలేదు. కానీ... వైసీపీ నేతలు రంగంలోకి దిగిన చోట మాత్రం చకచకా 'ఫ్రీహోల్డ్' అయ్యాయి.

దిద్దుబాటు...: 'ఫ్రీ హోల్డ్'లో అక్రమాలు, అందులో ప్రభుత్వ భూములు కూడా ఉండటంతో వీటన్నింటిపై కూటమి సర్కారు విచారణకు ఆదేశించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు ఇచ్చి... విచారణ పూర్తయ్యేవరకు ఆ భూముల రిజిస్ట్రేషన్లను పెండింగ్‌లో ఉంచుతారు. అంటే ఈ 3 నెలల పాటు ఆ ఫ్రీహోల్డ్ భూములను అమ్మడానికి, కొనుగోలు చేయడానికి కుదరదు. మొత్తం రిజిస్ట్రేషన్లలో, ఫ్రీహోల్డ్ జాబితాలో నిబంధనలను విరుద్ధంగా... అంటే 20ఏళ్లలోపు ఉన్న అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల గుర్తిస్తారు. రిజిస్ట్రేషన్లను చేయించుకున్న వ్యక్తులు అర్హత ఉన్న వారా కాదా అనే సమాచారాన్ని సేకరిస్తారు. కలెక్టర్‌తో పాటు ఆ ప్రాంతానికి చెందిన ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్, సర్వే-ల్యాండ్ రికార్డుల ఏడీ, జిల్లా పంచాయతీ అధికారి, మునిసిపల్ కమిషనర్ లేదా టౌన్ ప్లానింగ్ అధికారితో కూడిన బృందం విచారణ జరుపుతుంది. ఫ్రీహోల్డ్ చేసిన ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలిస్తారు. ఫర్దర్‌గా రిజిస్ట్రేషన్లను... ఇప్పటికే అమ్మకాలు జరిగి చేతులు మారిన భూములను మరోసారి విక్రయించకుండా 3నెలలపాటు పెండింగ్‌లో పెడతారు. ప్రతి మండలం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రతి కేసునూ, దాని వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలి. రాష్ట్రప్రభుత్వ స్థాయిలో పరిశీలన జరిపి ఆ రిజిస్ట్రేషన్లను క్లియర్ చేస్తారు. ఏదైనా తేడాలుంటే ఆ భూముల తిరిగి 22ఏ జాబితాలో పెడతారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన అసాధ్యం

- జగన్ డిమాండ్ చూసి జనం నవ్వుతున్నారు
- ప్రజలు సంతోషంగా ఉన్నారు: గోనె ప్రకాశరావు



న్యూఢిల్లీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన అసాధ్యమని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు తెలిపారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తెలుగు రాష్ట్రాల్లో శిశుపాల, రావణాసుర వధ జరిగింది. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాల మార్పుతో ప్రజలు సంతోషంగా ఉంటున్నారు. మాజీ సీఎం జగన్ ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేయడం చూస్తే... రాజకీయాల్లో ఓనమాలు తెలియవన్న భావన కలుగుతోంది. జగన్ డిమాండ్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే నాకెంతో గౌరవం. మర్యాదపూర్వకంగా మాత్రమే చంద్రబాబుని కలిశాను. ఎలాంటి రాజకీయ పదవులు ఆశించి కలవలేదు.' అని ప్రకాశరావు తెలిపారు.

త్వరలో కౌలు రైతులకు కొత్త మార్గదర్శకాలు

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో మేలురకమైన కొత్త మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ చెప్పారు. శనివారం రైతు నాయకులు, రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల్లో సవరణలు చేసి, నూతన మార్గదర్శకాలను త్వరలో జారీ చేయనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

నదుల అనుసంధానంతోనే దుర్భిక్షానికి చెక్!

- నీతీఆయోగ్ నీటిఎద్దడి రిపోర్టుపై ఏపీ ప్రతిపాదన
- కేంద్రానికి సమర్పించనున్న రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఇప్పటికంటే రెండింతలు ఎక్కువగా తాగునీటి డిమాండ్ ఉంటుందని, దానిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు ఇప్పటినుంచే చర్యలు ప్రారంభించాలంటూ నీతీ ఆయోగ్ ఒక నివేదికను పంపించింది. నదుల అనుసంధానం ద్వారానే ఈ సమస్యను అధిగమించగలమని ఈనివేదికపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించనుంది. దీనిపై ఇప్పటికే తయారుచేసిన ప్రతిపాదనలను త్వరలోనే జల వనరుల శాఖ.. కేంద్ర ప్రభుత్వానికి అందించనుంది. ప్రాంతాల వారీగా రాష్ట్రంలో ఎదురయ్యే నీటి ఎద్దడిని సహేతుకంగా జల వనరుల శాఖ గుర్తించింది. రాష్ట్రంలో పొడి వాతావరణం, రిజర్వాయర్లలో నీటి లభ్యత లేకపోవడం .. భూగర్భజలాలు అట్టడుగుకు చేరడం .. వర్షాభావ పరిస్థితులు... దుర్భిక్షం తలెత్తడానికి కారణాలు. దీనిపై ప్రత్యామ్నాయ మార్గాలను ఇప్పటినుంచే అన్వేషిస్తోంది. నదుల్లోకి వచ్చే వరదను రిజర్వాయర్లలో వడిసిపట్టి ..వాటిని కాలువల ద్వారా చెరువుల్లోకి .. ఇతర నీటి వనరులలోనికి పంపడం ద్వారా భూగర్భజలాల మట్టాలను పెంచేందుకు వీలుంటుందని జలవనరుల శాఖ చెబుతోంది.

230 కిలోల గంజాయి పట్టివేత

- సెబ్ అదుపులో ఐదుగురు నిందితులు.. నగదు, సెల్‌ఫోన్లు, కార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో సెబ్ అధికారులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 10: విశాఖ జిల్లా నుంచి అక్రమంగా తరలిస్తున్న 230 కిలోల గంజాయిని గుంటూరు జిల్లా మంగళగిరి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మహమ్మద్ అమీర్, కైలాయి ముద్దాన్, షేక్ అబ్దుల్లా ఫారుఖ్, కార్తికేయన్, మల్లికార్జున అనే అయిగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా ముఠాగా ఏర్పడి విశాఖ పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.34,530 నగదు, అరు సెల్‌ఫోన్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో సెబ్ అడిషనల్ ఎస్పీ ఎల్.రంగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ ఎ.ఆనంద్, మంగళగిరి సీఐ ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలి స్మార్ట్ మీటరు ఏర్పాటు

- ప్రీ పెయిడ్ విధానానికీ ప్రణాళికలు!



విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి. రాష్ట్రంలో తొలి స్మార్ట్ మీటరును తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నంలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసింది. ఈ స్మార్ట్ మీటర్లను తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసి, ఆ తరువాత గృహ వినియోగదారులకు ఇస్తారు. ఎప్పుడంటే అప్పుడు ఎంత విద్యుత్ వినియోగించినదీ వీటి ద్వారా తెలుసుకోవచ్చు. అధికారులు ఆన్‌లైన్‌లోనే రీడింగ్ తీసుకునే వీలుంది. కొద్దికాలం తరువాత ప్రీపెయిడ్ కిందకు తీసుకువచ్చే ప్రణాళికలు ఉన్నాయి.

36 హత్యలపై చిరాకు, పరాకు!

మీడియా ఆధారాలు అడిగితే ముఖం చాటు చేసుకుంటున్న జగన్

- మైకుల ముందు మాట్లాడతారు
- ఢిల్లీ దాకా వెళ్లి ధర్నా చేస్తారు
- ప్రశ్నలు వేస్తే మాత్రం పలాయనం
- 'ఫ్లో' పోతుందంటూ అసహనం
- మాట తడబాటు.. మనిషిలో న్యూనత
- విస్తుపోతున్న సొంత పార్టీ వర్గాలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)



వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి రాజకీయంగా పూర్తి ఆత్మరక్షణలో పడిపోయారా? మీడియాపై ఆయన చూపిస్తున్న అసహనం వెనుక ఈ ఒత్తిడే బలంగా పని చేస్తున్నదా?...విపక్షాలతో పాటు స్వపక్షమూ ఈ ప్రశ్నకు అవుననే జవాబు ఇస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలోనే జగన్ మాటల్లో తడబాటు కనిపించడాన్ని వైసీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఫలితాలు వెల్లడయ్యాక ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోందని చెబుతున్నాయి. రాష్ట్రంలో హింస పెరిగిపోయిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరిగాయని జగన్ ఢిల్లీ దాకా వెళ్లి ధర్నా చేశారు. అందుకు ఆధారాలు చూపించాలని ప్రతిపక్షం, మీడియా అడుగుతుంటే మాత్రం పారిపోతున్నారు. మీడియా ఏ ప్రశ్న అడిగినా చిర్రుబుర్రులాడుతూ అక్కడినుంచి వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి తన అసహనం మీడియా సమావేశంలోనే వెళ్లగక్కుతున్నారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న జగన్‌ను జాతీయ మీడియా కొన్ని ప్రశ్నలు వేయగా, పొంతన లేని జవాబులు, దాటవేత ప్రదర్శించారు.

వినేదే లే...

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదలచేసిన శ్వేతపత్రాలకు కౌంటరు అన్నట్టు జగన్ ఇటీవల మీడియా సమావేశాన్ని నిర్వహించారు. దాదాపు రెండు గంటలు తాను చెప్పాల్సింది మాత్రం చెప్పి, విలేకరుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. మంగళవారం బెంగళూరు నుంచి తాడేపల్లి వస్తూ దారిలో కార్యకర్తను పరామర్శించేందుకు విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి జగన్ వెళ్లారు. అక్కడ మీడియాతో మాటాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని.. వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధి ఏదో ప్రశ్నించగానే, అసహనంగా అక్కడినుంచి వెళ్లిపోయారు.

'హ..ఏం చెబుతున్నా'...

నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు ఇటీవల జగన్ వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అసహనానికి గురయ్యారు. వైసీపీ కార్యకర్తల మధ్య గ్యాంగ్‌వార్‌లో హత్యకు గురైన వ్యక్తిని పరామర్శించడానికి వినుకొండకు జగన్ వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మధ్యలో మీడియా ప్రతినిధి ఏదో ప్రశ్న వేశారు. అంతే..జగన్ ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. ఇలా మధ్యలో ప్రశ్నలు వేస్తే 'ఫ్లో' పోతుందని చిరాకుపడ్డారు. మీడియా ముందే .. 'హ..ఏం చెబుతున్నా'నంటూ పక్కనున్న వైసీపీ నేతలను జగన్ అడిగారు. ఆయన తీరుకు వారు తీవ్ర ఆశ్చర్యానికి లోనయ్యారు. జగన్‌లో ఏదో తేడా కొడుతోందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

పిలిచినా పలకడం లేదు..

వైనాట్ 175 అన్న జగన్‌ను సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేశారు. ఫలితాలు చూశాక ..జగన్‌కు దిమ్మతిరిగిపోయింది. అప్పటినుంచి బయటకు చాలా తక్కువ సందర్భాల్లోనే వస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ చేసిన అరాచకాలపై మండిపోతున్న ప్రజలు ఎక్కడ తిరగబడతారోనన్న భయం జగన్ ఆవహించిందని పార్టీనేతలు అంతర్గత సంభాషణల్లో అంగీకరిస్తున్నారు. ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు తాడేపల్లి నివాసంలోకి అనుమతి ఉండేది కాదని చెబుతున్నారు. ఇదేవిషయాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ బాహాటంగానే వెల్లడించారు. వెనుకబడిన వర్గానికి చెందిన కొలుసు పార్థసారథి కూడా తనను కలిసేందుకు జగన్ ఇష్టపడేవారు కాదని వెల్లడించారు. ఈ పరిణామాలన్నీ గుర్తుకు వచ్చాయో ఏమో, ఇప్పుడు 'తాడేపల్లిప్యాలెస్‌కు రండి.. కలుస్తా'నని వైసీపీ శ్రేణులను జగన్ కోరుతున్నారు. అదే సమయంలో 'ఎంపిక' చేసిన కార్యకర్తల నుంచి ప్రతిఘటన ఉంటుందేమోనని జగన్ భయపడుతున్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యమేలుతోంది

- ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబు: జగన్

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోందంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన ఎక్స్ వేదికగా చంద్రబాబు పాలనపై విరుచుకుపడ్డారు. 'ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాది అన్నారు. రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ నైజాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీలను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చి మోసంకాదా? తప్పుడు శ్వేత పత్రాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. లేని అప్పులు ఉన్నట్లుగా, వాటికి లేని వడ్డీలు కడుతున్నట్లుగా పదేపదే మాట్లాడి ప్రజలను మాయచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలను ఆపేసి, సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తు.చ. తప్పక అమలు చేయండి. ఇప్పటికే దిగజారిన పాలనను గాడిలో పెట్టండి' అని జగన్ అన్నారు.

హంతకులకు నాయకుడు జగన్

- ఆయన ముందు ప్లాబో ఎస్కోబార్ కూడా పనికిరాడు
- అంబేడ్కర్ విగ్రహం కింద ఆయన పేరు సరికాదు: మహాసేన రాజేశ్



అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'హంతకులకు నాయకుడు జగన్మోహన్‌రెడ్డి. అంబేడ్కర్ విగ్రహం కింద ఆయన పేరు ఉండటాన్ని దళిత సమాజం జీర్ణించుకొనే పరిస్థితిలో లేదు' అని టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు స్నేహితురాలినంటూ ఒక మహిళ బయటకు వచ్చారు. దువ్వాడ తనతో కలసి ఉంటున్నట్లు ఆమె తన మాటల్లోనే చెప్పారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఒక మహిళతో తప్పుడు మాటలు మాట్లాడుతూ దొరికిపోయారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఒక మహిళతో న్యూడ్ వీడియో కాల్‌తో పట్టుబడ్డారు. ఇలాంటి వారందరికీ వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి నాయకుడు. డ్రైవర్‌ను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత్ బాబుకు, బాబాయిని లేపేసిన కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి, డాక్టర్ సుధాకర్‌ను రోడ్డు మీద ఈడ్చి ఈడ్చి లాక్కెళ్లి చనిపోయేలా చేసిన మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేశ్ వంటి వారందరికీ కూడా పెద్ద డాన్ జగన్. గంజాయి డాన్ జక్కంపూడి, బియ్యం డాన్ ద్వారంపూడి వంటి వారందరికీ కూడా జగనే నాయకుడు. జగన్‌రెడ్డి ముందు ప్లాబో ఎస్కోబార్ కూడా పనికిరాడు. వివేకాను చంపిన వాళ్ల పేర్లు ఆయన విగ్రహం కింద వేయడం ఎంత పాపమో... దళితులను కాలి కింద తొక్కి చంపిన జగన్ పేరు అంబేడ్కర్ విగ్రహం కింద వేయడం కూడా అంత పాపం' అని రాజేశ్ అన్నారు. విజయవాడ నగరంలో పెట్టిన అంబేడ్కర్ విగ్రహం పీఠం మీద జగన్ పేరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడాన్ని టీడీపీ నేతగా ఖండిస్తున్నానని, కాని దళిత నేతగా హర్షిస్తున్నానని రాజేశ్ అన్నారు.

పెద్దిరెడ్డికి పామర్రులోనూ బినామీలు

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'పాపాల పెద్దిరెడ్డికి రాష్ట్రంలో ఊరూరా బినామీలు ఉన్నారు. కృష్ణా జిల్లా పామర్రులోనూ ఆయన బినామీ ఐదేళ్లపాటు అడ్డగోలుగా దోచుకొన్నాడు' అని పామర్రు టీడీపీ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆరోపించారు. శనివారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'పామర్రు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి కృష్ణా జిల్లాలో ఒక బినామీ. మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో పెద్దిరెడ్డి పీఏ శశిధర్ మొదటి నిందితుడు అయితే కైలే అనిల్ రెండో నిందితుడు. పెద్దిరెడ్డి అండ చూసుకొని అనిల్.. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకొన్నందుకు పోలీసులపై కేసు పెట్టి జైలుకు పంపించాడని వర్ల ఆరోపించారు.

తూర్పు కనుమలకూ ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఏళ్ల కిందట కొండలు తవ్వి ట్రాక్‌లు, టన్నెళ్లు నిర్మించింది. ఆ మార్గంలో తరచూ కొండ చరియలు విరిగిపడుతున్న విషయాన్ని నిపుణులు ఉదాహరిస్తున్నారు. తూర్పు కనుమలకు పొంచి ఉన్న ముప్పుపై నిపుణులు విశ్లేషించారు.

అభివృద్ధి పేరుతో ధ్వంసం

తూర్పు కనుమలు ఒడిశాలోని మహానది నుంచి తమిళనాడులోని నీలగిరి కొండల వరకూ సుమారు 75వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. పశ్చిమ కనుమల కంటే పురాతమైన తూర్పు కనుమలు ఒడిశా, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వరకు ఉన్నాయి. జీవవైవిధ్యం పుష్కలంగా ఉన్న తూర్పు కనుమల్లో అనేక రకాల ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. తూర్పు కనుమల్లో కొండలపై చిన్నపాటి వాగులు ప్రవహిస్తుంటాయి. వాటిని విధ్వంసం చేయకపోతే కొండలపై కురిసిన వర్షం కిందకు పారుతుంది తప్ప ఇబ్బందులు కలిగించదు. కానీ చాలాకాలం నుంచి తూర్పుకనుమల్లో అభివృద్ధి పేరిట ప్రకృతిని ధ్వంసం చేయడం మొదలెట్టారు. గనుల తవ్వకాలు చేపట్టి, వాటి రవాణా కోసం రోడ్డు, రైల్వే ప్రాజెక్టులు నిర్మించారు. దీనికితోడు పర్యాటకం పేరుతో కొండలు, వాలు ప్రాంతాల్లో రిసార్టులు, హోటళ్లు, ఇతరత్రా కార్యకలాపాలు ప్రారంభించారు.

మానవజోక్యంతో ముప్పు

మానవ జోక్యం లేకపోతే కొండల నుంచి ఎటువంటి ముప్పూ ఉండదు. కొండవాలు ప్రాంతాల్లో తవ్వకాలు, నిర్మాణాలు చేపట్టినప్పుడు యంత్రాలు వాడుతున్నారు. పేలుడు పదార్థాలు వినియోగించినప్పుడు ప్రకంపనలు వస్తుంటాయి. వీటివల్ల కొండలు సహజసిద్ధంగా వచ్చే సమతుల్యతను కోల్పోతున్నాయి. ఇలాంటి సందర్భాల్లోనే కొండలపై చిన్న పగుళ్లు ఏర్పడతాయి. వీటిని గుర్తించి తీవ్రత తగ్గేంచేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పగుళ్లు పెద్దవై వర్షాకాలంలో కురిసే వాన నీరు కొండ లోపలకు వెళితే కొండ పటుత్వాన్ని కోల్పోతుంది. దీంతోకొండచరియలు జారి పడుతుంటాయని బ్యూరో ఆఫ్ మైన్స్ మాజీ ఉన్నతాధికారి డాక్టర్ ఆదిభట్ల శాంతారామ్ పేర్కొన్నారు. వర్షాకాలంలోనే కొండచరియలు విరిగిపడుతుంటాయన్నారు.

21 ప్రాజెక్టులకు ముప్పు

ఒడిశా నుంచి ఏపీలో పోలవరం వరకు సుమారు 21 డ్యామ్‌లు తూర్పుకనుమల్లోనే నిర్మించారు. గొట్టా బ్యారేజ్, ఆంధ్ర, వెంగళరాయిసాగర్, జంఝావతి, తోటపల్లి, రైవాడ, తాండవ, ఏలేరు.. తదితర 21 ప్రాజెక్టుల్లో పూడిక పేరుకుపోయింది. వీటి క్యాచ్‌మెంట్ ఏరియాలో మైనింగ్ కార్యకలాపాలు కొనసాగడంతో భవిష్యత్తులో ప్రాజెక్టులకు ముప్పు ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కొండలకు రక్షణ అవసరం

తూర్పుకనుమల్లో చాలా చోట్ల కొండచరియలు విరిగిపడడానికి మానవ జోక్యమే కారణం. కొత్తవలస నుంచి కిరండోల్ వరకు రైల్వేలైన్‌లో శివలింగపురం నుంచి బొర్రాగుహలు మధ్యన కొండచరియలు ఎక్కువగా విరిగిపడుతున్నాయి. ట్రాక్‌లు, టన్నెళ్లు నిర్మించిన ప్రాంతాల్లో కొండలకు రక్షణ చర్యలు చేపట్టాలి. కొండలపై ఏర్పడిన పగుళ్లు గుర్తించి అక్కడ సిమెంట్ లోపలకు పంపాలి. వాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి. బండరాళ్లు దొర్లకుండా వాటికి రంధ్రాలు వేసి సిమెంట్ పంపడంతో పాటు బలమైనమెస్‌లతో కట్టాలి.

- డాక్టర్ ఆదిభట్ల శాంతారామ్, బ్యూరో ఆఫ్ మైన్స్ మాజీ ఉన్నతాధికారి

గనుల తవ్వకాలు నిషేధించాలి

తూర్పుకనుమలకు ముప్పు పొంచి ఉంది. బాక్సైట్ తవ్వకాలతో ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రమాదం పర్యాటకం అభివృద్ధి పేరుతో అరకు లోయ ప్రాంతంలో సాగుతున్న కొండల విధ్వంసం నిలిపివేయాలి. లేకపోతే కేరళతరహా ఘటనలు తూర్పుకనుమల్లోనూ జరిగే ప్రమాదముంది.

- రెబ్బాప్రగడ రవి,సమతా స్వచ్ఛంద సంస్థ

తూర్పు కనుమల జీవ వైవిధ్యానికి ముప్పు

- పర్యావరణ వేత్తలు

పంజాగుట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'దేశంలో తూర్పు, పశ్చిమ కనుమలు, హిమాలయాల్లో అనేక పర్వత శ్రేణులు ఉన్నాయి. అడవుల నరికివేత, మైనింగ్, రహదారి వెడల్పు, కొత్త రహదారులు, రైల్వే లైన్లు వేయడం, పర్యాటక రంగ అభివృద్ధి.. తదితర మానవ చర్యల వలన పర్వత శ్రేణులకు భంగం వాటిల్లుతోంది' అని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, అంతర్జాతీయ జీవ వైవిధ్య నిపుణుడు డాక్టర్ కే.తులసీ రావు, గ్రేస్ అధ్యక్షుడు ఆర్.దిలీప్‌రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి మాట్లాడారు. '2004 జనవరి నుండి డిసెంబరు 2016 వరకు ప్రపంచ వ్యాప్తంగా 4,862 కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ ఘటనల్లో సుమారు 55,997 మంది మృతి చెందారని గణాంకాలు చెప్తున్నాయి. ఇటీవలి కాలంలో దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాలలో కూడా కొండచరియలు విరిగిపడటం ఆందోళన కలిగిస్తోంది. ఐఐటీ, ఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్, యార్డ్ స్కూల్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్తగా అభివృద్ధి చేసిన ఇండియా ల్యాండ్ స్లైడ్ ససెప్టబిలిటీ మ్యాప్ (ఐఎల్ఎస్ఎం) ప్రకారం తూర్పు కనుమలలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంది. ఒడిశా, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో విస్తరించిన తూర్పు కనుమలలో కొండచరియలు విరిగిపడే ప్రమాదంపై కూడా దృష్టి పెట్టాలి. తూర్పు కనుమలను ప్రపంచ సహజ వారసత్వ ప్రదేశంగా ప్రకటించడానికి ఐరాసాని ఒప్పించాలి' అని విజ్ఞప్తి చేశారు.

'నీరు-చెట్టు'కు తొలగిన కక్షల చెర

- రూ.650 కోట్లలో 256 కోట్లు విడుదల.. బాబు ప్రభుత్వం ఉత్తర్వులు



అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు నుంచి నీరు-చెట్టు పథకం విడుదలైంది. ఈ పథకం కింద చెల్లించాల్సిన రూ.650 కోట్లలో రూ.256 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ గోయల్ ఉత్తర్వు జారీ చేశారు. చిన్న నీటి వ్యవస్థలను మెరుగుపరిచి సద్వినియోగం చేసుకునేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకం పెట్టింది. సాగునీటి యాజమాన్య సంఘాల నాయకత్వంలో చిన్నతరహా రైతులు ఈ పథకం కింద పంట నీటి కుంటలు .. కాలువల మరమ్మతు పనులు .. చెరువులను అభివృద్ధి చేసుకున్నారు. రూ. 650 కోట్ల విలువైన నీరు-చెట్టు పనులు అప్పట్లో జరిగాయి. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ పనులు టీడీపీ హయాంలో జరిగాయన్న ఒకే ఒక్క కక్ష సాధింపుతో ఆ నిధులను ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. దీనిపై సాగునీటి యాజమాన్య సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. తక్షణమే బిల్లులు చెల్లించాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. అయినా, నిధులు విడుదల చేయలేదు. పైగా అప్పటి పనులపై విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించింది. ఆ పనుల్లో ఎలాంటి తప్పిదాలూ లేవని విజిలెన్స్ తేల్చి చెప్పింది. అయినా వదలకుండా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో విచారణకు సిద్ధమయ్యారు. దీంతో నీరు చెట్టు పనులపై తాము విచారణ చేయబోమని పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల అధికారులు తేల్చి చెప్పారు. దీంతో.. జగన్ మరింత ఉక్రోషానికి లోనయ్యారు. న్యాయస్థానం పదే పదే ఆదేశిస్తున్నా .. కోర్టు ధిక్కరణ కింద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ .. శిక్షలు వేస్తున్నా .. జగన్ మాత్రం చలించలేదు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర నీటి యాజమాన్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు నేతృత్వంలోని బృందం తమ బకాలు చెల్లించాలంటూ వినతిపత్రాన్ని అందించింది. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. చెల్లించాల్సిన రూ.650 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా రూ.256 కోట్లను విడుదల చేసింది.

పల్లెల్లో పండుగలా పంద్రాగస్టు

- సైనికులు, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించుకునే దిశగా కార్యక్రమాలు
- ఉపాధి నిధులపై గ్రామ సభల్లో నిర్ణయం
- పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం: డిప్యూటీ సీఎం పవన్



జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే విజయ్ కుమార్

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామాలకు జీవం పోసేలా పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన చేశారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వివిధ మార్గాల్లో ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. చాలాకాలంగా అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోవడానికి అసలు కారణాలను అన్వేషించే ప్రయత్నం చేసినట్లు వివరించారు. అనేక సమీక్షల తరువాత మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు జనసేనాని పేర్కొన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించాలి. ఉపాధి హామీ పథకం పనులు గ్రామాల్లో చేపట్టే విషయంపై తీర్మానాలు చేయాలి. ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులతో ఈ సమావేశం జరుగుతుంది. చేయాల్సిన పనులపై ప్రజల మధ్యలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటారు. గత ఐదేళ్లలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.4,000 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో వాటి ఫలాలు అందిన దాఖలాలు కనపడటం లేదు. నిధులు జేబులో వేసుకున్నారే తప్ప వాటి వల్ల ప్రయోజనాలు ఎక్కడా కనపడలేదు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాం. జల్‌జీవన్ మిషన్ నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా నిర్ణయం తీసుకుంటాం. ఆగస్టు 15న జెండా వందనాన్ని పండుగలాగా చేయాలని నిర్ణయించాం. అందుకోసం రూ.10 వేలు, రూ.25 వేలు ఖర్చు చేసుకోవడానికి అనుమతులిచ్చాం. సర్పంచ్‌ల ఆత్మగౌరవం ఏ మాత్రం తగ్గకూడదు. ఆరోజు స్వాతంత్ర్య సమర యోధులు, దేశం కోసం పనిచేసిన సైనికులు, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించుకునేలా కార్యక్రమాలను చేపట్టాలని సర్పంచ్‌లకు పిలుపునిచ్చాం.' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఇంకెన్నాళ్లు..!







బందరు రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు తలపెట్టిన వీఆర్ సిద్ధార్థ కళాశాల పంట కాల్వ రోడ్డు వంతెనకు ఇంకా మోక్షం లభించలేదు. నిధుల లేమితో వంతెన సౌండ్ ప్రూఫింగ్, లైటింగ్ పనులు పెండింగ్‌లో పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోపోవడంతో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వమైనా పూర్తిచేస్తుందని భావించిన వారికి ఇంకా ఎదురుచూపులు తప్పలేదు. ఇటీవల ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వంతెన పనులు వేగంగా పూర్తి చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. వంతెనపై ప్రయాణాలు లేకపోవడంతో మోటారు వాహనాలకు పార్కింగ్ ప్రదేశంగా తయారైంది. రాత్రిళ్లు గంజాయి సేవనం, మద్యపానం లాంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. దీంతో స్థానికులు అటువైపు వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా పెండింగ్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తేవాలని వారు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ.







మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

కార్మికులకు న్యాయం చేయండి

● మంత్రిని కోరిన ఇఫ్టూ నేతలు

మొగల్రాజపురం, ఆగస్టు 10: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధికి భంగం కలిగే ఆటో, మోటారు కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ శనివారం రవాణాశాఖ మంత్రి యం రాంప్రసాద్ రెడ్డికి భారత కార్మిక సంఘాల సమాఖ్య అనుబంధ ఏపీ ప్రగతిశీల ఆటో, మోటారు వర్కర్స్ యూనియన్ నేతలు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నేతలు ఏ రవిచంద్ర, డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటారు రంగంలో ప్రవేశ పెట్టిన చట్టాలతో డ్రైవర్లు పడే మానసిన వేదన గుర్తించి కేంద్రం రద్దు చేసిందని వాటిని ఏపీలోనూ రద్దుచేయాలని కోరామన్నారు. ఉచిత బస్సు పథకం ప్రారంభించే ముందు ఆటో, మోటారు కార్మికుల సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరామన్నారు. తమ విజ్ఞాపనలు విన్న మంత్రి రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. మునిశంకర్, సీహెచ్ పెద్దిరాజు, పీ రఫీ ఖాన్, డీ శ్రీధర్ బాబు, రాము పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఏపీఎన్‌జీజీఎస్‌కు అండగా ఎన్జీవోస్

● పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్

పాయకాపురం, ఆగస్టు 10: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల (ఏపీఎన్‌జీజీఎస్) సమస్యల పరిష్కారానికి ఏపీఎన్‌జీవో అసోషియేషన్ అండగా ఉంటుందని అసోషియేషన్ పశ్చిమ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ అన్నారు. నగరంలోని గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై విద్యాసాగర్ మాట్లాడుతూ సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్‌జీవో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా మాట్లాడుతూ 2023లో విడుదల చేసిన జీవో ప్రకారం ఫీల్డ్ విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులకు విముక్తి కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఏపీఎన్‌జీజీఎస్ అసోషియేషన్ ఉద్యోగుల ప్రతినిధి పి.అశ్వర్థప్ప, కాశీ విశ్వనాథ్, టి. రామాంజనేయులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా రమణ

గవర్నర్‌పేట, ఆగస్టు 10: ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో శనివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ జిల్లాల నుంచి సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా కేవీ రమణ, సహాధ్యక్షుడిగా హెచ్‌డీ ఈరన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. రత్నప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం. సునీల్‌కుమార్, కోశాధికారిగా సీహెచ్ ఆనంద్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జె. సునీత, ఉపాధ్యక్షులుగా శివనాయుడు, కె అమలాకుమారి, సంయుక్త కార్యదర్శులుగా నవీన్‌కుమార్, 18 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రమణ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందన్నారు. నూతన కార్యవర్గాన్ని ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు కేవీ శివారెడ్డి, బొప్పరాజు వెంకటేశ్వర్లు, సీహెచ్ పురుషోత్తం నాయుడు, ఏ విద్యాసాగర్ అభినందించారు.

దుర్గమ్మా.. నీ సన్నిధికొచ్చే దారేదమ్మా..!

● గుడికి వెళ్లేందుకు భక్తులకు ఇబ్బందులు ● వన్‌టౌన్‌లో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీ

వన్‌టౌన్, ఆగస్టు 10: వన్‌టౌన్‌లో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్‌కు పరిష్కారం కనిపించటం లేదు. ఆయా ప్రాంతాల్లో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. అమ్మవారి గుడి ఘాట్ రోడ్డు, స్వాతి సెంటర్, గొల్లపూడి, కుమ్మరిపాలెం మెయిన్ రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్లకు రెండువైపులా పెద్ద పెద్ద వాహనాలు వస్తుండటంతో ట్రాఫిక్ రద్దీగా మారి గజిబిజిగా తయారవుతోంది. గుడికి వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ అంబులెన్స్‌లు, వాహనాల్లో వెళ్లాలంటే ట్రాఫిక్ చిక్కుల వల్ల అనేక ఇక్కట్ల పాలవుతున్నారు. ఏ ట్రాఫిక్ సీఐగానీ, ఏసీపీలు గానీ ఈ అంశాన్ని పరిశీలించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ట్రాఫిక్ సీఐ సుధాకర్ కొంతవరకు ట్రాఫిక్ రద్దీని నియంత్రించినప్పటికీ, పరిస్థితిలో మార్పు కనపడటం లేదు. వన్‌టౌన్ మార్కెట్, గొల్లపూడి మార్కెట్, తదితర చోట్ల నుంచి అమ్మవారి గుడికి వెళ్లే భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇంద్రకీలాద్రి మార్గంలో భారీగా పెరిగిన ట్రాఫిక్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌సీయూఎఫ్ నేతలు

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వాలి

ఏఐఎస్‌సీయూఎఫ్ ఏపీ చాప్టర్ జనరల్ సెక్రటరీ పేటేటి

వన్‌టౌన్, ఆగస్టు 10: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని ఆలిండియా షెడ్యూల్ క్యాస్ట్ యునైటెడ్ ఫ్రంట్ (ఏఐఎస్‌సీయూఎఫ్) ఏపీ చాప్టర్ జనరల్ సెక్రటరీ పేటేటి రాజశేఖర్ డిమాండ్ చేశారు. క్రైస్తవ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ క్యాస్ట్ వారికి ఏ మతం తీసుకున్నా రాజ్యాంగంలో పొందుపరచిన ఎస్సీ హోదా, రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుందన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను రద్దు చేసి దళిత క్రైస్తవులను దేశ మూలవాసి పౌరులుగా గర్తించాలని డిమాండ్ చేశారు. 1950 ఆగస్టు 10న జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను రాజ్యసభలోని గానీ, పార్లమెంట్‌లోగానీ ప్రవేశపెట్టలేదని, అత్యున్నత న్యాయస్థానాల పరిధిలోకి తీసుకురాకుండా ఆమోదించారన్నారు. దీంతో రాజ్యాంగంలోని 25, 26, 27, 28 ఆర్టికల్స్ ప్రకారం షెడ్యూల్ కులాల వారు మత స్వాతంత్ర్య హక్కును కోల్పోతున్నారని, దీన్ని పార్లమెంట్‌లో చర్చించటంతో పాటు సుప్రీం కోర్టు ద్వారా ఉపసంహరించాల్సిందిగా కోరారు. అప్పట్లో బీఆర్ అంబేడ్కర్ ప్రకటించిన హిందూ మతాన్ని, దాని అసమానతలను, అణచివేతలను విడిచి మళ్లీ పుట్టానన్న వ్యాఖ్యలను రాజశేఖర్ గుర్తు చేశారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ రాజ్యాంగ హక్కులను కాలరాసేలా ఉందన్నారు. మైనార్టీలు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, నాస్తికులు, షెడ్యూల్ జాతులకు చెందిన అందరూ హిందూమత మూర్ఖత్వాలకు వ్యతిరేకంగా బాబా సాహెబ్ అంబేడ్కర్ హిందూమతాన్ని విసర్జించిన రోజును గుర్తుచేసుకుని వారిబాటలోనే నడవాలని పిలుపు నిచ్చారు.

రెవెన్యూలోనే కొనసాగించండి

● గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నేతల వినతి

వన్‌టౌన్, ఆగస్టు 10: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రేడ్‌ల విధానం తీసివేసి తమను రెవెన్యూ డిపార్టుమెంట్‌లోనే కొనసాగించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్ అన్నారు. ఈ విషయాన్ని అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు తెలియజేస్తున్నామని, ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం గాంధీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె అనుపమ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్వోలకు తగిన గర్తింపు లేకుండా చేసిందన్నారు. సెలవులు లేకుండా ఎన్నో ఒత్తిళ్ల మధ్య 24 గంటలూ తమ కష్టాన్ని దోచుకున్నారన్నారు. తగిన వేతనాలివ్వకుండా ఐదేళ్లుగా గ్రేడ్ సిస్టమ్‌ను తెచ్చారన్నారు. ఒకే జాబ్ చార్ట్ ఉన్నప్పటికీ గ్రేడ్-2 వీఆర్వోలను మునిసిపల్ అధికారులకు, మండలాభివృద్ధి అధికారులకు అధికారాలిచ్చి సర్వీసు విషయంలో తీరని అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీడీవో తహసీల్దార్లను నియమించటం వలన వీఆర్వోలందరూ రెవెన్యూ డిపార్టుమెంట్ ద్వారా అన్ని సర్వీసులకు పూర్తి బాధ్యతలతో పనిచేస్తారని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందచేయటంలో తమ పాత్ర పోషిస్తారన్నారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కేపీ చారి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు రామారావు, కృష్ణాజిల్లా కార్యదర్శి కె.నాగరాజు, గుంటూరు జిల్లా కార్యదర్శి బి.రాజేష్‌లతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉప్పులేటి కల్పన కార్యాలయంలో అగ్నిప్రమాదం

● ఫర్నిచర్ దగ్ధం..మంటలు అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

పామర్రు, ఆగస్టు 10: విజయవాడ రోడ్డులోని వాణి సదన్ అపార్ట్‌మెంట్‌లో మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన కార్యాలయంలో శనివారం విద్యుదాఘాతం వల్ల అగ్నిప్రమాదం జరిగింది. కార్యాలయ ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపుచేశారు. విద్యుత్ ఇన్నర్ కేబుల్‌వైర్లు షార్ట్ అయ్యాయని, నష్టం రూ.పదివేలుగా అంచనా వేశామని అగ్నిమాపకశాఖ సిబ్బంది తెలిపారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును నగరంలో ఏర్పాటు చేయాలి: ఆళ్ల

వన్‌టౌన్, ఆగస్టు 10: కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని నగరలోనే ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాల కృష్ణారావు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ కమిటీ ప్రాజెక్టు చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి, సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌలూరి రాజా చంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ శనివారం వినతిపత్రం అందించారు. సీఎంకు రాసిన వినతిపత్రాన్ని టీడీపీ అధ్యక్షుడికి అందించారు. కృష్ణానీటి యాజమాన్య బోర్డును ఎందుకు ఏర్పాటు చేయాలి? దాని పూర్వాపరాలు ఏమిటన్నది వినతిపత్రంలో వివరించారు. ఇప్పటికే బోర్డు చైర్మన్‌కు అధికారులకు ఇదే వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని, రాష్ట్ర రైతుల నీటి హక్కులను కాపాడేలా కృష్ణాబోర్డును నగరానికి తరలించేందుకు ప్రయత్నిస్తామన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న ఆళ్ల

వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపటం హర్షదాయకం

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా

వన్‌టౌన్, ఆగస్టు 10: ముస్లిం సమాజానికి ప్రమాదకరమైన వక్ఫ్ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించటం హర్షదాయకమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా అన్నారు. గు రునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ క్ఫ్ బిల్లులో సవరణలు ముస్లిం సమాజానికి ఇబ్బంది కలిగించేలా ఉండటంతో దీన్ని అడ్డుకోవాలని ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), హరీష్ మాధుర్‌కు తెలియజేశామన్నారు. దీనిపై వారు తాము సీఎం చంద్రబాబుతో మాట్లాడామన్నా రు. మొత్తానికి బిల్లు జేపీసీకి వెళ్లిందని, ఎన్డీయే కూటమిలో ఉన్నప్పటికీ చంద్రబాబు చొరవ తీసుకుని బిల్లును జేపీసీకి పంపటంలో కృషి చేశారని ఆయనకు, ఎంపీలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ విషయంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. మౌ లానా అబ్దుల్ సత్తార్, మౌలానా నసీం మహ్మద్ మౌలానా అమీరుల్ హఖ్, ఎండీ నూరుద్దీన్, షేక్ ఆషా పాల్గొన్నారు.



ముగ్గురు ఆడపిల్లలతో హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్

ముగ్గురు ఆడపిల్లలకు అండగా హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్

వన్‌టౌన్, ఆగస్టు 10: నగరంలోని హె ల్పింగ్ హ్యాండ్స్ వెంక ట్ ముగ్గురు ఆడపిల్ల ల బాధ్యత తీసుకున్నారు. నెల్లూరు నుం చి వచ్చిన మేరీ తన ముగ్గురు ఆడబిడ్డలతో నిలువ నీడలేక ఆకలితో, కాలే కడుపుతో రోడ్డుపై జీవిస్తున్నారు. ఆ పిల్లలు స్కూల్‌కు వెళ్లటం లేదు. జీవనాధారం లేకపోవట మే కాక ఆధార్ కార్డు లేని పరిస్థితి. ఈ సందర్భంలో వారిని గుర్తించిన హెల్పింగ్‌హ్యాం డ్స్ వెంకట్ ఆ ముగ్గురికి గంగా, యమున, సరస్వతి అని పేర్లు పెట్టి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించి పెంపకం బాధ్యతను తీసుకున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, ఉండటానికి, తినటానికి పరిస్థితులు లేక చదువుకోవాలనుకునేవారు 9949926465 నంబర్కుజీ ఫోన్ చేయాలని కోరారు.



నడి రోడ్డుపై అగాథం

పెనుగంచిప్రోలు, ఆగస్టు 10: పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామం నుంచి పెనుగంచి ప్రోలుకు వెళ్లే మార్గమధ్యలో గ్రామ శివారు కల్వర్టు నడిరోడ్డు మీద పెద్ద రంధ్రం పడింది. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా ప్రమాద సూచిక మాదిరిగా చూపిస్తూ కర్రకు ఎర్రటి క్లాత్ చుట్టి గ్రామస్థులు నిలబెట్టారు.

సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్ర పూజలు

జగ్గయ్యపేట, ఆగస్టు 10: మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు నివాసంలో శనివారం భగవద్రామానుజగోష్ఠి ఆధ్వర్యంలో సా మూహిక హనుమాన్‌చాలీసా పారాయణం, సుదర్శన పెరుమాళ్ తిరు నక్షత్ర పూజలు నిర్వహించారు. 21 సార్లు చాలీసా, విష్ణుసహస్రనామ, సుదర్శన అష్టకంలను సామూహికంగా పారాయణం చేశారు. తన్నీరు నాగే శ్వరరావు, సుధారాణి దంపతులు, కుమార్తె సారూప్యలు పాల్గొన్నారు.



ఆషాడం పెళ్లికొడుక్కి వంద వంటలతో విందు

కిర్లంపూడి, ఆగస్టు 10: ఆషాడం ముగియడంతో శ్రావణంలో ఇంటికి వచ్చిన కొత్త అల్లుడికి ఓ అత్తింటివారు ఇలా వంద రకాల పిండివంటలతో ఆహ్వానం పలికారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో ఉద్దగిరి వెంకన్నబాబు, రమణి దంపతులు వారి అల్లుడు బాదం రవితేజ, కుమార్తె రత్నకుమారి కోసం స్వయంగా వంద రకాల పిండి వంటలు వండి వడ్డించారు. ఆషాడం పూర్తయి శ్రావణంలో అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడి కోసం ఇలా 100 రకాల పిండి వంటలు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన
తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేటు



కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్ట్ గేటు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 10: తుంగభద్ర వరద ఉధృతికి జలాశయం 19వ నంబరు క్రస్ట్‌గేట్ శనివారం రాత్రి కొట్టుకుపోయింది. తుంగభద్ర జలాశయానికి కొన్ని రోజులుగా వరద పెరిగింది. జలాశయం నిండటంతో 33 క్రస్ట్‌గేట్లను ఎత్తి నదిలోకి నీటిని వదులుతున్నారు. 2,3 రోజులుగా వరద తగ్గుముఖం పట్టినా.. జలాశయం భద్రతా దృష్ట్యా దిగువకు వరద నీటిని వదులుతు న్నారు. ఈ నేపథ్యంలో వరద తాకిడికి 19వ నంబరు క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. దీన్ని గమనించిన అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ఉధృతి కారణంగా క్రస్టు గేటును అమర్చడం కష్టతరమని అంటున్నారు. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయానికి 30,668 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఉక్కు ఉద్యోగుల భిక్షాటన

- వేతనాల చెల్లింపులో జాప్యంపై నిరసన



భిక్షాటన చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), ఆగస్టు 10: తమకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు కొందరు శనివారం ఉదయం ప్రధాన పరిపాలనా విభాగం ముందు భిక్షాటన చేపట్టి తమ నిరసన తెలియజేశారు. వీరికి కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఉక్కు ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడంలో కొంత కాలంగా యాజమాన్యం విఫలమవుతోందని వారు ఆరోపించారు. కేంద్ర మంత్రి విశాఖ పర్యటన సందర్భంగా జీతాలు విషయమై మాట్లాడితే యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని, కానీ ఆచరణలో మాత్రం కార్యరూపం దాల్చలేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. జీతాలు అందకపోవడంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సకాలంలో వాయిదాలు చెల్లించలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో కె.పరందామయ్య, కనకరెడ్డి, అప్పారావు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేశాక సర్దుబాటు చేయాలి

- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో 117 రద్దు చేశాకే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, ఆ కొరతను పదోన్నతుల ద్వారా కాకుండా సర్దుబాటు ద్వారా భర్తీ చేయాలనుకోవడం సమంజసం కాదన్నారు. శనివారం విజయవాడలో జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జీవో 117 వల్ల పాఠశాలలకు తీవ్ర నష్టం జరిగిందని ఏపీటీఎఫ్ అధ్యక్షురాలు సీహెచ్ మంజుల అన్నారు. ఒకే మాధ్యమం వల్ల వేలాది టీచర్ పోస్టులు పోయాయన్నారు. జీవో 117, ఇతర సమస్యలపై దశల వారీ ఉద్యమం చేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి తెలిపారు. మొదటి దశలో భాగంగా ఈనెల 12 నుంచి 25 వరకు రాష్ట్రంలో అందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

మున్సిపల్ స్కూళ్లలోనే సర్దుబాటు చేయాలి

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను పురపాలక పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాలని ఎస్టీయూ మున్సిపల్ టీచర్లు డిమాండ్ చేశారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో 59 మున్సిపాలిటీల టీచర్లు సమావేశమయ్యారు. మున్సిపల్ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలు పూర్తిచేయాలన్నారు. జీపీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, 2009 నుంచి మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు.

మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అడ్మిషన్లకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ డిమాండ్ చేశారు. కన్వీనర్ కోటాలో 18951 సీట్లు మిగిలిపోయాయని, వాటికోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలని ఓ ప్రకటనలో కోరారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం

- పెట్రోలు పోసుకొని నిప్పు పెట్టుకున్న వైనం.. పరిస్థితి విషమం
- రాజమహేంద్రవరం నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలింపు



కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి

రాజమహేంద్రవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషను వద్ద శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకోవడం కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగంపేటకు చెందిన షోలాపురి నాగ వరప్రసాద్ సైకిల్ రిపేర్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య ఇంటి వద్ద టైలరింగ్ చేస్తారు. అవసరం కోసం ప్రసాద్ రూ.20 వేలు అప్పు చేశాడు. దఫదఫాలుగా అప్పు తీర్చగా ఇంకా కొంత మొత్తం బాకీ ఉన్నాడు. వాటి కోసం శనివారం అప్పు ఇచ్చిన వ్యక్తి వచ్చి తనకు రావాల్సిన సొమ్ముకింద ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లాడు. ప్రసాద్ వాళ్లింటికి వెళ్లి తాళాలు అడిగినా ఫలితం లేకపోవడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు. ఆ సమయంలో ఏం జరిగిందో ఏమో కాని.. కాసేపటికి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. అక్కడివారు గమనించి మంటలు ఆర్పి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. శరీరంపై సుమారు 80 శాతం కాలిన గాయాలయ్యాయి. న్యాయమూర్తి బాధితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

పీఎస్‌లో ఏం జరిగింది?

ప్రసాద్ ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషనుకు వెళ్లాడు. అయితే అతడి ఫిర్యాదు సమయానికి తీసుకున్నారా? లేదా? తాత్సారం చేయడంతో పాటు పోలీసులు చులకనగా మాట్లాడారా? అన్న విషయాలపై స్పష్టత లేదు. బాధితుడు ఆత్మహత్య చేసుకుంది స్టేషన్ ప్రాంగణంలో కాదంటూ పోలీసులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రసాద్ స్టేషన్‌లో కూర్చున్న తర్వాత ఫోన్‌లో ఎవరితోనో గట్టిగా మాట్లాడుతూ అరిచాడని సమాచారం. ఆ సమయంలో అతడి వద్ద పెట్రోలు బాటిల్ ఉన్నా పోలీసులు ఎందుకు గమనించలేకపోయారు? అన్నది తేలాల్సిన ప్రశ్న.

ప్రకృతి సాగు విస్తరణకు మోడల్ మేకర్స్

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులతో నమూనాలు చేయించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంపై శనివారం తాడేపల్లిలో రెండు రోజులు జరిగిన కార్యశాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రతి నియోజకవర్గానికీ ఇద్దరు మోడల్ మేకర్స్‌తో ప్రకృతి వ్యవసాయ నమూనాలు చేయిస్తామని చెప్పారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సేంద్రియ సాగులో నైపుణ్యం సాధించిన వారు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని, ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా, పోర్చుగల్ నుంచి గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ అవార్డు పొందిన అనంతపురం జిల్లా మహిళా రైతు నెట్టెం నాగేంద్రమ్మను ఘనంగా సత్కరించారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారం కోసం భూమి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో నాగేంద్రమ్మ చేసిన కృషికి పోర్చుగల్ అవార్డు వచ్చినట్లు ఏపీసీఎన్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు.

చెత్త శుద్ధిలో అవినీతి కంపు



- స్వచ్ఛాంధ్ర ముసుగులో కోట్ల దోపిడీ.. రీసైక్లింగ్ చేయకుండానే చేసినట్టు బిల్లుల సృష్టి
- గుంతలు, క్వారీల్లో పడేసి చేతులు దులుపుకొన్న తీరు.. కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు
- మంగళగిరి-తాడేపల్లిలో భారీ కుంభకోణం.. గత ప్రభుత్వ అక్రమాలు వెలుగులోకి


గత వైసీపీ పాలనలో చెత్తను శుద్ధి చేసే పనుల్లో చిత్తశుద్ధిని పక్కనపెట్టి కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు. చెత్తను రీసైక్లింగ్ చేయకుండానే.. చేసినట్టు బిల్లులు సృష్టించి నిధులు దోచేశారు. చెత్తను గుంతలు, చెరువులు, క్వారీల్లో పడేసి చేతులు దులుపుకొన్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఈ అవినీతి బాగోతాన్ని నడిపించారు.

(మంగళగిరి): గత ప్రభుత్వంలో ఘనేశ్వర, ఆకాంక్ష, అవినాష్, తరుణి, సృష్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో చెత్త శుద్ధి పనులను చేపట్టాయి. చెత్తను అరబెట్టి, ఎండబెట్టి, పొడి చెత్తను ట్రోమాల్ విజన్‌లో వేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉంటుంది. మట్టి, ప్లాస్టిక్, రాళ్లు వేరు చేసిన తరువాత రీసైకిల్ చేసిన ఆర్డీఎఫ్ ప్లాస్టిక్‌ను లారీలలో జిందాల్ ప్లాంటుకు తరలించాలి. కానీ, అవేవీ చేయకుండానే పనులు పూర్తయినట్టుగా రికార్డులలో చూపించి నకిలీ బిల్లులను సృష్టించి నిధులు దోచేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు కుమ్మక్కై.. పనులు పూర్తయినట్టుగా ఫీల్డ్ కోఆర్డినేటర్లతో బలవంతంగా సంతకాలు పెట్టించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే పలువురు సిబ్బంది రాజీనామా కూడా చేసినట్టు చెబుతున్నారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ రఘునాథరెడ్డి ఈ ఏడాది మేలో రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్‌తోపాటు మరో 8 మంది సిబ్బంది కూడా రాజీనామా చేశారు. చెత్త రీసైక్లింగ్ పనుల్లో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

రీసైక్లింగ్ చేయకుండానే చేసినట్టు..

మంగళగిరి, తాడేపల్లి మునిసిపల్ పట్టణాల్లో చెత్తను రీసైక్లింగ్ చేయకుండా పెద్ద పెద్ద గుంతలు, చెరువులను పూడ్చి, కొండ క్వారీలను వ్యర్థాలతో నింపేశారు. 2022లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ రెండు పట్టణాలకు విడివిడిగా టెండర్లను పిలిచారు. తాడేపల్లి పరిధిలోని ఎయిమ్స్ రోడ్డు కొలనుకొండ డంపింగ్ యార్డు, మంగళగిరి నిడమర్రు రైల్వే గేటు వద్ద చెత్త రీసైక్లింగ్ బయో మైనింగ్ చేపట్టేందుకు ఘనేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెండర్లు దక్కించుకుని 2022 ఆఖర్లో పనులను ప్రారంభించింది. మంగళగిరి డంపింగ్ యార్డులో లక్షా 33 వేల టన్నుల చెత్త ఉండగా, సుమారు 30 వేల టన్నుల చెత్తను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగతా చెత్తను మంగళగిరి నుంచి టిప్పర్లు, లారీలలో తరలించి కొలనుకొండ వద్ద శర్వాణీ రెడీమిక్స్ ఎదుట ఉన్న 40 అడుగుల లోతు గుంతల్లో పోశారు. ప్రస్తుతం ఎంటీఎంసీ కార్పొరేషన్ చెత్తను వేమారెడ్డి కాలనీలో డంప్ చేస్తున్నారు. తాడేపల్లి కొలనుకొండ డంపింగ్ యార్డులో 95 వేల టన్నుల చెత్త ఉండగా, సుమారు 20 వేల టన్నుల చెత్తను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగిలిన చెత్తతో డంపింగ్ యార్డు పక్కనున్న గుంతలు, చెరువును పూడ్చివేసి చేతులు దులుపుకున్నారు. జరుగుతున్న అక్రమాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, ఫీల్డ్ కోఆర్డినేటర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా మునిసిపల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు మిన్నకుండిపోయారనే ఆరోపణలున్నాయి. రీసైక్లింగ్ అనంతరం ఎన్ని లారీల్లో చెత్తను గుంటూరు నాయుడుపేటలోని జిందాల్ ప్లాంటుకు తరలించారో సరైన సమాచారం లేదు. వంద శాతం పనులను పూర్తిచేసినట్టు చూపించి బిల్లులను మాత్రం రాబట్టుకున్నారు. సుమారు రూ.9 కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దోపిడీలో ఓ ఇంజనీరింగ్ అధికారికి రూ.20 లక్షలు ముట్టినట్టు సమాచారం. అప్పటి పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ప్రమేయంతోపాటు మంగళగిరి మాజీ ఎమ్మెల్యే బంధువు అనధికార భాగస్వామిగా వ్యవహరించినట్టు తెలిసింది. ఈ కుంభకోణంలో సమగ్ర దర్యాప్తు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పదవి లేకుండా ఉండలేకపోతున్న జగన్



అరాచకాలు బయటపడతాయనే ఎదురుదాడి: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 10: జగన్ రెడ్డి పదవి లేకుండా పట్టుమని పది రోజులు కూడా ఉండలేకపోతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శనివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా పూర్తి కాకుండానే పింఛన్ల హామీని నెరవేర్చాం. జగన్ రెడ్డి అయిదేళ్లలో చేస్తానని చెప్పింది కూటమి ప్రభుత్వంలో అయిదు రోజుల్లో చేసి చూపించాం. జగన్ రెడ్డి ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్నాడు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్లాడు. ఆయన అరాచకాలు బయటపడతాయనే ఎదురుదాడి చేస్తున్నాడు' అని విమర్శించారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినవన్నీ చేస్తారు. జగన్ రెడ్డి ఆతృత ఆపుకుంటే మంచిది. రాష్ట్రాన్ని అరాచకంగా మార్చిన జగన్ రెడ్డి శాంతి భద్రతల గురించి మాట్లాడటం చూస్తే గురివింద గింజ సామెత గుర్తుకువస్తోంది. అధికారం పిచ్చి పట్టుకుంది కాబట్టే పదవి లేకుండా ఉండలేకపోతున్నాడు. ఆ పిచ్చి ముదరకముందే వైద్యం చేయించుకోవాలి' అని పేర్కొన్నారు. జగన్ రెడ్డికి ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం చేసే తప్పులను నిలదీయాలని బుద్దా హితవు పలికారు.

ఇసుక మింగేశారు...
మద్యం తాగేశారు

- రెంటిలో కలిపి 45 వేల కోట్ల అవినీతి
- ఎక్సైజ్, మైనింగ్ అక్రమాలపై సీఐసీఐడీ విచారణ
- అక్టోబరు 1 నుంచి నూతన ఎక్సైజ్ విధానం, నుంచి ఓపెన్ రీచ్‌లకు అనుమతి: మంత్రి కొల్లు



రాజమహేంద్రవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్, ఎక్సైజ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ జరిపిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శనివారం ఆయన మైన్స్, ఇరిగేషన్, సెబ్ తదితర అధికారులతో ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మైనింగ్‌లో సుమారు రూ.20 వేల కోట్లకు పైగా, ఎక్సైజ్‌లో సుమారు రూ.25 వేల కోట్ల అవినీతి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అందుకే ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించింది. మైనింగ్ డిపార్ట్‌మెంట్‌ను ప్రక్షాళన చేస్తున్నాం. గత మైనింగ్ మంత్రి, మైనింగ్ డైరెక్టర్ అక్రమాలు తూర్పుగోదావరి జిల్లాలో కూడా ఉన్నాయి. విచారణలో అన్నీ బయటకువస్తాయి. ఏడాదికి రాష్ట్రంలో 3 కోట్ల టన్నుల ఇసుక అవసరమనే అంచనా ఉంది. రాష్ట్రంలో అవసరాలకు సగం ఇసుక గోదావరి నుంచే వస్తుంది. అక్టోబరు 15 నుంచి ఓపెన్ రీచ్‌లు అమల్లోకి వస్తాయి. ఈలోపు గోదావరిలో గుర్తించిన డీసిల్టేషన్ పాయింట్లు ఎనిమిదింటిలో వారం రోజుల్లో ఇసుక తీత మొదలవుతుంది. బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతి ఇస్తాం. గతంలో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఉన్న డ్రెడ్జింగ్ అనుమతిపై కూడా పరిశీలిస్తున్నాం. అక్టోబరు 1 నుంచి మంచి ఎక్సైజ్ విధానాన్ని అమల్లోకి తేస్తాం. లిక్కర్‌లో ఎక్కువగా కిక్ ఇవ్వడానికి ఏదో పదార్థాలు కలిపినట్లు కూడా సమాచారం ఉంది. ప్రయోగశాలల్లో పరీక్షిస్తున్నారు' అని మంత్రి కొల్లు తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, గనులు దోచేసిన ఘనుల సంగతి విచారణలో తేలుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో
ఇద్దరు సైనికులు మృతి

శ్రీనగర్, ఆగస్టు 10: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన భీకర కాల్పుల్లో ఇద్దరు భారత సైనికులు అమరులయ్యారు. మరో నలుగురు గాయపడ్డారు. విశ్వసనీయ సమాచారంతో శనివారం అనంత్‌నాగ్ జిల్లాలోని అహ్లాన్ గగర్‌మండు అడవుల్లో ఉగ్రవాదుల కోసం సైనికులు గాలింపు చర్యలు చేపట్టారు. అడవిలో నక్కిన ఉగ్రవాదులు ఒక్కసారిగా సైనికులపై కాల్పులు జరపడంతో ఆరుగురు సైనికులతో పాటు మరో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు సైనికులు కన్నుమూసినట్లు అధికారులు తెలిపారు. సైనికులపై కాల్పులు జరిపిన తీవ్రవాదులు పారిపోకుండా కోకెర్‌నాగ్, అనంతనాగ్‌లలో భారత జవాన్లు, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలను భారీగా మోహరించినట్లు వారు చెప్పారు.

సీడీ నిర్వహణలో
చట్టనిబంధనలు పాటించాల్సిందే

- దర్యాప్తు అధికారులకు హైకోర్టు స్పష్టీకరణ
- ఐవోలకు సూచనలు చేయండి.. డీజీపీకి హైకోర్టు ఆదేశం
- ఎన్ఎస్‌యూఐ నేత హత్య కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- ప్రధాన నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్ల కొట్టివేత



అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కేసు డైరీ(సీడీ) పార్ట్-1 నిర్వహణ విషయంలో దర్యాప్తు అధికారుల ఉదాసీన వైఖరిని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. సీడీ నిర్వహణ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 192, చట్టనిబంధనలకు అనుగుణంగా ఉండాలని దర్యాప్తు అధికారులకు స్పష్టం చేసింది. అప్పుడే రికార్డుల ప్రామాణికత, దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరుగుతుందని పేర్కొంది. సీడీ పార్ట్-1 నిర్వహణ విషయంలో రాష్ట్రంలోని దర్యాప్తు అధికారులందరికీ సూచనలు చేయాలని డీజీపీని ఆదేశించింది. తీర్పు ప్రతిని డీజీపీకి పంపించాలని రిజిస్ట్రార్ జనరల్‌కు స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారి కోర్టు ముందు ఉంచిన కాల్‌రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలిస్తే కాంగ్రెస్‌పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, బిర్రు సంపత్‌కుమార్ హత్య కేసులో పిటిషనర్ల పాత్ర ఉన్నట్లు కనిపిస్తోందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేసులో ప్రధాన నిందితులైన న్యాయవాదులు కేసీ కృష్ణారెడ్డి, కేసీ నాగార్జునరెడ్డి, డాక్టర్ కేసీ సాయి ప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి ఇటీవల తీర్పిచ్చారు. కేసు వివరాలిలా.. శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, బిర్రు సంపత్ కుమార్ హత్యకు గురయ్యారు. ఈ వ్యవహారంలో ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు ఈ ఏడాది మే 30న కేసు నమోదు చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా సుపారీ తీసుకొని హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వాంగ్మూలం ఆధారంగా న్యాయవాది కేసీ కృష్ణారెడ్డి, అతడి కుమారులు న్యాయవాది కేసీ నాగార్జునరెడ్డి, డాక్టర్ కేసీ సాయి ప్రసాద్‌రెడ్డిలను కేసులో ప్రధాన నిందితులుగా చేర్చారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం విచారణకు రాగా పోలీసుల తరఫున సహాయ పీపీ ఏ సాయి రోహిత్ వాదనలు వినిపిస్తూ.. న్యాయవాది కేసీ కృష్ణారెడ్డి, మృతుడి స్నేహితుడు శ్రీకాంత్ మధ్య భూవివాదం ఉందన్నారు. శ్రీకాంత్‌కు సంపత్‌కుమార్ అండగా ఉండడంతో వీరి ఇరువురినీ హత్య చేసేందుకు కృష్ణారెడ్డి సుపారీ ఇచ్చారు. నిందితులిచ్చిన వాంగ్మూలం, ఫోన్ కాల్ రికార్డుల ఆధారంగా పిటిషనర్ల ప్రోద్బలంతోనే సంపత్ కుమార్‌ను హత్య చేసినట్లు తేలిందన్నారు. సహాయ పీపీ వాదనలు, కేసు డైరీని పరిశీలించిన న్యాయమూర్తి కేసు డైరీ పార్ట్-1 నిర్వహణలో పోలీసుల ఉదాసీన వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. దర్యాప్తు పురోగతికి సంబంధించి రోజువారీ వివరాలను కేసు డైరీలో పేర్కొనకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కోర్టు ముందు ఉన్న వివరాలను పరిశీలిస్తే హత్య వ్యవహారంలో పిటిషనర్ల పాత్ర ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.



ఆర్‌జీ కర్ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్ల ఆందోళన

పశ్చిమబెంగాల్‌లో
జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం

- ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కాలేజీలో ఘటన.. అనుమానితుడి అరెస్టు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరపాలని సీఎం మమత ఆదేశం

కోల్‌కతా, ఆగస్టు 10: కోల్‌కతాలో దారుణం చోటుచేసుకుంది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో పనిచేసే ఓ పీజీటీ(పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ) వైద్యురాలిపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె.. గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రిలోని మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు ప్రాథమిక శవపరీక్షలో నిర్ధారణ అయింది. మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు తేలింది. అలాగే ఆమె ముఖం, పెదాలు, మెడ, కడుపు, వేళ్లు, కాలి మడమపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య ఆమె హత్యకు గురై ఉండొచ్చని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసుకు సంబంధం ఉందన్న అనుమానంతో ఇప్పటికే ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అతను బయటి వ్యక్తి అని, ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో స్వేచ్ఛగా తిరిగినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజీ, విరిగిపోయిన బ్లూటూత్ పరికరం(ఇయర్‌బడ్) ఆధారంగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తిని శనివారం కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి 14 రోజుల పోలీస్ రిమాండ్‌కు అనుమతి ఇచ్చారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసులో నిందితుడికి గరిష్ఠ శిక్ష పడేలా చూస్తామని కోల్‌కతా పోలీస్ కమిషనర్ విన్సెంట్ గోయెల్ చెప్పారు. ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశామని, పారదర్శకంగా విచారణ జరుపుతామని తెలిపారు.

అవసరమైతే ఉరి శిక్ష వేయిస్తాం: మమత


జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. అవసరమైతే హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి కూడా తమ ప్రభుత్వం వెనకాడదన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చిన ఆమె, తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. 'నా కుటుంబంలో ఒకరిని కోల్పోయినంత బాధగా ఉంది' అని పేర్కొన్నారు. ఈ కేసు విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "హంతకుడికి కచ్చితంగా కఠిన శిక్ష పడాలి. ఇప్పుడు ఆందోళన చేస్తున్నవారికి రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేకపోతే కచ్చితంగా ఇతర దర్యాప్తు సంస్థలనూ ఆశ్రయించవచ్చు. ఎలాంటి ఇబ్బందీ లేదు. ఎలాగైనా సరే హంతకుడికి కఠిన శిక్షపడాలి. నిరసన తెలుపుతున్న డాక్టర్లు రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అంతర్గత భద్రత బాధ్యత ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లది కూడా. ఈ విషయంలో అవసరమైతే వారి నిర్లక్ష్యంపై కూడా దర్యాప్తు చేపడతాం" అని మమత చెప్పారు. కాగా, జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హతమార్చిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్‌లోని ప్రభుత్వాస్పత్రుల్లో జూడాలు ఆందోళనలు చేపట్టారు. జూనియర్ వైద్యురాలి హత్యపై బెంగాల్ సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

సీబీఐతో విచారణ జరిపించాలి: బీజేపీ

వైద్యురాలి హత్యపై సీబీఐతో విచారణ జరిపించాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ చేసింది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారని.. ఈ ఘటనపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి డిమాండ్ చేశారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించాల్సిన మమత సర్కారు.. 11 మందితో విచారణ కమిటీని నియమించి చేతులు దులుపుకొందని ఆరోపించారు. అంటే ప్రభుత్వం ఈ కేసులో వాస్తవాలను దాచిపెట్టాలని చూస్తున్నట్లుగా ఉందన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైద్య విద్యార్థులు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

తెలుగు రాష్ట్రాల్లో విమానయాన అభివృద్ధికి కృషి

- దేశంలోని విమానాశ్రయాల్లో ప్రపంచస్థాయి భద్రత
- చంద్రబాబు ముందుచూపుతోనే జీఎంఆర్ ఎయిర్‌పోర్టు
- రెండేళ్లలో భోగాపురం విమానాశ్రయం పూర్తి: కేంద్రమంత్రి రామ్మోహన్



శంషాబాద్ విమానాశ్రయం వద్ద 10కే రన్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో విమానయాన రంగం అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 11 వరకు ఏవియేషన్ కల్చర్ వీక్ నిర్వహణలో భాగంగా శనివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఎరీనాలో 10కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు(శంషాబాద్ ఎయిర్‌పోర్టు) నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుల్లో ఒకటని, అందుకు కారణం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అని చెప్పారు. చంద్రబాబు ముందుచూపుతో నేడు వేలాది మందికి ఉద్యోగావకాశాలు దక్కాయన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వేలాది ఎకరాలు ఎందుకని నాడు కొందరు ప్రశ్నించారని, అయితే, అప్పటి దూరదృష్టితో నేడు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను మరో రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలి? ఎక్కడ ప్రజా రవాణాకు అవకాశం ఎక్కువ ఉంది? ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుకూలమైన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆరా తీస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు ఇంటికో మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. దేశంలోని విమానాశ్రయాల్లో ప్రపంచ స్థాయి భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. విమానాశ్రయాల్లోని భద్రతా సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని, పాజిటివ్‌గా ఆలోచించాలని సూచించారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నేడు ఈ స్థాయికి రాగలిగిందంటే సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ వంటి భద్రతా సిబ్బందే కారణమన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది, ఎయిర్‌పోర్టు అధికారులు.. ప్రయాణికులకు అవసరమైన అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి మనిషి జీవితంలో వ్యాయామం తప్పనిసరి అన్నారు. తెలంగాణలో మరో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణీకర్ మాట్లాడుతూ జీఎంఆర్ విమానాశ్రయాన్ని ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.